ఆదివారం
09-11-2025
హైదరాబాద్ ప్రచురణ
సంపుటి : 10, సంచిక : 48
పేజీలు : 8, వెల: రూ.6.00
Simultaneously published from Hyderabad, Vijayawada, Visakapatnam, Tirupathi, Kurnool, Karimnagar, Khammam
www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

మల్టీకలర్ ప్రింటింగ్
ఇప్పుడు మన విశాలాంధ్ర లో
మ్యాగజైన్స్
లామినేషన్
గమ్ బైండింగ్
బుక్ వర్క్స్
మరియు
పోస్టర్లు
పాంప్లేట్స్
ప్రింట్ చేయబడును
సంప్రదించండి: 94405 73343

డిసెంబర్ 1 నుంచి పార్లమెంట్

న్యూదిల్లీ: పార్లమెంట్ శీతాకాల సమావేశాలు డిసెంబర్ 1వ తేదీ నుంచి డిసెంబర్ 19వ తేదీ వరకు జరగనున్నాయి. మొత్తం 19 రోజులు సమావేశాలు కొనసాగుతాయి. ఈ తేదీలను పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు శనివారం అధికారికంగా ప్రకటించారు. ప్రభుత్వ సిఫారసు మేరకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈ సమావేశాలకు ఆమోదం తెలిపారని కేంద్రమంత్రి తెలిపారు. దీనికి సంబంధించి రిజిజు తన ఎక్స్ ఖాతాలో వెల్లడించారు. మన ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసే, ప్రజల

- మిగతా 2 లో

మరో నాలుగు వందేభారత్ రైళ్లు

వారణాసి: ఉత్తరప్రదేశ్‌లోని తన సొంత నియోజకవర్గం వారణాసిలో ప్రధాని నరేంద్ర మోదీ నాలుగు వందే భారత్ రైళ్లను శనివారం ప్రారంభించారు. బనారస్- ఖజురహో, లక్నో- సహరన్‌పూర్, ఫిరోజ్‌పూర్- దిల్లీ, ఎర్నాకుళం- బెంగళూరు మార్గాల్లో ఈ రైళ్లు పరుగులు పెట్టనున్నాయి. బనారస్ రైల్వేస్టేషన్‌లో ఈ కార్యక్రమం జరిగింది. అనంతరం అక్కడ ఏర్పాటుచేసిన సభను ఉద్దేశిస్తూ మోదీ మాట్లాడారు. దీన్ని అభివృద్ధి పండుగగా ఆయన

- మిగతా 2 లో

అమెరికాలో కారంచేడు విద్యార్థిని మృతి

విజయవాడ: ఎన్నో ఆశలతో అమెరికాలో అడుగుపెట్టిన ఓ విద్యార్థిని జీవితం అర్థాంతరంగా ముగిసింది. చదువు పూర్తి చేసుకుని.. ఉద్యోగంలో చేరి... కుటుంబాన్ని ఆదుకోవాలన్న ఆమె ఆశలన్నీ ఆవిరయ్యాయి. బాపట్ల జిల్లా కారంచేడుకు చెందిన యార్లగడ్డ రామకృష్ణ, నాగమణి దంపతుల కుమార్తె రాజ్యలక్ష్మి (23) అమెరికాలోని ఓ యూనివర్సిటీలో ఎంఎస్ కంప్యూటర్స్ విభాగంలో 2023లో చేరింది. విద్యాభ్యాసం పూర్తి కాగా ఉద్యోగ ప్రయత్నాల్లో ఉంది. మూడు రోజుల క్రితం జలుబు, ఆయాసంతో బాధపడిన ఆమెకు ఈనెల 9వ తేదీకి వైద్యుల అపాయింట్‌మెంట్ లభించింది. గురువారం రాత్రి స్నేహితులతో

- మిగతా 2 లో

ఇదీ లోకం!

రహదారుల నిర్మాణానికి
రూ.60,799 కోట్లు

- పెట్టుబడులకు స్వర్గధామం తెలంగాణ
- ముందుకొస్తున్న బహుళజాతి సంస్థలు
- హైదరాబాద్- విజయవాడ జాతీయ రహదారి 8 లేన్లగా విస్తరణ
- ఆర్ఆర్ఆర్‌కు రూ.36 వేల కోట్లు కేటాయింపు: మంత్రి కోమటిరెడ్డి

విశాలాంధ్ర-హైదరాబాద్: రాష్ట్ర చరిత్రలోనే రూ.60,799 కోట్లతో రహదారుల నిర్మాణం చేపడుతున్నట్లు రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. మౌలిక సదుపాయాల కల్పనతో బహుళ జాతి సంస్థలకు తెలంగాణ కేంద్రంగా మారబోతోందన్నారు. లక్షల కోట్ల పెట్టుబడులు రాష్ట్రానికి రానున్నాయన్నారు. లక్షలాదిమంది గ్రామీణ యువతకు ఉపాధి లభిస్తుందని పేర్కొన్నారు. రహదారుల నిర్మాణంతో రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో పెద్ద సంఖ్యలో పరిశ్రమలు ఏర్పాటు కానున్నాయని వివరించారు. ప్రపంచవ్యాప్తంగా పెట్టుబడిదారులు తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొస్తున్నారని చెప్పారు. నాలుగు లేన్లుగా ఉన్న హైదరాబాద్- విజయవాడ జాతీయ రహదారిని ఎనిమిది లేన్ల రహదారిగా విస్తరించబోతున్నట్టు పేర్కొన్నారు. రహదారి వెంబడి ఉన్న ప్రజల సౌకర్యార్థం... రోడ్డు ప్రమాదాలు నివారించడమే లక్ష్యంగా సర్వీస్ రోడ్ల నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. వీటికోసం రూ.10,400 కోట్లు ఖర్చు చేయనున్నట్టు చెప్పారు. తెలంగాణ రాష్ట్ర గతిని మార్చే రీజినల్ రింగ్ రోడ్డు (ఆర్ఆర్ఆర్) నిర్మాణానికి రూ.36,000 వేల కోట్లు కేటాయించినట్లు వివరించారు. ఆరు లేన్లుగా నిర్మించబోతున్న ఆర్ఆర్ఆర్ అన్ని జిల్లాలను కలుపుతుందని అన్నారు. వీటి నిర్మాణానికి 50 శాతం నిధులను రాష్ట్ర ప్రభుత్వం భరిస్తుందని చెప్పారు. రహదారులు లేని గ్రామీణ ప్రాంతాల్లో కొత్త రోడ్ల నిర్మాణం, సింగిల్ రోడ్డు ఉన్నచోట డబుల్ రోడ్ల నిర్మాణం, హామ్ ప్రాజెక్టుకు రూ.11,399 కోట్లతో టెండర్లు పిలుస్తున్నాం అని మంత్రి కోమటిరెడ్డి వివరించారు. రూ. ఎనిమిది వేల కోట్లతో మన్ననూరు నుంచి శ్రీశైలం వరకు 52 కిలోమీటర్ల ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి ప్రతిపాదనలు తుది దశకు చేరాయన్నారు. దేశానికే తలమానికంగా మారనున్న ఫ్యూచర్ సిటీ నుంచి అమరావతి మీదుగా బందరు పోర్ట్ వరకు గ్రీన్ ఫీల్డ్ హైవే రూ. 20 వేల కోట్లతో నిర్మిస్తున్నట్టు చెప్పారు. నభూతో నభవిష్యత్తు అన్న రీతిలో రహదారుల నిర్మాణానికి పచ్చ జెండా ఊపిన సీఎం రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు ధన్యవాదాలు తెలిపారు.

పేపర్‌లో మధ్యాహ్న భోజనమా?
హృదయం ముక్కలైంది: రాహుల్

న్యూదిల్లీ: మధ్యప్రదేశ్‌లో కొంతమంది చిన్నారులకు న్యూస్‌పేపర్‌లో మధ్యాహ్న భోజనం వడ్డించినట్లు కనిపిస్తున్న దృశ్యాలను కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ 'ఎక్స్' వేదికగా పోస్ట్ చేశారు. ఇది చూసి తన హృదయం తల్లడిల్లిందని పేర్కొన్నారు. ఇంత దయనీయ స్థితిలో దేశ భవిష్యత్తును తీర్చిదిద్దుతున్నందుకు అధికార నేతలు సిగ్గుపడాలని వ్యాఖ్యానించారు. 'మధ్యప్రదేశ్‌లో కొంతమంది చిన్నారులకు మధ్యాహ్న భోజనాన్ని న్యూస్‌పేపర్‌లో వడ్డిస్తున్నట్లు తెలుసుకుని నా హృదయం ముక్కలైంది. ఈ పిల్లల పైనే మన దేశ భవిష్యత్తు ఆధారపడి ఉంది. కానీ, వారికి కనీస గౌరవం దక్కడం లేదు. అక్కడ అభివృద్ధి అంతా భ్రమే. వ్యవస్థలను గుప్పిట్లో పెట్టుకొని అధికారంలోకి వస్తున్నారు. ఇటువంటి దుర్భర స్థితిలో పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దుతున్నందుకు అధికార నేతలు సిగ్గుపడాలి' అని రాహుల్ గాంధీ విమర్శించారు. శోపూర్ జిల్లాలోని ఓ పాఠశాలలో ఈ వీడియో తీసినట్లు తెలుస్తోంది. ఈ వ్యవహారం నెట్టింట వైరల్‌గా మారడంతో ఇంఛార్జి ప్రిన్సిపల్‌పై ఉన్నతాధికారులు సస్పెన్షన్ వేటు వేశారు. స్వయం సహాయక సిబ్బంది సేవలను నిలిపివేశారు. నెటిజన్లు దీన్ని ఖండించారు. మధ్యాహ్న భోజనం అనేది పిల్లల హక్కు అని పేర్కొన్నారు. పోషకాహారం పేరిట అనారోగ్యాన్ని వడ్డిస్తున్నారంటూ విమర్శించారు.

బీజేపీ పాలనలో ప్రజాస్వామ్యం ఖూనీ

- ఓటు చోరీపై రాహుల్ ఎనలేని పోరాటం
- కేంద్రం చెప్పుచేతల్లో ఎన్నికల సంఘం: మహేశ్ కుమార్ గౌడ్

2 లో

సుస్థిర ప్రభుత్వం కోసం
కాంగ్రెస్‌ను గెలిపించండి

- బీఆర్ఎస్ పాలనంతా అవినీతి, అరాచకమే
- ఓటమి భయంతోనే అసత్య ప్రచారం: మంత్రి తుమ్మల

2లో

బీజేపీతో బీఆర్ఎస్ దోస్తీ

- పైకి వ్యతిరేకం... లోపల అనుకూలం
- జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ గెలవాలి
- కమ్యూనిస్టులు ఒక్కటవ్వాలి
- కూనంనేని సాంబశివరావు

విశాలాంధ్ర-హైదరాబాద్: బీఆర్ఎస్... బీజేపీకి అనుకూలమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ గెలిస్తే బీజేపీకి ప్రయోజనమని, అసలు ఆ పార్టీని గెలవనివ్వరాదన్నారు. జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్‌ను గెలిపించాలని ఓటర్లకు పిలుపునిచ్చారు. బీఆర్ఎస్‌కు బీజేపీకి మధ్య దోస్తీ ఏమిటో తెలియదు కానీ పైకి వ్యతిరేకంగా... లోపల ఒకట్టిగా ఉంటున్నట్లు కనిపిస్తోందని కూనంనేని సాంబశివరావు అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలు ఉంటే ఎండగడతాం, సమస్యలపై పోరాడతామంటూ ఓటర్లకు హామీనిచ్చారు. లౌకిక విధానం, సామ్రాజ్యవాదం, మతపరమైన అంశాలలో బీజేపీకి అన్ని విధాలా అనుకూలంగా ఉంటూ... శత్రువుకు శత్రువు మిత్రుడనే సూత్రాన్ని అనుసరిస్తూ... కాంగ్రెస్ వ్యతిరేకంగా బీఆర్ఎస్ వ్యవహరిస్తోందని కూనంనేని వ్యాఖ్యానించారు. జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గం ఉప ఎన్నికలో కాంగ్రెస్‌ను గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సీపీఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూంభవన్‌లో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు పశ్య పద్మ, రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈటీ నరసింహా తో కలిసి కూనంనేని సాంబశివరావు మాట్లాడారు. బీఆర్ఎస్‌కు సొంత వ్యూహం లేదని, బీజేపీతో ఘర్షణ ఎందుకనే వైఖరితో ఆ పార్టీకి అనుకూలంగా ఉంటోందని విమర్శించారు. గతంలో కేసులు ఉన్నాయనే కీలక ఎన్నికలప్పుడు బీజేపీకి అనుకూల వైఖరిని బీఆర్ఎస్ అవలంబించినట్లు తెలిపారు. జూబ్లీహిల్స్ ఎన్నికలోనూ ఇదే పద్ధతిని అనుసరిస్తోందన్నారు. సైద్ధాంతికంగా బీజేపీకి అవకాశం ఇచ్చినట్లుగా బీఆర్ఎస్ పద్ధతి ఉందని, ఈ పరిస్థితుల్లో కాంగ్రెస్‌ను గెలిపించుకోవాలని ప్రజలను కూనంనేని కోరారు. సామ్రాజ్యవాద అనుకూల విధానాలతో దేశానికి నష్టమని హెచ్చరించారు. మోదీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను అనుసరిస్తోందన్నారు. ఓటర్ల ప్రక్షాళన

- మిగతా 2 లో

ఉద్యోగాల కల్పనే లక్ష్యం
16న కొత్తగూడెంలో జాబ్‌మేళ
65 కంపెనీలకు ఆహ్వానం: కూనంనేని

2 లో

బీహార్‌లో రోడ్డుపై ఓటు స్లిప్పులు
అధికారి సస్పెన్షన్- కేసు నమోదు

పట్నా: బీహార్‌లోని సమస్తిపూర్ జిల్లాలో రోడ్డుపై పోల్ స్లిప్స్ పడివుండటం సంచలనంగా మారింది. శుక్రవారం అసెంబ్లీకి తొలి విడత పోలింగ్ జరిగింది. సరైరంజన్ అసెంబ్లీ నియోజకవర్గంలోని కేఎస్ఆర్ కాలేజీ సమీపంలోని రోడ్డు వద్ద పెద్ద సంఖ్యలో వీవీపీఏటీ స్లిప్పులు శనివారం పడేశారు. దీంతో ప్రతిపక్షాలు అనుమానాలు వ్యక్తంచేశాయి. దీంతో ఎన్నికల సంఘం స్పందించింది. బాధ్యులపై చర్యలుకు ఆదేశించింది. ఇదే క్రమంలో ఒక అధికారిపై సస్పెన్షన్ వేటు పడింది. ఈ స్లిప్పులను ఎవరు, ఎప్పుడు, ఎవరి ఆదేశాల మేరకు పడేశారని ప్రధాన ప్రశ్నగా ఉంది. ప్రజాస్వామ్య దోపిడీదారులు ఈ చర్యకు పాల్పడినట్లు ప్రతిపక్షాలు ఆరోపించాయి. సమాధానం చెప్పాలని ఈసీని నిలదీశాయి. స్ట్రాంగ్ రూమ్‌లకు భద్రత పెంచాలని కోరుతూ సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌కు ఆర్జేడీ ఎంపీ మనోజ్ కె ఝా లేఖ రాశారు. పోలింగ్‌కు ముందు ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను (ఈవీఎం) పరీక్షించేటప్పుడు మాక్ పోలింగ్ కోసం వినియోగించిన స్లిప్పులనే రోడ్డుపై గుర్తించినట్లు ఎన్నికల సంఘం వివరణ ఇచ్చింది. సమస్తిపూర్ జిల్లా మేజిస్ట్రేట్ ఘటనా స్థలాన్ని సందర్శించి విచారించినట్లు పేర్కొంది. నిర్లక్ష్యం వహించిన అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్ (ఏఆర్వో)ను సస్పెండ్ చేసినట్లు వెల్లడించింది. ఈ ఘటనపై కేసు నమోదైనట్లు ఈసీ తెలిపింది.

ప్రపంచమంతా విశాఖ వైపు...

- నిర్మాణాత్మకంగా పెట్టుబడుల సదస్సు
- అవినీతి నిర్మూలనకు సమగ్ర చర్యలు: చంద్రబాబు

విశాలాంధ్ర-సచివాలయం : ప్రపంచం మొత్తం విశాఖ వైపు చూస్తోందని... రాష్ట్రానికి పెద్ద ఎత్తున పెట్టుబడులు రావడం శుభపరిణామమని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. శనివారం మంగళగిరి టీడీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో చిట్ చాట్‌లో ఆయన మాట్లాడుతూ విశాఖపట్నంలో ఈ నెల 14, 15 తేదీల్లో పెట్టుబడుల సదస్సు నిర్మాణాత్మకంగా జరుగుతుందని అన్నారు. ప్రజంటేషన్, ఎగ్జిబిషన్, ఒప్పందాల రూపాల్లో రెండు రోజుల పాటు ఈ సదస్సు జరుగుతుందన్నారు. పెట్టుబడుల సాధనలో రాష్ట్ర ఐటీ, పర్యాటక శాఖల మంత్రి నారా లోకేశ్ ఎంతో క్రియాశీలకంగా తీవ్ర కృషితో వ్యవహరిస్తున్నారని చంద్రబాబు ప్రశంసించారు. ఆయన ప్రయత్నాల ఫలితం గానే రాష్ట్రానికి పెద్ద ఎత్తున పెట్టుబడులు తరలివస్తున్నాయని అన్నారు. క్వాంటమ్ కంప్యూటర్ ఇప్పటికే సిద్ధమయిందని... దాని షిప్‌మెంటే ఆలస్యమని తెలియజేశారు. నిర్దిష్ట సమయానికి క్వాంటమ్ కంప్యూటర్ అమరావతికి వచ్చేలా అన్ని చర్యలు తీసుకుంటున్నామని సీఎం చెప్పారు. తెలంగాణకు చెందిన ప్రీమియర్ ఎనర్జీస్ ఏపీ వైపు చూస్తోందని, నెల్లూరు జిల్లా నాయుడుపేటలో రూ.6 వేల కోట్ల వరకు పెట్టుబడులను పెట్టనుండటం రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి, ఉపాధి అవకాశాలకు దోహదపడుతుందని అన్నారు. ఆంధ్ర ప్రదేశ్ తీర ప్రాంతం, మౌలిక సదుపాయాలు, సాంకేతిక పరిజ్ఞానం కారణంగా ప్రపంచ దేశాల దృష్టి విశాఖపట్నంపై పడిందని అన్నారు. రాష్ట్రానికి పెట్టుబడులు, అంతర్జాతీయ గుర్తింపు తీసుకురావడంలో ఇటీవల జరిగిన సీఐఐ సదస్సు గొప్ప వరమని ఆయన అభివర్ణించారు. ఇలాంటి అంతర్జాతీయ స్థాయి సమావేశాలు రాష్ట్ర ప్రతిష్టను పెంచుతాయని, భవిష్యత్‌లో మరిన్ని పెట్టుబడులకు మార్గం సుగమం చేస్తాయని

- మిగతా 2 లో

కబ్జా కోరల్లో చెరువులు

- లేఅవుట్లుగా మారిపోతున్న వైనం
- తగ్గిపోతున్న ఆయకట్టు

విశాలాంధ్ర-సచివాలయం: రాష్ట్రంలో చెరువులు ఒక్కొక్కటిగా మాయమవుతున్నాయి. కొన్ని గ్రామాల్లో కబ్జాకు గురైన చెరువులు రాత్రికి రాత్రే లేఅవుట్లుగా మారుతున్నాయి. చెరువులను చదును చేసి వాణిజ్య సముదాయాలనే నిర్మించేస్తున్న వైనం కూడా సాగుతోంది. ఫలితంగా చెరువు ఆయకట్టు తగ్గిపోతోంది. ఉమ్మడి 13 జిల్లాల పరిధిలో ఉన్న 1.13 లక్షల చెరువులలో 46 వేలకు పైగా సాగుకు నీరందిస్తున్నాయి. మరో 50 వేలకు పైగా చెక్ డ్యామ్‌లు, ఊట చెరువులు ఉన్నాయి. 41 వేల చెరువుల పరిధిలోని 250-500 ఎకరాలలో పంటలు సాగవుతున్నాయి. వీటిలో 50 శాతానికి పైగా చెరువులు వర్షాధారం... మరో 20 వేల చెరువులకు ఆయా ప్రాంతాల్లోని ప్రాజెక్టుల నుంచి నీటిని మళ్లిస్తున్నారు. చెరువుల విషయంలో నీటిపారుదల శాఖ నిర్లక్ష్యం వ్యవహరిస్తున్నది. చెరువుల అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తుంటే... ప్రధాన రహదారులకు ఇరువైపులా ఉన్న గ్రామాలకు చెందిన చెరువులు రాత్రికి రాత్రే మాయమవుతు అధికారులు పట్టించుకోవడంలేదు. ఒకవైపు

- మిగతా 2 లో

విశాలాంధ్ర
ప్రపంచం
2
హైదరాబాద్
ఆదివారం
9 నవంబరు 2025

450 డ్రోన్లు, 45 క్షిపణులతో రష్యా దాడి

అంధకారంలో ఉక్రెయిన్: జెలెన్‌స్కీ

కీవ్: ఉక్రెయిన్ విద్యుత్ వ్యవస్థ లక్ష్యంగా రష్యా భీకర దాడి చేసింది. 450 డ్రోన్లు, 45 క్షిపణులతో విరుచుకుపడింది. ఇతర మౌలిక వసతులను దెబ్బ తీసింది. దీంతో ఉక్రెయిన్‌లోని అనేక ప్రాంతాలు అంధకారంలో చిక్కుకున్నాయి. దీంతో ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ఆగ్రహం వ్యక్తంచేశారు. రష్యా చమురు రంగంపై మరింత కఠినమైన ఆంక్షలు విధించాలంటూ తమ మిత్రదేశాలకు పిలుపునిచ్చారు. ఉక్రెయిన్ విద్యుత్/చమురు వ్యవస్థలపై దాడులను రష్యా ఇటీవల తీవ్రతరం చేసింది. సహజ గ్యాస్ వసతులను దెబ్బతీసింది. శీతాకాలం రాబోతుండటంతో ఉక్రెయిన్‌లో ఎముకలు కొరికే చలి నేపథ్యంలో దేశానికి ఉష్ణమందించే వ్యవస్థ ధ్వంసం కావడంపై నిపుణులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈశాన్య ఖార్గివ్, దక్షిణ ఒడెసాలోని విద్యుత్ క్షేత్రాలపై రష్యా డ్రోన్ దాడితో అంతటా వైమానిక దాడి సైరన్లు మోగాయి. తూర్పు నగరమైన డ్నిప్రోలో తొమ్మిది అంతస్తుల భవనంపై డ్రోన్ దాడిలో ఒకరు చనిపోగా, చిన్నారి సహా ఆరుగురికి గాయాలయ్యాయని అధికారులు వెల్లడించారు.

నెతన్యాహు అరెస్టుకు టర్కీ వారెంట్

అంకార: గజాలో మారణహోమం సాగిస్తున్న ఇజ్రాయిల్‌పై టర్కీ ఆగ్రహం వ్యక్తంచేసింది. ముందు నుంచి ఆక్షేపిస్తూనే ఉన్న టర్కీ తాజాగా ఇజ్రాయిల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు సహా ఆ దేశ సీనియర్ అధికారుల అరెస్టునకు వారెంట్లు జారీ చేసింది. మొత్తం 37 మంది అరెస్టునకు వారెంట్లు జారీ అయినట్లు ఇస్తాంబుల్ ప్రాసిక్యూషన్ కార్యాలయం ఒక ప్రకటన చేసింది. ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహు, రక్షణ మంత్రి ఇజ్రాయిల్ కట్జ్, జాతీయ భద్రతా మంత్రి ఇతామర్ బెన్ గ్విర్, ఆర్మీ చీఫ్ లెఫ్టినెంట్ జనరల్ ఇయాల్ జమీర్ తదితరుల పేర్లు ఈ జాబితాలో ఉన్నాయి. అయితే పూర్తి జాబితా వెలువడలేదు. కాగా, మార్చిలో ఇజ్రాయిల్ జరిపిన బాంబు దాడిలో గజా స్ట్రిప్‌లో టర్కీ నిర్మించిన టర్కిష్-పలస్తీనియన్ ఫ్రెండ్‌షిప్ హాస్పిటల్ విధ్వంసాన్ని ప్రకటన గుర్తుచేసింది. ఇదిలావుంటే టర్కీ చర్యను ఇజ్రాయిల్ ఖండించింది. ఓ నియంత (టర్కీ అధ్యక్షుడు ఎర్డోగన్‌నుద్దేశించి) పీఆర్ స్టంట్ అంటూ దుయ్యబట్టింది. ధిక్కరణ ఆరోపణలను తిరస్కరిస్తున్నట్లు ఇజ్రాయిల్ విదేశాంగ మంత్రి గిడియాన్ సార్ వెల్లడించారు.

ముగిసిన చర్చలు...లభించని పరిష్కారం

ఉగ్రవాదంపై అఫ్గాన్-పాక్ మధ్య ప్రతిష్టంభన

ఇస్లామాబాద్: పాకిస్థాన్, అఫ్గానిస్థాన్ మధ్య శాంతి కోసం ఒప్పందం జరగలేదు. ఎలాంటి పరిష్కారం లేకుండానే రెండు దేశాల మధ్య శాంతి చర్చలు ముగిశాయి. దీంతో సరిహద్దు ఆవలి ఉగ్రవాదం సంబంధిత సమస్యలపై ప్రతిష్టంభన కొనసాగుతోంది. ఈ మేరకు ఉన్నతాధికారులు వెల్లడించారు. రెండు దేశాల ప్రతినిధులు గురు, శుక్ర, శనివారాల్లో మూడవ దఫా చర్చలు జరిపారు. తెహ్రీక్ ఏ తాలిబన్ పాకిస్థాన్ (టీటీపీ)పై చర్యలు తీసుకుంటామని కాబూల్ రాతపూర్వకంగా హామీ ఇవ్వలేదు. దీంతో నాల్గోవసారి భేటీకి అవకాశం లేదని పాక్ రక్షణ మంత్రి ఖాజా ఆసిఫ్ వెల్లడించారు. సంపూర్ణ ప్రతిష్టంభన నెలకొన్నట్లు తెలిపారు. రాజీ కుదర్చడం కోసం మధ్యవర్తిత్వం వహించిన టర్కీ, ఖతార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. 'టర్కీ ఖతార్ మా వైఖరిని సమర్థించాయి. అఫ్గాన్ కూడా ఏకీభవించింది. అయితే రాతపూర్వకంగా హామీ ఇవ్వలేదు. ఎలాంటి ఒప్పందం జరగలేదు. మౌఖికంగా చెబితే సరిపోదూ లిఖితపూర్వకంగా ఉంటేనే పాక్ అంగీకరిస్తుంది' అని ఆసిఫ్ తెలిపారు. 'టర్కీ ఖతార్ చాలా శ్రమించాయి కానీ చివరకు ఆశలు వదిలేశాయి. అందుకే మేము ఒట్టి చేతులతో తిరిగి రావల్సి వచ్చింది' అని ఆయనన్నారు. అఫ్గాన్ భూభాగాన్ని పాకిస్థాన్‌పై ఉగ్ర దాడులకు వినియోగించరాదన్నదే తమ డిమాండ్‌గా రక్షణ మంత్రి చెప్పారు. అదే సమయంలో తమను కవ్విస్తే తీవ్రంగా ప్రతిఘటిస్తామని హెచ్చరించారు. అఫ్గాన్ కారణంగానే ప్రతిష్టంభన నెలకొందని, దీర్ఘకాలంగా పెండింగ్ ఉన్న అంతర్జాతీయ, ప్రాంతీయ, ద్వైపాక్షిక ప్రతిజ్ఞలకు కట్టుబడటంలో ఆ దేశం విఫలమైందని పాక్ సమాచార శాఖ మంత్రి అత్తావుల్లా తరార్ 'ఎక్స్'లో పేర్కొన్నారు. అఫ్గాన్ ప్రజలపై తమకు అక్కసు లేదన్నారు.

సుస్థిర ప్రభుత్వం కోసం
కాంగ్రెస్‌ను గెలిపించండి

విశాలాంధ్ర - హైదరాబాద్: జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో చారిత్రక తీర్పు ఇవ్వాలని, హైదరాబాద్ అభివృద్ధి ... సుస్థిర ప్రభుత్వం కోసం సీఎం రేవంత్ రెడ్డికి మద్దతుగా ఓటర్లు నిలవాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ విజయాన్ని కాంక్షిస్తూ వెంగళరావు నగర్ డివిజన్‌లో మంత్రి తుమ్మల పార్టీ శ్రేణులతో కలిసి శనివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. వివిధ కాలనీల్లో విస్తృత ప్రచారం చేశారు. స్థానికులు బ్రహ్మరథం పట్టారు. ఈ సందర్భంగా తుమ్మల మాట్లాడుతూ గత ప్రభుత్వంలో అవినీతి, అరాచకం రాజ్యమేలాయన్నారు. అందుకే అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు ప్రజలు బుద్ధి చెప్పారన్నారు. ఉప ఎన్నికలో ఆ పార్టీ గెలిస్తే మళ్లీ తెలంగాణ అవినీతి పాలనలోకి వెళ్లే ప్రమాదం ఉందన్నారు. ప్రశాంతమైన హైదరాబాద్ కోసం బీఆర్‌ఎస్, బీజేపీలను తరిమి కొట్టాలని పిలుపునిచ్చారు. ఓటమి భయంతో బీఆర్‌ఎస్ సోషల్ మీడియాలో అసత్య ప్రచారం చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వంలో కమ్మ సామాజిక వర్గం వారిని వేధించిన ఘటనలు మరచి పోలేదని, తెలుగుదేశం ఓట్ల కోసం బీఆర్‌ఎస్ ఆడే కపట నాటకాలను పసుపు సైన్యం ఎలా తిప్పి కొట్టాలో వారికి బాగా తెలుసని, ఆత్మ గౌరవంతో ఓటు వేయాలని కోరారు. ఎన్ని కుయుక్తులు చేసినా జూబ్లీహిల్స్ గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయమని మంత్రి ధీమా వ్యక్తం చేశారు. వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్, స్థానిక నేతలు పాల్గొన్నారు.

ప్రపంచవ్యాప్తంగా 'వందేమాతరం' వేడుక

వాషింగ్టన్/ఒట్టావా: జాతీయ గీతం వందేమాతరానికి 150 ఏళ్లు పూర్తి అయిన సందర్భంగా ప్రపంచ దేశాల్లోని భారత్ దౌత్య కార్యాలయాల్లో వేడుకలు ఘనంగా నిర్వహించారు. సభలు, సమావేశాలు, సాంస్కృత ప్రదర్శనలతో ఐక్యతా స్ఫూర్తిని, దేశభక్తిని చాటారు. అమెరికా రాజధాని వాషింగ్టన్‌లోని ఎంబసీలో భారతీయ విద్యార్థులు వందేమాతరం గీతాలాపనతో సందడి చేశారు. కెనడా రాజధాని ఒట్టావాలోని హై కమిషన్ కార్యాలయంలో ఒడిస్సీ నృత్య ప్రదర్శన ఆకట్టుకున్నది. దోహా, రియాద్‌లోనూ సాంస్కృతిక కార్యక్రమాలు, వందేమాతరం గీతాలాపనతో వేడుకలు జరిగాయి. కాన్‌బెర్రలో భారత్ హై కమిషన్ పెర్త్‌లో భారీ ఎత్తున కార్యక్రమాన్ని నిర్వహించింది. అలాగే బ్రిటన్ రాజధాని లండన్ సహా నేపాల్, పెరూ, చిలీ, అర్జెంటైనా, కొలంబియా, దుబాయి, సింగపూర్, దక్షిణాఫ్రికా తదితర దేశాల్లోని దౌత్య కార్యాలయాల్లోనూ భారతీయులు వందేమాతరం గీతాలాపనలతో వేడుక చేసుకున్నారు.

డిసెంబర్ 1 నుంచి పార్లమెంట్

(మొదటిపేజీ తరువాయి)

ఆకాంక్షలకు అనుగుణంగా సాగే నిర్మాణాత్మక, అర్థవంతమైన సమావేశాల కోసం తాను ఎదురుచూస్తున్నానని మంత్రి అన్నారు. ఈ సమావేశంలో కీలక బిల్లులు, ఆర్థికాంశాలపై చర్చలు, ప్రశ్నోత్తరాలు జరగనున్నాయి. ప్రతిపక్షాలు అనేక అంశాలపై కేంద్రానికి లోతైన ప్రశ్నలు సంధించే అవకాశం ఉంది. గత సమావేశాల్లో లాగానే ఈసారీ రాజకీయ వేడి రగిలే అవకాశం ఉంది. ఈ శీతాకాల సమావేశాలు 18వ లోక్‌సభకు మరింత కీలకమని, ప్రజా సమస్యలు, దేశ అభివృద్ధి అంశాలపై చర్చ జరిగి, కొత్త చట్టాలు రూపొందే అవకాశం ఉందని రిజిజు చెప్పారు. పార్లమెంట్ సమావేశాలు సఫలం కావాలని, ప్రజలకు మేలు చేకూర్చాలని ఆశిస్తున్నామని ఆయన పేర్కొన్నారు.

బీజేపీతో బీఆర్‌ఎస్ దోస్తీ

(మొదటిపేజీ తరువాయి)

పేరుతో ఓటు హక్కుకు భంగం కలిగిస్తున్నదన్నారు. ఇలాంటి కుట్రతోనే అధికారం నిలబెట్టుకునేందుకు ప్రయత్నిస్తుందని విమర్శించారు. పాకిస్థాన్- భారత్ యుద్ధాన్ని ఆపినట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పదేపదే చెబుతున్నా ప్రధాని మోదీ స్పందించకపోవడం గర్హనీయమన్నారు. దేశ విధానాలను ప్రభావితం చేస్తున్న ట్రంప్ ప్రకటనలతో తమకు సంబంధం లేదని ఎందుకు చెప్పరు? అమెరికా సుంకాలను ఎందుకు వ్యతిరేకించరు? మోదీ మౌనానికి అర్థమేమిటి? అంటూ కూనంనేని ప్రశ్నించారు. ట్రంప్‌కు వ్యతిరేకంగా మాట్లాడకపోవడం వ్యూహాత్మక ఎత్తుగడగా బీజేపీ ప్రచారం చేస్తుందని, ఆ ఎత్తుగడ ఏమిటో వెల్లడించాలని డిమాండ్ చేశారు. ఈ పద్ధతితో దేశ విదేశాంగ విధానాలు, సంప్రదాయాలు, పద్ధతులు మంటగలుస్తాయని హెచ్చరించారు. రష్యా నుంచి చమురు కొనుగోలు చేయకుండా ఇబ్బంది పెట్టినా మోదీ మౌనం కొనసాగిస్తున్నారని అన్నారు. భారత విద్యార్థుల భవిష్యత్తును ట్రంప్ ఆగమాగం చేస్తున్నా, అక్రమ వలసల పేరుతో భారతీయులకు బేడీలు వేసి అవమానించినా మోదీ మాట్లాడలేదని విమర్శించారు. న్యూయార్కు మేయర్‌గా జొహ్రాన్ మమ్దానీ గెలవడంతో జాత్యహంకారానికి, దేశ, ప్రాంతీయ అహంకారానికి ప్రజల వ్యతిరేక రుజువైందని కూనంనేని అన్నారు. ప్రపంచవ్యాప్తంగా కమ్యూనిస్టుల ప్రాధాన్యత పెరుగుతున్నదన్నారు. నేపాల్‌లో కమ్యూనిస్టు పార్టీలు ఒకటయ్యాయని, ఇది మంచి సంకేతమని, భారతదేశంలోనూ కమ్యూనిస్టుల పునరేకీరణను కోరుకుంటున్నామని కూనంనేని సాంబశివరావు వెల్లడించారు. శ్రీలంక ప్రజలు వామపక్షాలను ఆదరిస్తున్నారన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం నిర్వహించిన కమ్యూనిస్టు పార్టీ, అనంతరం పునర్ విమర్శ చేసుకుని సాయుధ పోరాటాన్ని విరమించిందని గుర్తుచేశారు.
ఆపై సార్వత్రిక ఎన్నికల్లో కమ్యూనిస్టులు అత్యంత భారీ మెజారిటీతో గెలిచారని, మావోయిస్టులు కూడా మంచి ఆలోచన చేసి సాయుధ పోరాటాన్ని విరమించాలని కోరారు. 'మావోయిస్టుల త్యాగాలు వృథా కావద్దు. అందరం కలుద్దాం. అప్పుడే దేశానికి మంచి జరుగుతుంది' అని కూనంనేని సాంబశివరావు అన్నారు. ఆపరేషన్ కగార్ పేరుతో కేంద్ర ప్రభుత్వం మావోయిస్టుల గొంతు నులుముతున్నదన్నారు.
2026 మార్చికి మావోయిస్టు లేకుండా చేస్తామని కేంద్ర మంత్రి అమిత్ షా ప్రకటించారు కానీ కమ్యూనిజాన్ని రూపుమాపడం ఆయన తరం కాదని కూనంనేని స్పష్టంచేశారు.

మరో నాలుగు వందేభారత్ రైళ్లు

(మొదటిపేజీ తరువాయి)

అభివర్ణించారు. 'పవిత్రమైన ఈ ప్రాంతంలో అద్భుతమైన దేవ్ దీపావళి జరిగింది. ఈ అభివృద్ధి పండుగ సందర్భంగా మీ అందరికీ అభినందనలు తెలియజేస్తున్నా. అనేక దేశాల అభివృద్ధిలో మౌలిక సదుపాయాలు కీలక పాత్ర పోషిస్తాయి. మెరుగైన కనెక్టివిటీతో నగరం అభివృద్ధి చెందుతుంది. ఈ 11 ఏళ్లలో ఉత్తరప్రదేశ్‌లో ఆర్థికవ్యవస్థ బాగా వృద్ధి చెందింది. యాత్రికుల రాకతో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు రూ.వేల కోట్లు వచ్చాయి' అని మోదీ అన్నారు. తాజాగా ప్రారంభించిన వాటితో కలిపి మొత్తం దేశంలో 160కి పైగా వందేభారత్ రైళ్లు నడుస్తున్నాయని మోదీ తెలిపారు. ఈ వందే భారత్, నమో భారత్ అనేవి భారత రైల్వేకి కొత్త తరమని పేర్కొన్నారు.

బీజేపీ పాలనలో ప్రజాస్వామ్యం ఖూనీ

విశాలాంధ్ర - హైదరాబాద్: దేశంలో ప్రజాస్వామ్యాన్ని బీజేపీ ఖూనీ చేస్తోందని టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. దేశంలో ఓట్ చోరీ పై రాహుల్ గాంధీ ఎనలేని పోరాటం చేస్తున్నారని చెప్పారు. ఓట్‌చోరీపై కాంగ్రెస్ చేపట్టిన సంతకాల సేకరణకు ఐదు కోట్ల మందికిపైగా మద్దతు తెలిపారన్నారు. లోక్‌సభ ఎన్నికలతోపాటు మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ అవకతవకలను కాంగ్రెస్ ఆధారాలతో సహా నిరూపిస్తోందని అన్నారు. గాంధీభవన్‌లో శనివారం తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ తో కలిసి మాట్లాడారు. కర్నాటకలోని మహదేవ్ పురం నియోజకవర్గంలో ఓటర్ల జాబితాలో తప్పులను, బీజేపీ మోసాలను రాహుల్ గాంధీ ఆధారాలతో సహా నిరూపించినా ఎన్నికల సంఘం ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ చేసిన కుట్రలను రుజువులతో సహా నిరూపించారని పేర్కొన్నారు. హర్యానాలో 25 లక్షలకుపైగా నకిలీ ఓటర్లున్నారని, ఐదు లక్షలకుపైగా ఉన్న డూప్లికేట్ ఓటర్లు, 93 ఓటర్ల తప్పుడు చిరునామాలు, లక్ష మందికిపైగా ఓటర్ల ఫొటోల వివరాల్లో తప్పులుండడం రాహుల్ గాంధీ నిరూపించారని వివరించారు. ఒకే మహిళ ఫొటోతో 22 ఎంట్రీలున్నాయని, ఒకే మహిళ ఫొటోతో 100 ఓటరు కార్డులున్నాయని తెలిపారు. బీహార్‌లో కాంగ్రెస్ ఓట్లను ఎస్ఐఆర్ పేరుతో బీజేపీ తొలగించిందని ఆరోపించారు. ఓట్ చోరీ ప్రజాస్వామ్యానికి విఘాతం అన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం బీజేపీ చెప్పుచేతుల్లో ఉందని మండిపడ్డారు.
జూబ్లీ హిల్స్‌లో పక్క జిల్లాల ఓటర్లు నమోదు చేసుకొని గతంలో బీజేపీ సహకారంతో బీఆర్‌ఎస్ గెలుస్తూ వచ్చిందని ఆరోపించారు. హర్యానాలో కాంగ్రెస్‌కు దక్కాల్సిన విజయాన్ని బీజేపీ అడ్డుకున్న తీరును, అందుకు ఎన్నికల సంఘం అందించిన సహకారాన్ని రాహుల్ గాంధీ ఆధారలతో సహా నిరూపించడంతో దేశం విస్తుపోయిందన్నారు. అల్లం భాస్కర్, హనుమంతు రావు, లింగం యాదవ్, గజ్జి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాల కల్పనే లక్ష్యం

విశాలాంధ్ర బ్యూరో - కొత్తగూడెం: జిల్లాలో నిరుద్యోగ యువతకు వేలాది ఉద్యోగాలు ఇప్పించాలనే లక్ష్యం త్వరలో నెరవేరబోతుందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 16న కొత్తగూడెం క్లబ్‌లో సింగరేణి సంస్థ సౌజన్యంతో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఏజెన్సీ జిల్లాగా ఉన్న భద్రాద్రి కొత్తగూడెం నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు లభిస్తాయన్న ఆశాభావం వ్యక్తం చేశారు. నియోజకవర్గం తోపాటు పరిసర గ్రామాల యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు.
తొలుత 65 కంపెనీలు జాబ్ మేళాలో పాల్గొంటాయన్నారు. ఐదువేల ఉద్యోగాలు లభిస్తాయని భావిస్తున్నట్లు చెప్పారు. క్యూఆర్ స్కానరు, సోషల్ మీడియా మాధ్యమాలు, కరపత్రాలు, వాల్ పోస్టర్లు, స్టిక్కర్లు, హోర్డింగుల ద్వారా రిజిస్ట్రేషన్ ప్రక్రియను అందుబాటులోకి తెచ్చామన్నారు. నేరుగా రిజిస్ట్రేషన్ చేసుకొని ఇంటర్వ్యూకు హాజరుకావాలని కూనంనేని కోరారు. ఒక్కో అభ్యర్థి ఐదు సంస్థల ఇంటర్వ్యూలో పాల్గొనవచ్చన్నారు. మేళాకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను ఆహ్వానించామని చెప్పారు.

కబ్జా కోరల్లో చెరువులు

(మొదటిపేజీ తరువాయి)

వృథా నీటి నిల్వకు పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో దశలవారీగా నీటి కుంటల నిర్మాణానికి ఏర్పాట్లు చేస్తుంటే మరోవైపు వేలాది చెరువులు కనుమరుగైపోతున్నాయి. జిల్లా - రాష్ట్ర - జాతీయ రహదారులకు సమీపంలోని గ్రామాల్లో భూములకు రెక్కలు రావడంతో చెరువులను కబ్జా చేసి లేఅవుట్లుగా మార్చేస్తున్నారు. వరదలు వచ్చినప్పుడు వందల టీఎంసీల నీరు సముద్రపాలవుతోంది. ఆ నీటిని చెరువులకు మళ్లించే అవకాశం లేదు. కొన్ని చెరువులకు ఇప్పటికే బ్రాంచ్ కెనాల్స్. మరికొన్నింటికి గతంలో నిర్మించిన కాలువలు ఆక్రమణకు గురి కాగా వరదనీరు చెరువులకు వెళ్లే పరిస్థితి లేదు. దీంతో వర్షపు నీటితోనే కొన్ని ప్రధాన చెరువులు నింపాల్సి వస్తోంది. తక్కువ వర్షపాతం నమోదైనప్పుడు చెరువులకు నీరు అందడంలేదు. ఆ ఏడాదంతా చిన్న, సన్నకారు రైతులు భూములను బీడులుగా పెట్టుకోవాల్సి వస్తోంది. నీరందే అవకాశం ఉన్న 40శాతం పైగా చెరువులు ఆక్రమణలకు గురయ్యాయి. గతంలో 13 జిల్లాల పరిధిలోని చెరువుల్లో 100 టీఎంసీలకు పైగా నీరుండేది. ప్రస్తుతం ఆ నీటి నిల్వలు 60 శాతానికి పడిపోయాయి. అలాగే 26 లక్షల ఎకరాలలో వివిధ పంటలు ఈ చెరువుల నీటితో సాగయ్యేవి. రాష్ట్రంలో లక్షకు పైగా చెరువులు ఉంటే అందులో 2 వేలకు పైగా చెరువులు పూర్తిగా ఆక్రమణలకు గురయ్యాయని, మరో 10 వేలకు పైగా చెరువులు కొంత భాగం ఆక్రమించుకున్నారని కేంద్ర నిపుణుల కమిటీ స్పష్టం చేసింది. మరికొన్ని చెరువులకు నీటిని అందించే కాలువలు ఆక్రమణకు గురి కావడంతో 10 వేల చెరువులకు అసలు నీరే అందడం లేదు. కూటమి అధికారంలోకి వచ్చాక చెరువుల అభివృద్ధికి సరికొత్త ప్రణాళికలను రూపొందించింది. దశలవారీగా చెరువు కట్టలను పటిష్టం చేయడంతో పాటు నీటి నిల్వల సామర్థ్యాన్ని పెంచేలా పూడికతీత పనులు చేపడుతోంది. ఆక్రమణకు గురైన చెరువులను గుర్తించి వాటిని తొలగించడం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా నీటి నిల్వలు పెరగడంతో పాటు ఆయకట్టు కూడా అభివృద్ధికి అవకాశముంటుంది. ఇటీవల డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను తెలంగాణ హైడ్రా కమిషనర్ ఎ.వి. రంగనాథ్ మంగళగిరిలోని క్యాంపు కార్యాలయంలో కలిశారు. వివిధ పరిపాలనా, సామాజిక అంశాలపై రెండు గంటలకుపైగా చర్చించినట్లు తెలుస్తోంది. అయితే ఇది మర్యాద పూర్వక సమావేశమని, అధికారిక అంశాలపై మాట్లాడలేదని పవన్ కల్యాణ్ కార్యాలయం వెల్లడించింది. ఏపీలో హైడ్రా వ్యవస్థ ఏర్పాటుపై చర్చ జరిగినట్లు ప్రచారం సాగింది.

అమెరికాలో కారంచేడు విద్యార్థిని మృతి

(మొదటిపేజీ తరువాయి)

కలిసి నిద్రపోయిన రాజ్యలక్ష్మి ఉదయం నిద్రలేవలేదు. స్నేహితులు పిలిచినా స్పందన లేదు. ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు వెల్లడించారు. మరణవార్త విన్న తల్లిదండ్రులు అచేతన స్థితిలో ఉండిపోయారు. రాజ్యలక్ష్మి మరణంతో ఆ గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. మృతదేహాన్ని అమెరికా నుంచి తీసుకొచ్చేందుకు ప్రభుత్వపరంగా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు హామీ ఇచ్చారు.

భూ కుంభకోణంపై వాస్తవాలు వెలికితీయాలి: శరద్ పవార్

అకోలా: తన మనవడు పార్థ పవార్ కంపెనీకి సంబంధించిన వివాదాస్పద భూ ఒప్పందంపై దర్యాప్తు జరిపి వాస్తవాలు వెలికితీయాలని ఎన్‌సీపీ (ఎస్‌పీ) అధ్యక్షులు శరద్ పవార్ శనివారం ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌ను కోరారు. 'ఈ విషయం తీవ్రమైనదని ముఖ్యమంత్రి బహిరంగంగా చెప్పినందున దర్యాప్తు చేసి...వాస్తవాలు సమాజం ముందు ఉంచాలి' అని పవార్ విలేకరులతో అన్నారు. ఈ భూమి విలువ దాదాపు రూ.1,800 కోట్లు. ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ కుమారుడు పార్థకు సంబంధించిన కంపెనీ స్టాంప్ డ్యూటీ మినహాయింపుతో రూ.300 కోట్లకు కొనుగోలు చేసిందని ప్రతిపక్ష నాయకులు చెబుతున్నారు.

ప్రపంచమంతా విశాఖ వైపు...

(మొదటిపేజీ తరువాయి)

తెలిపారు. అమరావతి బ్రాండ్ ఇమేజ్ పెరిగిం దని, హైదరాబాద్ స్థాయిలో ఇక్కడా భారీ ఈవెంట్లు జరుగుతున్నాయ న్నారు. ప్రభుత్వం కూడా ఆ స్థాయిలో భారీ ఈవెంట్లను ప్రోత్సహిస్తోందని చంద్రబాబు అన్నారు. తమన్ మ్యూజికల్ నైట్, విజయవాడ ఉత్సవ్, ప్రస్తుతం జరుగుతున్న ఇళయరాజా మ్యూజికల్ నైట్ వంటివి అమరావతికి ప్రత్యేక గుర్తింపు తెస్తున్నాయని చెప్పారు. ఓ వైపు భారీ ఈవెంట్లు, మరోవైపు భారీ పెట్టుబడులతో ఆంధ్ర ప్రదేశ్ దూసుకెళుతోందని అన్నారు. అవినీతి నిర్మూలనకు సమగ్ర చర్యలు చేపడుతున్నామని, పెండింగ్‌లో ఉన్న రెవెన్యూ సమస్యల పరిష్కారానికి ఆదేశాలిచ్చామన్నారు. గత ప్రభుత్వం నిర్వాకం వల్ల రెవెన్యూ అంశాలు సంక్లిష్టంగా మారాయన్నారు. 22ఏ నిషేధిత జాబితా భూములపై త్వరలో నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు. అత్యాధునిక సాంకేతిక అంశాలపైన కూడా అధ్యయనం ఉంటుందన్నారు. రాష్ట్ర స్థాయి నుంచి గ్రామస్థాయి వీఆర్‌ఓల వరకు బాధ్యతగా పని చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందేలా చూడటమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రజలు అయోమయానికి గురయ్యే అవకాశం ఉందన్నారు. అసలు సమస్య ఎందుకు పరిష్కారం కావడం లేదో బాధితుడికి అర్థమయ్యేలా తెలిపే విధానం తీసుకువస్తామని, పరిష్కారం కాని సమస్యలకు గల సాంకేతిక కారణాలను తెలియజేస్తామన్నారు. రాష్ట్రంలోని కొన్ని సున్నితమైన అంశాలను జాగ్రత్తగా పరిష్కరించాల్సి ఉందని చెప్పారు. ఎమ్మెల్యేలు ప్రజా సమస్యల పరిష్కారానికి విధిగా ప్రజా దర్బార్‌లు నిర్వహించాలని స్పష్టం చేశారు. ప్రజా సమస్యలు పట్టించుకోం అంటే కుదరదన్నారు. లోకేశ్ ఆదేశాల తర్వాత ఎమ్మెల్యేల్లో కదలిక వచ్చిందని సీఎం చంద్రబాబు తెలిపారు. తన దాకా వస్తేనే సమస్య పరిష్కారమవుతుందనే భావన ఉండొద్దన్నారు. ఏ సమస్య అయినా ఎక్కడికక్కడే పరిష్కారమయ్యేలా చూస్తామన్నారు.
పార్టీ కమిటీలు వీలైనన్ని నెలాఖరులోగా పూర్తి చేస్తామని, పార్లమెంటు కమిటీల మీద కసరత్తు ముమ్మరంగా సాగుతోందని వివరించారు. డిసెంబరు చివరి నాటికి అన్ని కమిటీలు పూర్తి చేసి పార్టీని ప్రజల్లోకి మరింత బలంగా తీసుకువెళతామని చంద్రబాబు వెల్లడించారు. ప్రభుత్వం చేపడుతున్న ఆర్థిక, పాలనా సంస్కరణల ద్వారా ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం త్వరలోనే దేశంలో అగ్రగామిగా నిలుస్తుందని చంద్రబాబు ధీమా వ్యక్తం చేశారు.

అన్ని రంగాల్లో అభివృద్ధే లక్ష్యం

▸ పరిశ్రమల స్థాపనకు ప్రభుత్వం పూర్తి సహకారం: సీఎం చంద్రబాబు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: అన్ని రంగాల్లోనూ అభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా పనిచేస్తోందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. ఇందుకు అనుగుణంగా పెట్టుబడులు ఆకర్షించేందుకు, పరిశ్రమల స్థాపనకు ప్రభుత్వం కృషి చేస్తున్నట్టు వివరించారు. అమరావతి నుంచి వర్చువల్ విధానంలో కుప్పంలో ఏడు పరిశ్రమలకు చంద్రబాబు శనివారం శంకుస్థాపన చేశారు. హిందాల్కో, శ్రీజా డెయిరీ, ఏస్ ఇంటర్నేషనల్, ఎస్వీఎఫ్ సోయా, మదర్ డెయిరీ, ఇ-రాయస్ ఈవీ, అలీప్ పరిశ్రమలు కుప్పంలో రూ.2,203 కోట్ల పెట్టుబడులు పెట్టనున్నాయి. తద్వారా 22,330 మందికి ఉద్యోగ అవకాశాలు రానున్నాయి. ఈ ఏడు సంస్థలకు 241 ఎకరాల భూమిని ప్రభుత్వం కేటాయించింది. పరిశ్రమల శంకుస్థాపన సందర్భంగా స్థానిక ప్రజలు, ఆయా సంస్థల ప్రతినిధులతో ఆన్‌లైన్ ద్వారా ముఖ్యమంత్రి మాట్లాడారు. రాష్ట్రంలో పరిశ్రమల స్థాపనకు పూర్తి సహకారం అందిస్తున్నామని, రాష్ట్రస్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు ద్వారా పరిశ్రమలకు త్వరితగతిన ఆమోదం ఇస్తున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. త్వరలో కుప్పం నియోజకవర్గానికి రూ.6,339 కోట్ల పెట్టుబడితో మరో 8 సంస్థలు రాబోతున్నాయని తెలిపారు. వీటి రాకతో ప్రత్యక్షంగా, పరోక్షంగా 43 వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. రాయలసీమ జిల్లాల్లో స్పేస్ సిటీ, డ్రోన్ సిటీ, ఏరో స్పేస్ సిటీలను ఏర్పాటు చేయబోతున్నట్టు సీఎం చెప్పారు. స్థానిక యువతకు నైపుణ్యశిక్షణ కల్పించేలా హిందాల్కో సంస్థ యూనిట్‌ను ఏర్పాటు చేయనుందన్నారు. రూ.586 కోట్లతో సాంకేతిక శిక్షణా కేంద్రాన్ని హిందాల్కో నెలకొల్పనుందన్నారు. రూ.290 కోట్ల వ్యయంతో సమీకృత డెయిరీ, పశుమేత ప్లాంట్‌ను శ్రీజా డెయిరీ సంస్థ ఏర్పాటు చేయనుంది. తద్వారా స్థానిక మహిళలకు, పాడి రైతులకు ప్రయోజనం కలుగుతుంది. డెయిరీ ప్రోటీన్ తయారీ కోసం ఏస్ ఇంటర్నేషనల్ రూ.525 కోట్ల పెట్టుబడి పెట్టనుందని సీఎం వెల్లడించారు.

మంచి పాలసీలు చరిత్రను తిరగరాస్తాయి

కుప్పం నియోజకవర్గానికి చెందిన ప్రజలతో సీఎం మాట్లాడుతూ 'ప్రతి మహిళ, ప్రతి యువత ఒక పారిశ్రామికవేత్త కావాలి. పిల్లలకు ఎంత ఆస్తి ఇచ్చారన్నది ముఖ్యం కాదు. ఉన్నత విద్య ద్వారానే ప్రయోజకత్వం వస్తుంది. ఈ ఏడాదిలో డ్వాక్రా, మెప్మా సంఘాల నుంచి లక్ష మందిని మహిళా పారిశ్రామికవేత్తలుగా తయారు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. వన్ ఫ్యామిలి -వన్ ఎంటర్ ప్రెన్యూర్, వన్ ఫ్యామిలీ-వన్ ఏఐ నిపుణులు అనే పాలసీలు చరిత్రను తిరగరాస్తాయి. ప్రతి పరిశ్రమా సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటు చేసుకోవాలి. 100 శాతం సౌర విద్యుత్ వినియోగించుకునే నియోజకవర్గంగా కుప్పాన్ని తయారు చేస్తున్నాం. తమిళనాడు, కర్నాటకలకు అనుసంధానంగా ఉన్న కుప్పానికి అభివృద్ధి అవకాశాలు ఉన్నాయి. కుప్పం నుంచి వివిధ ప్రాంతాలను అనుసంధానం చేసేలా రోడ్ల నిర్మాణం చేపడుతున్నాం. ఎయిర్ కనెక్టివిటీ పెంచుతాం. బ్యాటరీ టెక్నాలజీ, మెడికల్ డివైసెస్, లాజిస్టిక్స్, ఫుట్ వేర్, ఇన్నోవేషన్ హబ్‌గా కుప్పం రూపు దిద్దుకోనుంది. ప్రభుత్వ పాలసీలతో చరిత్రను తిరగరాయవచ్చు. వచ్చే ఏడాది మార్చి కల్లా రాష్ట్రంలోనే తొలి జీరో-ల్యాండ్‌ఫిల్ నియోజకవర్గంగా కుప్పం నిలుస్తుంది. సింగిల్-యూజ్ ప్లాస్టిక్ నిషేధించాం. నెట్-జీరోనే లక్ష్యంగా ముందుకెళ్తున్నాం' అని సీఎం వివరించారు.

స్థానికులతో ముఖాముఖి

తొలుత కుప్పం స్థానిక రైతులు, ప్రజలతో ముఖ్యమంత్రి చంద్రబాబు వర్చువల్‌గా మాట్లాడారు. పరిశ్రమలు స్థాపించడం ద్వారా తమకు ఉపాధి కల్పించినందుకు ముఖ్యమంత్రికి కుప్పం వాసులు ధన్యవాదాలు తెలిపారు. కుప్పానికి ఈ స్థాయిలో పరిశ్రమలు వస్తాయని కలలో కూడా అనుకోలేదని, పరిశ్రమలు, ఫుడ్ ప్రాసెసింగ్ కంపెనీల రాకతో తమ ఉత్పత్తులను స్థానికంగా విక్రయించే అవకాశం లభిస్తుందని ముఖ్యమంత్రికి రైతులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

'వెలుగొండ' పూర్తికి చిత్తశుద్ధి ఏది?

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య

విశాలాంధ్ర-ఒంగోలు: పూల సుబ్బయ్య వెలుగొండ ప్రాజెక్టు పూర్తిస్థాయి నిర్మాణానికి చంద్రబాబు నాయుడు మరో 30 పుట్టిన రోజులు చేసుకోవాలా అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య ప్రశ్నించారు. సీపీఐ రాష్ట్ర 28వ మహాసభల ఆహ్వాన సంఘం ముగింపు సభలో పాల్గొనేందుకు శనివారం ఒంగోలు విచ్చేసిన ఈశ్వరయ్య స్థానిక మల్లయ్య లింగం భవనంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. వెలుగొండ ప్రాజెక్టు నిర్మాణ పనుల పరిశీలనకు వచ్చిన రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు చేసిన వ్యాఖ్యలను తప్పుపట్టారు. చంద్రబాబు పుట్టినరోజు సందర్భంగా వెలుగొండ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారని, ఇప్పటికి చంద్రబాబు 30 పుట్టిన రోజులు జరుపుకున్నా వెలుగొండ ప్రాజెక్టు నిర్మాణం మాత్రం పూర్తి కాలేదని, దీనికి జగన్ ప్రభుత్వమే కారణమనడాన్ని ఆయన ప్రశ్నించారు. ఈ 30 సంవత్సరాల కాలంలో చంద్రబాబు 15 ఏళ్ల పాటు సీఎంగా ఉన్నారని, 15 ఏళ్లు ప్రతిపక్ష నేతగా ఉన్నారని, ప్రస్తుతం ఆయనే ముఖ్యమంత్రి అని ఈశ్వరయ్య గుర్తు చేశారు. నిమ్మల రామానాయుడు ఇరిగేషన్ శాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన సమయంలో అప్పటి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ నేతృత్వంలో పార్టీ ప్రకాశం జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ, సహాయ కార్యదర్శి ఆర్.వెంకట్రావుతో కూడిన బృందం మంత్రిని కలిసి బడ్జెట్‌లో రూ.4 వేల కోట్లు కేటాయించి... యుద్ధ ప్రాతిపదికన ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేయాలని కోరినట్లు చెప్పారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం మాత్రం 2024 బడ్జెట్‌లో రూ.300 కోట్లు, 2025 బడ్జెట్‌లో రూ.35 కోట్లు కేటాయించి ందన్నారు. ఈ ప్రకారమయితే చంద్రబాబు మరో 30 పుట్టిన రోజులు చేసుకున్నప్పటికీ వెలుగొండ ప్రాజెక్టు నిర్మాణం పూర్తి కాదని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాల్లోని 4 లక్షల 50 వేల ఎకరాల సాగునీటి కోసం, 20 లక్షల మంది ప్రజల తాగునీటి కోసం వినుకొండ ప్రాజెక్టుకు ప్రాధాన్యత ఇస్తూ బడ్జెట్‌లో రూ.4 వేల కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. జిల్లాలో వలసలు నివారించాలని, ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు.

వైద్య విద్య ప్రైవేటీకరణ సిగ్గుచేటు

రాష్ట్రంలోని 17 వైద్య కళాశాలలను పీపీపీ పద్ధతిలో ప్రైవేటు వ్యక్తులకు అప్పగించటాన్ని ఈశ్వరయ్య తప్పుపట్టారు. వైసీపీ ప్రభుత్వ కాలంలో వైద్య విద్యలో 50 శాతం సీట్లు ప్రైవేటుకు కేటాయిస్తే, కూటమి ప్రభుత్వం 100 శాతం సీట్లను ప్రైవేటుకు అప్పగించటం దుర్మార్గమన్నారు. వైద్య ఆరోగ్య శాఖ మంత్రి పీపీపీ విధానంపై అసత్య వాదన వినిపిస్తున్నారని తెలిపారు.

ఘనంగా ముఖ్యమంత్రి పుట్టినరోజు వేడుకలు

విశాలాంధ్ర ప్రతినిధి - మంచిర్యాల జిల్లా: మంచిర్యాల జిల్లా మందమర్రి మండలం క్యాతనపల్లి మునిసిపాలిటీ పరిధిలోని స్థానిక సూపర్‌బజార్ చౌరస్తా దగ్గరలోని కాంగ్రెస్‌పార్టీ కార్యాలయంలో తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలను కాంగ్రెస్ పార్టీ నాయకులు అబ్దుల్ అజీజ్, గాండ్ల సమ్మయ్య, మహంకాళి శ్రీనివాస్ ఆధ్వర్యంలో కేక్‌కట్‌చేసి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జన్మదినం సందర్భంగా గత రెండు సంవత్సరాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన పథకాలు తెలంగాణని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకువెళ్తున్నాయని, క్యాతనపల్లి మున్సిపాలిటీని చెన్నూర్ ఎమ్మెల్యే, కార్మిక శాఖ మంత్రి వివేక్, రేవంత్ రెడ్డి సహకారంతో డ్రైన్స్, సీసీ రోడ్ పనులను త్వరతగిన పూర్తి చేస్తున్నారని, రైల్వే ఓవర్ బ్రిడ్జి పూర్తి నిర్మాణం చేయించారని కొనియాడారు. అనంతరం సింగరేణి ఏరియా ఆసుపత్రిలో లో రోగులకు పండ్లను పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో క్యాతనపల్లి మున్సిపాలిటీ మాజీ వైస్ చైర్మన్ జంగం కళ, కాంగ్రెస్ నాయకులు పుల్లూరి కళ్యాణ్, మెట్ట సుధాకర్, గోపు రాజం, లాడెన్, నీలం శ్రీనివాస్ గౌడ్, మారేపల్లి రాజయ్య, గోపతి బానేష్, బత్తుల వేణు, కుర్మ సురేందర్,సరేష్, బత్తుల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ మానవజాతి మనుగడకు ముప్పు

విశాలాంధ్ర తొర్రూరు: మానవజాతి మనుగడకు పెనుముప్పుగా పరిణమించిన ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించుకోవాలని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ బి. రాములు అన్నారు. తొర్రూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో మండలంలోని చెర్లపాలెం గ్రామంలో కొనసాగుతున్న ఏడు రోజుల ప్రత్యేక శిబిరంలో భాగంగా శనివారం ప్లాస్టిక్ వినియోగంతో అనర్థాలపై చేపట్టిన అవగాహనా ర్యాలీని చేపట్టారు. గ్రామ పరిసరాల్లో ప్లాస్టిక్‌ను సేకరించారు. సింగిల్ యూజ్‌ప్లాస్టిక్ వినియోగంతో తలెత్తే అనర్థాలపై అవగాహన కల్పించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ వాల్యా నాయక్, డాక్టర్ సుజాత లతో కలిసి ప్రిన్సిపాల్ మాట్లాడారు. ప్లాస్టిక్ ఆరోగ్యానికి ప్రమాదకరమని, వాతావరణంపై తీవ్ర ప్రభావం చూపుతుందని తెలిసినా వినియోగం మాత్రం తగ్గడం లేదన్నారు. 50 మైక్రాన్‌ల కన్నా తక్కువ ఉన్న ప్లాస్టిక్ వినియోగాన్ని ప్రభుత్వం పూర్తిగా నిషేధించిందన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు రాజేందర్‌రెడ్డి, షహనాజ్‌బేగం, సోమేశ్వర్, విద్యార్థులు పాల్గొన్నారు.

పేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను పంపిణీ చేయాలి

విశాలాంధ్ర జిల్లా బ్యూరో మహబూబాబాద్ /తొర్రూరు: జిల్లాలోని తొర్రూరు పట్టణ కేంద్రంలో నిర్మాణంలో పూర్తయి నాలుగు సంవత్సరాలు గడచిన పేదలకు డబల్ బెడ్ రూమ్ ఇండ్లు పంపిణీ చేయలేదని ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు డబ్బులు బెడ్ రూమ్ ఇండ్లు పంపిణీ చేయాలని సీపీఎం పార్టీ తొర్రూరు మండల కార్యదర్శి ఎండీ యాకూబ్ అన్నారు. శనివారం సీపీఎం పార్టీ తొర్రూరు మండల కమిటీ ఆధ్వర్యంలో ఇల్లు లేని నిరుపేద మహిళలతో కలిసి గెస్ట్ హౌస్ నుండి బస్టాండ్ సర్కిల్ మీదుగా రాస్తారోకో నిర్వహించి గోపాలగిరి రోడ్డు లోని డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల వరకు భారీ ర్యాలీ ప్రదర్శన నిర్వహించారు. ఎండీ యాకూబ్ మాట్లాడుతూ ఇండ్లులేని నిరు పేద మహిళలు చేస్తున్న పోరాటం మహిళా ఎమ్మెల్యేకు కనిపించకపోవడం దురదృష్టకరమన్నారు. ఇప్పటి కైనా జిల్లా కలెక్టర్ స్పందించి ప్రభుత్వానికి తెలియజేయాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంతో పాటు కలెక్టర్ కార్యాలయం ముట్టడి కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పార్టీ మండల కమిటీ సభ్యులు డోనుక దర్గయ్య, కొమ్మనబోయిన యాకయ్య, ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యుడు ఎండి అమీర్, సీపీఎం పార్టీ నాయకులు కొత్త వెంకట్ రెడ్డి, కొమ్మనబోయిన పుష్ప, డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పోరాట సాధన కమిటీ లీడర్లు శోభ, వరలక్ష్మి, రేణుక, సాయిలు, శమీన, అమీనా, భవాని, వసంత, శారద, భరత్, హరి, నవనీత కృష్ణ, ముందు పాల్గొన్నారు.

సిర్పూర్ పేపర్ మిల్లులో కార్మికుడికి గాయం

విశాలాంధ్ర,కొమురం భీం కాగజ్ నగర్ : రోజూ కష్టపడుతూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్న చిలుక శ్రీనివాస్ లాంటి కార్మికుల శ్రమతోనే సిర్పూర్ పేపర్ మిల్లు నడుస్తుంది. అదే శ్రమ ఒక ప్రమాదంలో ప్రాణపాయం అవుతుంటే ఎవరు బాధ్యత వహిస్తారు. శనివారం ఉదయం రికవరీ బాయిలర్ ఈవాప్రెటర్ విభాగంలో బ్లాక్ లిక్కర్ పడి ఉండటంతో శుభ్రపరిచే క్రమంలో పర్మినెంట్ కార్మికుడు చిలుక శ్రీనివాస్ జారి కింద పటండంతో గాయపడ్డాడు. తోటి కార్మికులు హుటాహుటిన ఆసుపత్రికి తరలించగా ఎడమ చేయి విరిగినట్లు వైద్యులు తెలిపారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం అంబులెన్స్‌లో హైదరాబాద్‌కి తరలించారు. మిల్లులో భద్రతా చర్యలు కేవలం కాగితాలకే పరిమితమయ్యాయి. పర్యవేక్షణ లేకపోవడమే ప్రమాదాలకు కారణమని కార్మికులు వాపోతున్నారు. ఘటనపై విలేకరులు ఫోటోలు తీస్తుండగా, యాజమాన్యం 'ఫోటోలు తీయరాదు' అంటూ ఆంక్షలు విధించి బెదిరింపులకు దిగారు. అయితే ప్రశ్న ఒక్కటే ఒక కార్మికుడి గాయం దాచిపెట్టడం ఎవరికీ ఉపయోగం ప్రమాదం జరిగిందంటే దానిని సరిచేసే చర్యలు తీసుకోవడం యాజమాన్యం బాధ్యత కాదా. కాగజ్ నగర్ పేపర్ మిల్లులో ప్రమాదం జరగడం ఇది కొత్తది కాదు. గతంలోనూ ఇలాంటి ఘటనలు చోటుచేసుకున్నాయి. కానీ ప్రతి సారి విచారణ పేరుతో విషయం మరుగునపడుతోంది.

సీఎం రేవంత్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు

విశాలాంధ్ర, మేడిపల్లి:పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తుంగతుర్తి రవి, ఆర్వి ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం ఉదయం తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి జన్మదినాన్ని ఘనంగా నిర్వహించారు. అమ్మఒడి ఫౌండేషన్, డిలైట్ ఫౌండేషన్, మా ఫౌండేషన్ కార్యాలయాలలో కేక్ కట్ చేసి, విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తుంగతుర్తి రవితో పాటు కర్రె రాజేష్, సింగిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు. తుంగతుర్తి రవి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాష్ట్రంలో విద్యార్థుల భవిష్యత్తు కోసం అనేక సంస్కరణలను తీసుకువచ్చారు. విద్యార్థులకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం, ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీష్ మీడియం బోధన, డిజిటల్ క్లాస్‌రూమ్స్ ఏర్పాటు, ప్రతి పేద విద్యార్థికి నాణ్యమైన విద్య అందించే లక్ష్యంతో పలు పథకాలను అమలు చేస్తున్నారు. పీర్జాదిగూడ, ఘట్కేసర్, పోచారం మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ నాయకులు వంగూరి పరమేష్, సుదర్శన్ రెడ్డి, సురేందర్ రెడ్డి, సోమయ్య పాల్గొన్నారు.

కార్మిక సమస్యలు పరిష్కరించాలని ఆందోళన

విశాలాంధ్ర - కొత్తగూడెం క్రైమ్: సింగరేణి సంస్థలు పెండింగ్‌లో ఉన్న అనేక కార్మిక సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గుర్తింపు సంఘం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు. శనివారం సాయంత్రం గుర్తింపు సంఘం అగ్ర నాయకుల పిలుపుమేరకు కొత్తగూడెం ఏరియా జీఎం కార్యాలయాన్ని ముట్టడించారు. సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ధర్నా చేపట్టారు. అనంతరం బ్రాంచ్ కార్యదర్శి వి.మల్లికార్జున్ రావు ఆధ్వర్యంలో జీఎం షాలేం రాజు కు మెమొరాండం అందచేశారు. ఈ ధర్నా కార్యక్రమాన్ని ఉద్దేశించి గుర్తింపుసంఘం అదనపు ప్రధాన కార్యదర్శి మిరియాల రంగయ్యా మాట్లాడారు. కార్మికుల న్యాయమైన సమస్యలు పరిష్కరించమంటే యాజమాన్యం వ్యూహాత్మకంగా కమిటీల పేరుతో కాలయాపన చేస్తున్నట్లు ఆరోపించారు. ఈ పరిణామం యాజమాన్యంతో పాటు సింగరేణి భవిష్యత్తుకు మంచిది కాదన్నారు. ముఖ్యంగా మెడికల్ బోర్డు ఆరు నెలల నుంచి నిర్వహించక పోవడం శోచనీయమన్నారు. ఈ ప్రక్రియ ఆలస్యం అవడం వల్ల అనారోగ్య కారణాల వలన ఉద్యోగం చేయలేక, తమ వారసులకు ఉద్యోగాలు ఇప్పించు కోలేక కార్మికులు బాగా నష్టపోతున్నారని తెలిపారు. యాజమాన్యం నిర్లక్ష్యం వల్ల ఆయా

కుటుంబాలు నెలల తరబడి ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు చెప్పారు. అదేవిధంగా సొంత ఇంటి పథకం, మారుపేర్ల సమస్య, పేర్క్స్ పై ఇన్కమ్ టాక్స్ కోలిండియా మాదిరిగా యాజమాన్యమే భరించాలని, డిస్మిస్ అయిన ఉద్యోగులకు మరోసారి అవకాశం కల్పించాలని రంగయ్య డిమాండ్ చేశారు. గుర్తింపు సంఘంతో చర్చించకుండా తీసుకోచ్చిన 150 మస్టర్ల సర్క్యులర్‌ను వెంటనే రద్దు చేయాలన్నారు. దీర్ఘకాలికంగా పెండింగ్‌లోవున్న జూనియర్ అసిస్టెంట్ పరీక్షను వెంటనే నిర్వహించాలని కోరారు. మెడికల్ అన్ఫిట్ అయ్యి ఉద్యోగం కోసం ఎదురుచూస్తున్న కార్మికుల వారసులకు వెంటనే ఉద్యోగ నియామకపత్రాలు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ సంఘం ఎలాంటి రాజీ లేకుండా నిత్యం కార్మికుల సమస్యలపైనే పోరాటాలు చేస్తుందని ఆయన స్పష్టం చేశారు. సమస్యలు వెంటనే పరిష్కరించకపోతే సమ్మెకు సైతం వెనుకాడబోమని యాజమాన్యాన్ని హెచ్చరించారు. ఈ ధర్నాలో సెంట్రల్ కార్యదర్శి వంగ వెంకట్, కార్పొరేట్ బ్రాంచ్ కార్యదర్శి రమణమూర్తి, సహాయ కార్యదర్శి గట్టయ్య, ఆఫీస్ బ్యారర్స్, సందబోయిన శ్రీనివాస్, ఎస్ నాగేశ్వరరావు, క్రిస్టోఫర్, సామల రాము, పిట్ కార్యదర్శిలు మధుకృష్ణ, కమల్, సుధీర్,సురేందర్, సౌజన్య, సీనియర్ నాయకులు కత్తర్ల రాములు,రాజాలపూడి సాంబమూర్తి, సురేందర్, సురేష్, మింగిన్ రవి, బండి వెంకటరమణ, కర్రు రమేష్, మెంగన్ రవి, కోటి, మురళి,గుమ్మడి,ఓం ప్రకాశ్, సాయిపవన్,భుక్య రమేష్,బండి వెంకటరమణ, బండారి మల్లయ్య, రాజేశ్వరరావు, కార్మికులు పాల్గొన్నారు.

అక్రమ ఇసుక దందాలకు అడ్డుకట్ట వేయాలి

మహిళా మండలి డిమాండ్

విశాలాంధ్ర - మణుగూరు : ఏజెన్సీ ప్రాంతాల్లో 170 యాక్ట్‌తోపాటు పిసా చట్టం నిబంధనలకు విరుద్ధంగా గిరిజన ఇతరులైన బడా కాంట్రాక్టర్లు బినామీలతో ఇసుక ధందాలు కొనసాగిస్తున్నారని ఈ అక్రమాలకు అధికారుల సహకారం తొడతుందని రేణుక అక్షర మహిళా మండలి సభ్యులు తీవ్రంగా విమర్శించారు. ఏజెన్సీ లో గిరిజనులకు కల్పించిన హక్కులను అధికార రాజకీయాల ప్రభావంతో కాలరాస్తూ అక్రమ ఇసుక తవ్వకాలు, సరఫరా చేస్తూ రూ. కోట్లు దండుకుంటున్నారని ఆరోపించారు. శనివారం స్థానిక కార్యాలయంలో మహిళా సంఘం సమావేశం నిరహించారు. ఇందులో పాల్గొన్న మహిళా సంఘం అధ్యక్షురాలు పూనెం సరోజ మాట్లాడుతూ అధికారుల తీరుపై మండిపడ్డారు. పినపాక నియోజకవర్గంలో అనేక చోట్ల అక్రమ ఇసుక తవ్వకాల ద్వారా గిరిజన చట్టాలను

అపహాస్యం చేస్తూ ఆదివాసీలకు చెందాల్సిన సంపదను ఆధిపత్య పెత్తందార్లు దోచుకెళ్తుంటే అధికార యంత్రాంగం చర్యలు తీసుకోకపోవడం బాధాకరమన్నారు. ఈ అక్రమాల వెనుక పెద్ద ఎత్తున అధికారులకు వాటా ఉందని భావిస్తున్నామన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో ఆదివాసుల హక్కుల ఉల్లంఘన ఎప్పటికీ సహించబమని హెచ్చరించారు. ఇక్కడ జరుగుతున్న ఇసుక దందాలపై ప్రజాప్రతినిధులు ఏమి చేయకపోవడం అనుమానాలకు దారితీస్తుందన్నారు. ఈ అక్రమాల వెనుక ఉన్నవారిపై సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసారు. కోట్ల రూపాయల విలువచేసే ఈ అక్రమ దందా నిలిచిపోవాలంటే ప్రత్యక్ష చర్యల కు ఆదివాసీ సంఘాలు, సామాజిక సంస్థలు, మహిళా సంఘాలు ఐకమత్యంతో ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఎవరో వస్తారని న్యాయం చేస్తారని ఎదురు చూసే బదులు మన ప్రాంతాల్లోని కోట్లాది విలువ చేసే సంపదను మనమే పోరాటాల ద్వారా సాదించుకోవాలని పూనెం సరోజ కోరారు. ఈ సమావేశంలొ కాంగ్రెస్ మహిళా సంఘం సీనియర్ నాయకురాలు ఎండి షబానా, కోరి శ్యామల, బొడ్డు సౌజన్య, రెడ్డిబోయిన రేణుక, కన్నాపురం శైలజ, రమణ పాల్గొన్నారు.

వైద్య సేవలు భేష్

సీఆర్ఎం, జాతీయ బృందం

విశాలాంధ్ర - కొత్తగూడెం అర్బన్ : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పక్క ఏజెన్సీ ప్రాంతమైనప్పటికీ ప్రభుత్వ సేవలు అద్భుతంగా ఉన్నాయని సి ఆర్ ఎం జాతీయ బృందం సభ్యులు కితాబు ఇచ్చారు. ఈ జాతీయ కామన్ రివ్యూ మిషన్ బృందం కొన్ని రోజులుగా జిల్లాలోని వివిధ ప్రభుత్వ దవఖానాలను పర్యటించి వైద్య సేవల ప్రమాణాలను ప్రత్యక్షంగా క్షేత్రస్థాయిలో పరిశీలించారు. బృంద సభ్యులు డాక్టర్ జి బి సింగ్ రాష్ట్ర స్థాయిలో ప్రభుత్వానికి

ఇచ్చిన నివేదికలో ఈ జిల్లాలో సేవలను ప్రత్యేకంగా కొనియాడారు. అన్ని స్థాయిలలో సిబ్బంది సైతం ఎంతో శ్రద్ధ,అంకిత భావంతో తో సేవలు అందిస్తున్నారని సింగ్ శనివారం ఒక ప్రకటనలొ తెలిపారు. జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ తీసుకుంటున్న శ్రద్ధ చర్యల వల్ల జిల్లాలోని ఆసుపత్రులలోని అన్ని విభాగాల పని తీరు బాగుందని రాష్ట్ర ప్రభుత్వ నివేదికలు పొందుపరిచారని తెలిసింది. జిల్లాలోని డయలిసిస్ సేవలు కూడా చాలా బాగున్నాయన్నారు. ఇక్కడ శనివారం జరిగిన సమావేశం లో సి ఆర్ ఎం సభ్యులతో పాటు రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ కమీషనర్ సంగీత సత్యనారాయణ, టీవీవీపీ కమిషనర్ డాక్టర్ అజయ కుమార్, డైరెక్టర్ ఆఫ్ హెల్త్ డాక్టర్ రవీందర్ నాయక్, జిల్లా డి సి హెచ్ ఎస్ డాక్టర్ రవి బాబు, డీఎంహెచ్ ఓ డాక్టర్ జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

48 గంటల్లో గన్ని సంచుల సరఫరా

విశాలాంధ్ర -బ్యూరో ఖమ్మం : ధాన్యం కొనుగోలుకు అవసరమైన మేర గన్ని బ్యాగులు అందుబాటులో ఉన్నాయని, ప్రతిపాదనలు పంపిన 48 గంటల లోపు కొనుగోలు కేంద్రాలకు గన్ని సంచులు సరఫరా చేస్తున్నామని అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి శనివారం ఒక ప్రకటనలో

తెలిపారు. ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్ -2025 ధాన్యం కొనుగోలుకు సంబంధించి అవసరమైన అన్ని ఏర్పాట్లు కట్టుదిట్టంగా చేశామని అదనపు కలెక్టర్ తెలిపారు. జిల్లాలోని ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద అవసరమైన మేర గన్నిసంచులు, టార్పాలిన్‌కవర్లు అందుబాటులో పెట్టడం జరిగిందన్నారు. ధాన్యం కొనుగోలు అవసరాలకు మాత్రమే గన్ని సంచులు అందించడం జరుగుతుందని, రైతుల ఇంటి వద్దకు గన్ని సంచులు ఇవ్వవద్దని స్పష్టమైన ఆదేశాలు ఉన్నాయని అన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలకు ఇప్పటివరకు 9 లక్షల 71 వేల 500 గన్ని సంచులు పంపిణీ చేశామన్నారు. గన్ని సంచుల కోసం కొనుగోలు కేంద్రాలు ఇండెంట్ పెట్టిన 48 గంటలలోగా సరఫరా చేస్తున్నామని, గన్ని సంచులకు జిల్లాలో ఎక్కడా కొరత లేదని అదనపు కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

టీఎంపీ జిల్లా అధ్యక్షుడిగా కొండల్ రెడ్డి

విశాలాంధ్ర బ్యూరో, మెదక్: తెలం గాణ గణిత ఫోరం (టీఎంపి) మెదక్ జిల్లా నూతన అధ్యక్షుడిగా బి.కొండల్ రెడ్డి(జడ్పీ హెచ్ఎస్ కూచన్ పల్లి), ప్రధాన కార్యదర్శిగా

గోపాల్ (జెడ్పిహెచ్ఎస్ ఝాన్సీ లింగాపూర్), కోశాధికారిగా శివ్వ నాగరాజు శంకరంపేట్ (ఆర్), ఉపాధ్యక్షులుగా బాలరాజు (కుర్తివాడ)ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు గౌరవ అధ్యక్షులు సదన్ కుమార్ తెలిపారు.

ముగిసిన జోనల్ స్థాయి క్రీడలు

విశాలాంధ్ర బ్యూరో, మెదక్: మెదక్ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్, కళాశాల ప్రాంగణంలో జరిగిన రాజన్న సిరిసిల్ల జోనల్ స్థాయి 11వ జోనల్ మీట్ ముగిసింది.

ముగింపులో డీఎస్పీ ప్రసన్న కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని గెలుపొందిన విజేతలకు బహుమతులు అందచేశారు. ప్రిన్సిపాల్ పద్మావతి, సత్యవతి, అనురాధ, సంధ్యారాణి, శ్రీనివాస్, ఉపాధ్యాయులు, వివిధ పాఠశాల, కళాశాలల పీఈటీలు, పీడీలు, విద్యార్థులు పాల్గొన్నారు.

అక్రమ కలప లారీ పట్టివేత

విశాలాంధ్ర - దమ్మపేట : అటవీ ప్రాంతం ఎక్కువగా ఉన్న దమ్మపేట మండలంలో అక్రమ కడప దందాకు శాఖ అధికారులు నిఘా విస్తృతం చేసి కఠిన చర్యలు చేపట్టారు. అనుమతులు లేకుండా నాచారం పరిధిలోని సీతారాంపురం సమీపం గుండా భారీ లారీ ద్వారా తరలిస్తున్న మామిడి కలపను శనివారం దమ్మపేట ఫారెస్ట్ రేంజర్ శ్రీనివాసరావు తన సిబ్బందితో కలిసి పట్టుకున్నారు. కలపతో పాటు (ఏపి 16- టి జి. 2647) లారీని స్థానిక అటవి శాఖ కార్యాలయానికి తరలించి కేసు నమోదు చేశారు. శాఖ అధికారులపై ఎన్ని వత్తిల్లు ప్రలోభాలకు గురి చేసినప్పటికీ తలగకుండా కేసులు నమోదు చేయడం గమనార్హం. దమ్మపేట రేంజ్ పరిధిలో తరచుగా జరుగుతున్న అక్రమ చర్యలను అరికట్టేందుకు నిఘాను మరింత పెంచినట్లు రేంజర్ తెలిపారు. అక్రమాలకు పాల్పడే వారు ఎంతటి వారైనా సరే చట్టపరమైన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ప్రభుత్వ నియమ నిబంధనలకు అనుగుణంగా అనుమతులు పొందాకే వన భూముల్లోని కలపను సరఫరా చేయాలని రేంజర్ స్పష్టం చేశారు. అటవీ ప్రాంతాల్లో జరిగే అక్రమాలను ఉపేక్షించబోమన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ధర్నా

విశాలాంధ్ర ప్రతినిధి-పెద్దపల్లి,సింగరేణి: సింగరేణి పెండింగు సమస్యలు పరిష్కరిచాలని కోరుతూ శనివారం సాయంత్రం ఆర్జీ వన్ జిఎం కార్యాలయం ముందు గుర్తింపు సంఘం ఏఐటియుసి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి జనరల్ మేనేజర్ లలిత్ కుమార్‌కు పది డిమాండ్‌లతో కూడిన వినతి పత్రాన్ని ఇచ్చారు. ఈ ధర్నాలో నాయకులు మడ్డి ఎల్లయ్య,పోషం చదితకులప పాల్గొని మాట్లాడారు.

ముత్తగూడెంలో మరో హత్య

విశాలాంధ్ర, ఎదులాపురం మునిసిపాలిటీ :ఎదులాపురం మున్సిపాలిటీ పరిధిలో గల ముత్తగూడెం గ్రామంలో మరో వ్యక్తి హత్యకు గురైన ఘటన శనివారం చోటుచేసుకుంది ఇదే గ్రామంలో కుటుంబ నేపథ్య విషయంలో హత్య జరిగిన విషయం మరువకముందే మరో హత్య జరగటంతో ముత్తగూడెం గ్రామ ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ముత్తుగూడెం గ్రామానికి చెందిన బూర శ్రీనివాసరావు (45)ఖమ్మం నగరంలో ఓ స్వీట్ షాప్ లో 15 సంవత్సరాలుగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు ఈనెల 6న సాయంత్రం స్వీట్ షాప్ లో పని ముగిలించుకొని ఇంటికి తిరిగి వస్తుండగా అదే గ్రామానికి చెందిన వరుసకు సోదరుడైన ఓ వ్యక్తి మరో వ్యక్తితో కలిసి బైపాస్ రోడ్‌లో శ్రీనివాసరావును హటకయించి తన వెంట తెచ్చుకున్న కారులో తీసుకెళ్లినట్లు సమాచారం. రాత్రి వరకు శ్రీనివాసరావు ఇంటికి తిరిగి రాకపోవడంతో ఆయన భార్య ఖమ్మం రూరల్ పోలీసుల దృష్టికి తీసుకెళ్లడం జరిగింది. దీంతో శుక్రవారం రూరల్ పోలీసులు విచారణ చేపట్టారు శనివారం మధ్యాహ్నం ఖమ్మం నగరంలోని సాగర్ కాలవలో శ్రీనివాసరావు మృతదేహం కనిపించడంతో ఒక్కసారిగా ముత్తగూడెంలోని ప్రజలు భయాందోళనలు చెబుతున్నారు మృతుడు శ్రీనివాసరావు భార్య అక్రమ సంబంధం నేపథ్యంలో ఈ హత్య జరిగినట్లు గ్రామంలో జోరుగా చర్చ జరుగుతుంది. మృతుడు శ్రీనివాసరావు కు పరసకు సోదరుడైన వ్యక్తితో కలిసి ఈ హత్య చేసి కాలంలో పడేసి ఉంటారని గ్రామస్తులు భావిస్తున్నారు. ఈ హత్యకు సంబంధించి ఖమ్మం రూరల్ పోలీసులు విచారణ చేపట్టి ఇప్పటికే నిందితున్ని అదుపులోపు తీసుకున్నట్లు సమాచారం

వినియోగదారుని విజయం

విశాలాంధ్ర ఖమ్మం (లీగల్) : వినియోగదారులకు అనేక రూపాల్లో జరిగే నష్టాలు, మోసాలపై పట్టుదలతో పోరాడితే విజయం సాధించవచ్చని నిరూపించాడు ఖమ్మం నగరానికి చెందిన ఓ యువకుడు. ఫలితంగా ప్రముఖ టీవీఎస్ కంపెనీకి వినియోగదారుల కమిషన్ రూ.60 వేల అపరాధ రుసుమును విధించింది. వినియోగదారుడు ఎదుర్కొన్న మానసిన ఇబ్బందికి, వెచ్చించిన ఖర్చును లెక్కకట్టి అపరాధ రుసుముకు జోడించడం విశేషం. ఈ మేరకు ఖమ్మం జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ ఇంచార్జ్ చైర్మన్ వడ్లమాని లలిత, సభ్యురాలు మాధవిలత తీర్పునిచ్చారు. కేసు పూర్వాపరాల్లోకి వెళితే... ఖమ్మం నగరం నరసింహ స్వామి గుట్ట ప్రాంతానికి చెందిన నితిన్ విజేత రామిశెట్టి అనే విద్యార్థి హైదరాబాదు నగరంలోని మలక్ పేట టీవీఎస్ షోరూంలో తనకు ఎంతో ఇష్టమైన టీవీఎస్ అపాచీ ద్విచక్ర వాహనాన్ని 2021 మే నెలలో కొనుగోలు చేశాడు. ఈ బండిని అక్షరాలా 2,65,234లను వెచ్చించి కొనుగోలు చేశాడు. అయితే వాహనం కొంతకాలం పాటు బాగానే నడిచింది. ఆ తర్వాత సమస్యలు మొదలయ్యాయి. వాహనం నడుపుతుండగా ఇంజిన్ బాగా వేడెక్కడంతో పాటు ప్రయాణం మధ్యలో అకస్మాత్తుగా ఆగుతూ ఉండేది. ఇలా అనేక సార్లు మొరాయించడంతో ఆ విద్యార్థి షోరూం నిర్వాహకులను ఆశ్రయించాడు. అయినా ఫలితం లేకపోయింది. దీంతో సదరు వినియోగదారుడు తనకు జరిగిన అన్యాయంపై పోరాడేందుకు న్యాయవాది వెల్లంపల్లి నరేంద్ర స్వరూప్‌ని సంప్రదించాడు. ఆయన ద్వారా ఖమ్మం జిల్లా వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించి కేసును దాఖలు చేశారు. సాక్షాధారాలు, పూర్వాపరాలను పరిశీలించిన కమిషన్ తుది తీర్పును తాజాగా వెలువరించింది. వినియోగదారుడు కొనుగోలు చేసిన టీవీఎస్ అపాచీ వాహనం సరైన రీతిలో ఉండేలా అవసరమైన వాహన పరికరాలు ఉచితంగా అందజేయాలని కమిషన్ కంపెనీని ఆదేశించింది. అలాగే రూ.50 వేల అపరాధ రుసుమును విధించింది. అంతటితో ఆగకుండా ఫిర్యాదుదారుడు ఇన్నేళ్లు ఎదుర్కొన్న మానసిక వేదనతో పాటు ఖర్చులను సైతం కమిషన్ పరిగణలోకి తీసుకుంది. ఇందుకు మరో పదివేల రూపాయల మొత్తాన్ని 45 రోజుల వ్యవధిలో చెల్లించవలసిందిగా ఖమ్మం జిల్లా వినియోగదారుల కమిషన్ తీర్పునిచ్చింది.

అట్టహాసంగా ముగిసిన జోనల్ స్థాయి క్రీడలు

విశాలాంధ్ర- తుంగతుర్తి : విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలని, క్రీడలు మానసిక శారీరక దృఢత్వానికి దోహదపడతాయని గురుకుల పాఠశాల జోనల్ అధికారి అరుణ కుమారి స్పష్టం చేశారు. మూడు రోజుల పాటు కొనసాగిన 11వ జోనల్ లెవెల్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ గురుకులాల క్రీడలు శనివారం అట్టహాసంగా ముగిశాయి. రెండవ రోజు వేడుకలకు జోనల్ అధికారి అరుణకుమారి శుక్రవారం రాత్రి ముఖ్య అతిథిగా హాజరవగా శనివారం శనివారం జరిగిన ముగింపు వేడుకలకు నల్గొండ డిసిఓ జె శోభారాణి ముఖ్య అతిథిగా హాజరై ముగింపు వేడుకలను ప్రారంభించారు. క్రీడాకారులను పరిచయం చేసుకొని వారితో పాటు కబడ్డీ ఆడి అందరిని ఆకట్టుకున్నారు. మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల/ కళాశాలలో సూర్యాపేట, యాదాద్రి భువనగిరి, జనగాం జిల్లాలకు చెందిన 09 గురుకుల పాఠశాలలకు చెందిన 765 మంది విద్యార్థులు క్రీడల్లో పాల్గొన్నారు. ముగింపు సందర్భంగా విద్యార్థుల ఆటపాటలతో సందడి నెలకొంది. విద్యార్థులతోపాటు ఉపాధ్యాయులు, బతుకమ్మ ఆడారు. అనంతరం వివిధ విభాగాల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రధానంచేసి శు భాకాంక్షలు తెలిపారు. ముగింపు వేడుకలో పాఠశాల ప్రిన్సిపాల్ కే. సంధ్యారాణి, నకిరేకల్, తిప్పర్తి, కట్టంగూర్, నిడమనూరు, చండూరు ప్రిన్సిపాల్‌లు, స్పోర్ట్స్ ఓవరాల్ ఇన్చార్జి జ్యోతిర్మయి, డాక్టర్ విజయ్‌కుమార్, హెచ్ఈఓ రవికుమార్, తల్లిదండ్రుల కమిటీ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ కొండగడుపుల ఎల్లయ్య,పీడీ లు, పీఈటీ లు, మూడు జిల్లాల గురుకుల విద్యాలయాల ప్రిన్సిపాల్‌లు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

శ్యాంసుందర్‌కు సత్కారం

విశాలాంధ్ర ప్రతినిధి - మంచిర్యాల జిల్లా: మంచిర్యాల జిల్లా మంద మర్రి ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయంలో పర్సనల్ మేనేజర్ గా విధులు నిర్వహించిన ఎస్ శ్యాంసుందర్ శనివారం రోజు మందమరి ఏరియా

నుండి భూపాలపల్లి కి బదిలీ పై వెళ్తున్న సందర్భంగా మందమర్రి ఏరియా లోని గనుల సంక్షేమ అధికారులు, జనరల్ మేనేజర్ కార్యాలయంలోని డి వై పి ఎం లు, సీనియర్ పిఓ లు, పర్సనల్ ఓ.ఎస్ పర్సనల్ డిపార్ట్మెంట్ సిబ్బంది జ్ఞాపికను అందజేసి, శాలువాకప్పి సత్కరించారు. ఈ సందర్భంగ పర్సనల్ మేనేజర్ ఎస్. శ్యాంసుందర్ మాట్లాడుతూ, ప్రతి ఒక్క అధికారి ఉన్న స్థలము నుండి వేరొక స్థలంలోకి బదిలీపై వెళ్లడం అనివార్యమన్నారు. మనం చేసే పనిని బాధ్యతగా చేయాలని సూచించారు. అనంతరం డివైపిఎంలు, సీనియర్ పిఓలు, గనుల సంక్షేమ అధికారులు, పర్సనల్ ఓఎస్ డిపార్ట్మెంట్ సిబ్బంది పర్సనల్ మేనేజర్‌గా చేసిన విశిష్ట సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో డివై పిఎం ఆసిఫ్, ఎస్ఆర్ పిఓ సందీప్, కార్తీక్, సత్యనారాయణ, శంకర్, వంశీ, భార్గవ్, జీస, మదర్ సాబ్, సందీప్, సంక్షేమ అధికారి రవళి, పర్సనల్ డిపార్ట్మెంట్ ఓఎస్ రాజలింగు, పర్సనల్ డిపార్ట్మెంట్ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా రేవంత్‌రెడ్డి పుట్టినరోజు వేడుక

విశాలాంధ్ర-వైరా : వైరా మండలం జింకలు గూడెం గ్రామంలో శనివారం తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ పుట్టినరోజు వేడుకల్లో ముఖ్యఅతిథిగా కాంగ్రెస్ యువనాయకుడు జవాజి నాగరాజు పాల్గొన్నారు. కాంగ్రెస్ నాయకులతో కలిసి రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. కేక్‌కట్ చేసి స్వీట్లు పంచి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా జవ్వాజి నాగరాజు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ఇందిరమ్మ పాలన వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎన్నో సంక్షేమ పథకాలను మంత్రివర్గంతో కలిసి ప్రజలకు అందిస్తున్నారని, అలాంటి ముఖ్యమంత్రి నిండు నూరేళ్లు ఆరోగ్యంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో జవ్వాజి కృష్ణయ్య,దుగ్గిరాల శ్రీనివాసరావు, జవ్వాజి వెంకటేశ్వరరావు,షేక్ ఇస్మాయిల్,మమ్మద్ మీరా, షేక్ సమూల్లా,షేక్ నాగుల మీరా,షేక్ యాకోవలి,షేక్ రఫీ షేక్ మహబూబ్ అలీ,షేక్ ఇమామ్ సాహెబ్ షేక్ కరీం,షేక్ హుస్సేన్ పాల్గొన్నారు

ఘనంగా సీఎం జన్మదిన వేడుక

విశాలాంధ్ర బ్యూరో నిర్మల్ జిల్లా : శనివారం, ఖానాపూర్, ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలోతెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు ఎనుముల రేవంత్ రెడ్డి జన్మదినోత్స, వేడుకలు ఘనంగా జరుపుకొని తదుపరి ఖానాపూర్, తాజా మాజీ మున్సిపల్ చైర్మన్ రాజురా చిన్నం సత్యం, పట్టణ పరిసర ప్రాంతాల్లో నివాసం ఉంటున్న నిరుపేద ప్రజలకు అనాధలకు తిను ఆహార పదార్థాలు, వారి అనుచరులతో పంపిణీ చేశారు, ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు

సంపాదకీయం

కుక్కకాటుకు కోర్టుదెబ్బ!

కనకపు సింహాసనమున శునకము గూర్చుండ బెట్టి శుభ లగ్నమునన్...ఒనరగ పట్టము గట్టిన వెనుకటి గుణమేల మాను? విశ్వదాభిరామ వినుర వేమ! బంగారు సింహాసనంపై ఒక కుక్కను కూర్చోబెట్టి, మంచి ముహూర్తాన పట్టాభిషేకం చేసినా, అది దాని పాత స్వభావాన్ని (కుక్క స్వభావాన్ని) ఎలా మర్చిపోగలదు? అంటే, స్వభావసిద్ధమైన గుణాలు అంత తేలికగా మారవు అని వేమన చెబుతారు. ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు, బీజేపీ నాయకులు వందేమాతరం గీతం పాడినట్లన్నమాట! కుక్క గోవు కాదు, కుందేలు పులి కాదు, పంది పాలుగాదు, పాలు పందికి పాలుగాదు, అల్ప సుఖములెల్ల ఆత్మ సుఖము కాదురా..అని మరో పద్యంలోనూ వేమన ఇంకో నగ్నసత్యం చెపుతాడు. దానర్థం ఏమిటంటే, కుక్క ఆవు కాదు, కుందేలు పులి కాదు. అలాగే పందికి పాలు పనికిరావు (పాలు దానికి ఆహారం కాదు), పాలు పందిలాంటివి కాదు. చిన్న చిన్న సుఖాలన్నీ ఆత్మకు శాశ్వతమైన ఆనందాన్ని ఇవ్వవు. ప్రతి వస్తువుకు, జీవికి దాని స్వభావం వేరు అని చెప్పే సందర్భంలో వేమన కుక్కను ఉదాహరణగా తీసుకున్నారు. భారత స్వాతంత్ర్య సమరంలో బ్రిటిష్‌వారికి తొత్తులుగా, కుక్కల్లాగ పనిచేసిన సంఘపరివార్ జాతీయోద్యమ గీతం గురించి భాష్యం చెపుతుంటే ఎవరికైనా చిరాకు రాకమానదు. కుక్క గురించి అనుకూల, ప్రతికూల భాషణలూ రెండూ కన్పిస్తాయి. కుక్క విశ్వాసాన్ని లేదా దాని తత్వాన్ని పోల్చుతూ చాలా నీతిపద్యాలు, సామెతలు, వ్యాఖ్యలు, వాక్యాలు...ఇలా చాలానే ఉన్నాయి. కుక్కపిల్ల, సబ్బుబిళ్ల, అగ్గిపుల్ల...కాదేదీ కవితకనర్హమంటూ మన శ్రీశ్రీ సైతం సిగార్ సెగల నుంచి ఒక పొగరింగును ఊదేసినట్లు చిన్న ప్రస్తావన చేసిన విషయం ఈ సందర్భంగా గుర్తురాకమానదు. కవులు, రచయితలు పక్కనబెడితే, కుక్కల గురించి సుప్రీంకోర్టు స్టడీ (అధ్యయనం) చేసినట్లుగా ఇంకెవరూ చేసి ఉండరేమోనని అన్పిస్తుంది. సుప్రీంకోర్టు తాజాగా వీధికుక్కల మీద ఒక ఉద్యమమే నడిపింది. జనసమ్మర్ద ప్రాంతాల్లో అస్సలు వీధికుక్కలు కనబడకూడదంటూ తీర్పునిచ్చి సంచలనం సృష్టించింది. ఆసుపత్రులు, బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు, విద్యాసంస్థలు, క్రీడా ప్రాంగణాల్లో వీటి జాడే ఉండరాదని, రెండేరెండు వారాల్లో ఆయా ప్రాంతాల్లో కంచెలు వేయాలని కూడా ఆదేశించింది. అక్కడ కన్పించిన కుక్కలను తక్షణమే స్టెరిలైజ్ చేసి షెల్టర్లకు తరలించాలని, దీని అమలుపై మూడువారాల్లో నివేదిక ఇవ్వాలని రాష్ట్రాల సీఎస్‌లకు సుప్రీంకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. గత మూడు మాసాలుగా మహోన్నత న్యాయస్థానం దేశంలో కుక్కలబెడదపై విచారణ చేస్తూనే ఉంది. పౌరుల భద్రత, చిన్నారులు, వృద్ధులు, అనారోగ్యానికి గురైన వారి రక్షణకు అత్యంత ప్రాధాన్యతనివ్వాలన్న దృక్పథంతో కోర్టు ఈ రకమైన తీర్పునివ్వాల్సి వచ్చింది. సుప్రీం బాధలో 'బాధ'లేకపోలేదు. కుక్కను పెంచుకుంటే నెత్తినపెట్టుకొని ఊరేగుతారు. అది వేరే విషయం. వీధికుక్కలు ఎవరి సొంతం కావు. అందుకే అవి ఊరకుక్కలయ్యాయి. వీధికుక్కలతో ఇబ్బందులుపాలుకాని వారు ఎవరూ లేరు. అందుకే కొందరు తెలివిగా ప్రభుత్వ కార్యాలయాల్లో లంచాలు ఇచ్చినట్లుగా కుక్కలకు బిస్కెట్లు వేసి మచ్చిక చేసుకుంటూ ఉంటారు. ఎల్లప్పుడూ ఒక్క కుక్కకే బిస్కెట్లు వేస్తే ఉపయోగం ఉండదు. మిగతా కుక్కలు వెంటాడినా ఆశ్చర్యపోనవసరం లేదు. అందుకే అన్ని కుక్కలకూ బిస్కెట్లు వేసుకుంటూ పోవాలి. కుక్కకు బిస్కెట్లు వేయడమంటే, స్టేజీపైన నాయకులను పొగడ్తలతో ముంచెత్తడంతో సమానమన్నమాట! కుక్క మనిషికి ఉత్తమ స్నేహితుడని, నిస్వార్థ స్నేహానికి ప్రతీక అని, విశ్వాసపాత్రమైన కుక్క అని కుక్కల మంచి గురించి చెప్పకుండా ఉండలేం. అదేసమయంలో, చెడు స్వభావం మారదన్న ఉద్దేశంలో కుక్కతోక వంకర అని, గట్టిగా మాట్లాడేవాళ్లు, బెదిరించేవాళ్లతో పెద్దగా ప్రమాదం ఉండబోదన్న సందర్భంలో 'మొరిగే కుక్కలు కరవవు' అని, జరిగిపోయిన చెడును మళ్లీ తవ్వవద్దు అని చెప్పే సందర్భంలో 'నిద్రపోతున్న కుక్కలను లేపవద్దు' అని అంటూ ఉంటాం. ప్రతి ఒక్కరూ స్వార్థంతో కొట్టుకుంటున్నారని చెప్పే క్షణంలో 'ఇది కుక్కలు కుక్కలను తినే ప్రపంచం' అనే సామెత ఉండనే ఉంది. అనవసరంగా, పనికిమాలిన పని అని చెప్పేటప్పుడు కుక్క మొరుగుతున్నదని, దీనమైన, తక్కువస్థాయి జీవితం అనుభవించే వారిని చూస్తే 'కుక్క బతుకు' అని అంటూ ఉంటారు. కుక్కనీ, కుక్క కాటునీ ఇంతగా చెప్పుకుంటున్నాం కాబట్టే సుప్రీంకోర్టు సైతం దీన్ని తీవ్రంగా పరిగణించింది.

దేశ జనాభా 146 కోట్లు ఉండగా, వీధి కుక్కలు 1.53 కోట్లు ఉన్నట్లు ఒక అంచనా. దేశవ్యాప్తంగా రోజుకు 10 వేల కుక్కకాట్లు ఉంటున్నాయంటే కుక్కల స్వైరవిహారం ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. కేంద్ర ప్రభుత్వ గణాంకాల ప్రకారం, గతేడాది సగటున రోజుకు 10,000 మంది కుక్కకాటుకు గురయ్యారని తేలింది. దేశవ్యాప్తంగా 2024లో 37,15,713 కుక్కకాటు కేసులు నమోదయ్యాయి. నిజంగానే ఇదొక రికార్డు. 2025 జనవరి ఒక్కమాసంలో 4.29 లక్షల మంది కుక్కకాటు బారినపడ్డారు. తెలుగు రాష్ట్రాల విషయానికొస్తే, ఆంధ్రప్రదేశ్‌లో 2022లో 1,92,360 కుక్కకాటు కేసులు నమోదుకాగా, 2024నాటికి ఈ సంఖ్య 2,45,174కు చేరింది. తెలంగాణలో 2022లో 92,924 కేసులు నమోదుకాగా, 2024 నాటికి ఆ సంఖ్య 1,21,997కు చేరింది. ఏపీతో పోల్చితే తెలంగాణలో కుక్కకాట్లు తక్కువే. అంటే ఏపీ కుక్కల కన్నా తెలంగాణ కుక్కలు కాస్త సౌమ్యంగా ఉన్నట్లు కన్పిస్తున్నాయి. 2022-2024 మధ్యకాలంలో అత్యధికంగా కుక్కకాటు కేసులు నమోదైన టాప్-10 రాష్ట్రాల్లో మహారాష్ట్ర (13.5 లక్షలు) మొదటిస్థానంలో ఉంది. బహుశా మహారాష్ట్రలో సగం కుక్కలు ముంబయి పరిసరాల్లోనే ఉండి ఉండవచ్చు. ముంబయిలోని ఏ వీధిలో అడుగుపెట్టినా కుక్కలే కన్పిస్తాయి. తెలంగాణ (3.33 లక్షలు) 8వ స్థానంలో ఉంది. గణాంకాలు లేకపోయినా ఏపీలో విజయవాడలో ఉన్నంతగా కుక్కలు ఇంకెక్కడా ఉండవేమో! విజయవాడ నగర పాలక సంస్థలో కుక్కలు పట్టే సిబ్బంది గాడిదలు కాస్తారని స్థానిక సామెత ఒకటుంది. మహారాష్ట్ర రేబిస్ మరణాల్లో (35) అగ్రస్థానంలో ఉండగా, తెలంగాణలో ఒక్క రేబిస్ మరణమూ సంభవించలేదు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ గణాంకాల ప్రకారం ఈ ఏడాది జులై వరకు 87,366 కుక్కకాటు కేసులు నమోదయ్యాయి. కుక్కకాటు నుంచి తప్పించుకోవడంలో తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన చర్యలు హర్షామోదయోగ్యమైనవే. కుక్కకాటు ఇంత తీవ్రంగా ఉందికాబట్టే సుప్రీంకోర్టు అంత తీవ్రంగా తీర్పునిచ్చింది. కుక్కలను పట్టుకొని సంతానోత్పత్తి నియంత్రణ శస్త్రచికిత్స చేసిన తర్వాత కూడా తిరిగి అదే ప్రదేశంలో వదిలి పెట్టడం కుక్కల సిబ్బందికి ఆనవాయితీ. అయితే ఎట్టిపరిస్థితుల్లోనూ అలా చేయవద్దని సుప్రీంకోర్టు తాజా మార్గదర్శకాల్లో స్పష్టం చేయడం గమనార్హం. జాతీయ రహదారులు, ఎక్స్‌ప్రెస్ హైవేలపై పశువుల విచ్చలవిడి సంచారంపైనా ఉన్నత న్యాయస్థానం అసహనం వ్యక్తం చేయడం మరో విశేషం. అలాంటి పశువులను గోశాలకు తరలించాలని కోరింది. రాష్ట్ర ప్రభుత్వాలు, జాతీయ రహదారుల శాఖ, స్థానిక సంస్థలు, హైవే గస్తీ బృందాలు పకడ్బందీగా ఈ ఆదేశాలను అమలు చేయాల్సిన అవసరం ఉంది.

ప్రజలగొంతు నొక్కేస్తున్న మోదీ

ముప్పాళ్ల భార్గవ శ్రీ

పర్యావరణానికి, ప్రజల ఆరోగ్యాలతో చెలగాటమాడే పరిశ్రమలు స్థాపించబోయే ముందు కాలుష్య నియంత్రణ బోర్డులు ఆయా ప్రాంతాల్లో నిర్వహించే ప్రజాభిప్రాయ సేకరణ సందర్భంగా తమ ప్రాంతంలో పెట్టే పరిశ్రమ వలన పర్యావరణంతో పాటు తమ ఆరోగ్యాలను ఏ విధంగా నష్టపోతామో వివరంగా చెప్పుకునే అవకాశం లభిస్తుంది. మెజారిటీ ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకొని ఈ ప్రాంతంలో పరిశ్రమలు పెట్టాలా వద్దా అనే సూచనలను ఆయా ప్రభుత్వాలకు పంపుతాయి. ఈ మధ్య విశాఖ జిల్లా పెదగంట్యాడలో అదాని అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటుపై ప్రజాభిప్రాయ సేకరణ చేస్తున్న అధికారులపై ఆగ్రహంతో ఆ ప్రాంత ప్రజలు టెంట్లను పీకివేసి, కుర్చీలను విరగ్గొట్టి తమ ధర్మాగ్రహాన్ని వ్యక్తం చేశారు. ఇక్కడే కాదు బల్క్ డ్రగ్ ప్లాంట్ పెట్టే విశాఖ జిల్లా నక్కపల్లి ప్రాంతంలో, హైడ్రో పవర్ ప్రాజెక్టులు పెట్టే అల్లూరు జిల్లా ప్రాంతంలో, ఏలూరు జిల్లాలో నేవీ ఆయుధ డిపో, సోలార్ విద్యుత్ పరికరాల ప్రాజెక్టు కోసం కరేడు ప్రాంతం, ఇంకా రాష్ట్రంలోని మరికొన్ని చోట్ల ప్రజలు తమ తీవ్ర నిరసన తెలియజేసిన ఫలితంగా ఆయా ప్రాంతాలలో పెట్టాలనుకున్న ఫ్యాక్టరీలు, పరిశ్రమలు తాత్కాలికంగా ఆగిపోయాయి. తాజాగా కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వలన అదాని లాంటి బడా కార్పొరేట్ శక్తులు తలపెట్టిన ప్రాజెక్టులు, ఫ్యాక్టరీలు, పరిశ్రమలు ఎటువంటి ప్రజాభిప్రాయ సేకరణ లేకుండా ప్రారంభిస్తున్నారు. ఇది పర్యావరణానికి కాదు ప్రజల పాలిట అశనిపాతం లాంటి చర్య.

అక్టోబర్ 1 వ తేదీన కేంద్రంలోని మోదీ ప్రభుత్వం విధానపరమైన ఓ ప్రధాన మార్పును ప్రకటించింది. వాతావరణ ప్రభావ అంచనా నోటిఫికేషన్ 2006కి సవరణ చేస్తూ ప్రకటించిన నోటిఫికేషన్ ఇది. సొంత క్యాప్టివ్ ప్లాంట్లు (ఇలాంటి నిర్మాణానికి కావలసిన విద్యుత్తును ఉత్పత్తి చేసే ప్లాంట్లు లేకపోవడం, 90 శాతం పైగా రైల్వే ట్రాన్స్‌పోర్ట్ పై ఆధారపడేవి) లేని సిమెంట్ గ్రైండింగ్ యూనిట్లకు ముందస్తు పర్యావరణ అనుమతులు అవసరం లేదని తెలిపింది. ఈ సవరణకు సంబంధించి కేంద్ర పర్యావరణ అటవీ శాఖ ముసాయిదా నోటిఫికేషన్ జారీ చేసింది. ముంబయిలోని కల్యాణ్ ప్రాంతంలో అదానీ గ్రూప్ సిమెంట్ ఉత్పత్తిని చేసే ప్లాంట్‌ను ప్రారంభించాలన్న ప్రయత్నాలపై ఈ ప్రాంత ప్రజల నుంచి తీవ్రమైన నిరసన వ్యక్తమవుతోంది. గతంలో అమలులో ఉన్న నిబంధనల ప్రకారం ఇలాంటి ప్లాంట్లు ప్రారంభించాలంటే ప్రజాభిప్రాయం సేకరించాల్సి ఉంటుంది. సవివరమైన పర్యావరణ ప్రభావ నివేదికను కూడా సమర్పించాలి. కొత్తగా మోదీ ప్రభుత్వం ప్రకటించిన నిబంధనల ప్రకారం ఇవేవీ అవసరం లేదు. ప్లాంటుపై సూచనలు, సలహాలు, అభ్యంతరాలు తెలపడానికి 60 రోజుల సమయం మాత్రం ఇచ్చారు. ఇది కేవలం కన్నీటి తుడుపు చర్య మాత్రమే.

అదానీ గ్రూపునకు అనుబంధ సంస్థ అయిన అంబుజా సిమెంట్స్ రూ.1,400 కోట్ల పెట్టుబడితో ఆరు సిమెంట్ గ్రైండింగ్ యూనిట్లను కల్యాణ్ ప్రాంతంలో నెలకొల్పాలని యోచిస్తోంది. అయితే పర్యావరణం, ప్రజల ఆరోగ్యంపై అవి చూపే తీవ్ర ప్రభావం గురించి వారు పెద్ద ఎత్తున ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రెక్కల కష్టం చేసుకునే జనాభా ఎక్కువగా ఉండే కల్యాణ్ ప్రాంతంలో ఈ ప్రభావం మరింత అధికంగా ఉంటుందని ప్రజలు భయపడుతున్నారు. ఈ యూనిట్ల నుంచి వెలువడే సల్ఫర్ డయాక్సైడ్, నైట్రోజన్ ఆక్సైడ్స్, కార్బన్ మోనోక్సైడ్ వంటి కాలుష్య ఉద్గారాల ప్రభావంతో తమ ఆరోగ్యాలు పూర్తిగా దెబ్బతింటాయని ఆందోళన చెందుతున్నారు. కల్యాణ్‌కు సమీపంలోని పదికి పైగా గ్రామాల ప్రజలు తమ ఆందోళనలను కొనసాగిస్తున్నారు. తమ ఆందోళనకు మద్దతుగా సంతకాల సేకరణ కూడా జరుపుతున్నారు.

తాజాగా మోదీ ప్రభుత్వం ప్రకటించిన ముసాయిదా నోటిఫికేషన్ ప్రకారం క్యాప్టివ్ ప్లాంటు లేని సంస్థలు ప్రారంభించే పరిశ్రమలకు ప్రజాభిప్రాయ సేకరణతో పాటు పర్యావరణ ప్రభావ నివేదికలు అవసరం లేదని ప్రకటించడంతో అదాని, అంబానీ లాంటి బడా కార్పొరేట్ శక్తులకు ఇక అడ్డూఅదుపు ఉండదు. అన్ని రంగాలలో కేంద్ర పాలకులు అనుసరిస్తున్న ప్రైవేటీకరణ విధానాల దుష్ఫలితాలు ఈ రూపంలో బయటపడుతున్నాయి. వీటికి ప్రజల జీవితాలు నిర్దాక్షిణ్యంగా బలైపోయే ప్రమాదాలు చుట్టుముట్టుతున్నాయి. కావున ప్రజల జీవితాలకు ఉరితాడు కాబోతున్న మోదీ ప్రభుత్వం విడుదల చేసిన ముసాయిదా నోటిఫికేషన్ బేషరతు రద్దు కోసం వివిధ రకాల పరిశ్రమలు నిర్మించే ప్రాంతాల ప్రజలతో పాటు వివిధ రంగాల ప్రజా సంఘాలు, ప్రజాతంత్ర వాదులు, వామపక్ష శక్తులు సంఘటిత ఉద్యమం నిర్మించటానికి సమాయత్తం కావాలి.

సెల్ నెం. 98481 20105

పీపీపీకి వైద్యం...రాజ్యాంగ విరుద్ధం

గుజ్జుల ఈశ్వరయ్య
కార్యదర్శి,
సీపీఐ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమితి

ప్రభుత్వ నూతన వైద్య కళాశాలల్లో పబ్లిక్-ప్రైవేట్-పార్ట్నర్‌షిప్ (పీపీపీ) విధానాన్ని అమలు చేయాలని చంద్రబాబు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం అత్యంత ప్రమాదకరమైనది. ఈ విధానం సామాజిక న్యాయం, విద్యార్థుల హక్కులు, ఉపాధి భద్రత, పేద, మధ్యతరగతి వర్గాల భవిష్యత్తుపై తీవ్రమైన ప్రతికూల ప్రభావం చూపుతుంది. ఇది రాజ్యాంగంలోని మౌలిక సూత్రాలకు విరుద్ధమై, సామాజిక వర్గాల అభ్యున్నతికి భంగం కలిగించే చర్యగా నిలుస్తుంది. రాష్ట్రంలోని 10 నూతన ప్రభుత్వ వైద్య కళాశాలలను పీపీపీ విధానంలో ప్రైవేటీకరించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం జీవో నంబర్ 590ని జారీ చేయడం తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. ఇది కేవలం వైద్య విద్య వెనుక ఉన్న సామాజిక లక్ష్యాన్ని కాకుండా, ఆ విద్యకు అనుబంధమైన ప్రభుత్వ ఆసుపత్రుల్లో చికిత్స పొందే పేదప్రజల వైద్య సేవలకు కూడా దూరం కలిగిస్తుంది. ప్రభుత్వ రంగంలోని స్థిర ఉద్యోగ అవకాశాలు నిరుద్యోగ యువతకి అందకుండా పోతాయి. ప్రైవేటు పరిధిలోకి వెళ్లే ఉద్యోగాలు తక్కువ వేతనాలు, అనిశ్చిత పరిస్థితులను తీసుకువస్తాయి. ప్రజల ఆరోగ్య హక్కులు, ప్రభుత్వ వైద్య విద్యా వ్యవస్థలు విచ్ఛిన్నం అవుతాయి. చంద్రబాబు నాయకత్వంలో ఆరోగ్యరంగంలో పురోగతి ఆశించిన ప్రజలు, ఈ ఏడాది సెప్టెంబర్ 9 న విడుదలైన జీఓ 590తో విస్మయానికి గురయ్యారు. మార్కాపురం, మదనపల్లి, ఆదోని, పులివెందుల, పెనుగొండ, పాలకొల్లు, అమలాపురం, నర్సీపట్నం, బాపట్ల, పార్వతీపురం ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన నూతన ప్రభుత్వ వైద్య కళాశాలలు పీపీపీ పరిధిలోకి వస్తే, సామాజిక న్యాయం, ఆర్థిక భారాలు, రాజ్యాంగ హక్కుల విషయంలో ప్రజల్లో పెద్ద ఎత్తున ఆందోళన నెలకొంటోంది.



గత ప్రభుత్వం కొత్తగా 17 వైద్య కళాశాలలను స్థాపించగా, ఆ కళాశాలల వలన వైద్య సీట్ల సంఖ్య పెరుగుతుందని, వేలాది యువతకు ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని ఆశించారు. ఆ సమయంలో కొత్త కళాశాలల సీట్లను జీవో నంబర్ల 107, 108 ద్వారా స్వీయ ఫైనాన్స్ ద్వారా భర్తీ చేయాలని నిర్ణయించగా, వామపక్ష, విద్యార్థి, యువజన సంఘాలు తీవ్రంగా వ్యతిరేకించాయి. యాజమాన్య కోటా సీటుకు రూ.12 లక్షలు, ఎన్‌ఆర్‌ఐ కోటా సీటుకు రూ.20 లక్షలు వసూలు చేస్తున్నారని, టీడీపీ, జనసేన తీవ్రంగా విమర్శించాయి. కాగా ఇప్పుడు అదే పార్టీలు అధికారంలోకి వచ్చాక, జీవోలు 107, 108 ను రద్దు చేస్తామని ఇచ్చిన హామీ అమలుకాకపోవడమే కాకుండా, వైద్య విద్యను పీపీపీ విధానంలో పూర్తిగా ప్రైవేటు చేతుల్లోకి ఇవ్వాలనే నిర్ణయం తీసుకోవడం మరింత పెద్ద అన్యాయంగా నిలుస్తోంది.

పీపీపీ విధానంతో రూ.3,700 కోట్ల ఖర్చు ఆదా అవుతుందని ప్రభుత్వం చెబుతున్నా, దీని వల్ల కలిగే నష్టం తాత్కాలిక లాభాలను మించి ఉంటుంది. ప్రభుత్వ భూములు, వసతులు దాదాపు 60 సంవత్సరాల పాటు ప్రైవేటు సంస్థల లాభార్జనానికి మారతాయి. మొత్తం 1,500 సీట్లు త్వరగా అందుబాటులోకి వస్తాయని, అందులో 75% సీట్లు కన్వీనర్ కోటా కింద పేదలకు లభిస్తాయని ప్రభుత్వం చెబుతున్నా, 25% యాజమాన్య కోటా సీట్లను (375 సీట్లు) ఒక్కోటి రూ.50-60 లక్షల వరకు విక్రయించే అవకాశం ఉండటంతో పేద, మధ్యతరగతి వర్గాలకి వైద్య విద్య మరింత అందని ద్రాక్షగా మారుతుంది. తక్కువ ఫీజు సీట్ల నిర్వహణ కూడా ప్రైవేటు చేతుల్లో ఉండటంతో వైద్య విద్య నాణ్యత, పారదర్శకత సందేహాస్పదం అవుతుంది. ప్రభుత్వ ఆస్పత్రుల్లో 70% పడకలు ఉచిత వైద్యసేవల కోసం అందుబాటులో ఉంటాయని ప్రభుత్వం చెబుతున్నా, మిగిలిన 30% చెల్లింపు పడకల కారణంగా అత్యవసర పరిస్థితులలో పేదలకు చికిత్స అవకాశాలు తగ్గే ప్రమాదం ఉంది. ప్రైవేటు వ్యవస్థలో సేవానిరతికి స్థానంలో లాభదోహన ప్రాధాన్యత పెరుగుతుంది. గ్రామీణ ప్రాంతాల్లో వైద్య నిపుణులు అందుబాటులోకి వస్తారని ప్రభుత్వం చెప్పినా, ప్రైవేటు నిర్వహణలో అది వాస్తవానికి అనుగుణంగా ఉండకపోవచ్చు. ఈ విధానం రాజ్యాంగంలోని ఆర్టికల్ 21లో పేర్కొన్న 'జీవన హక్కు'ను ఉల్లంఘించడమే అవుతుంది. పీపీపీ విధానం అమలుతో మొత్తం 2,125 వైద్య సీట్లలో 1,277 తక్కువ ఫీజు సీట్లు పేద, రిజర్వేషన్ వర్గాలకు అందకుండా పోతాయి. మొత్తం 1,500 ప్రభుత్వ ఉద్యోగాలలో 1,050 ఉద్యోగాలు ప్రైవేటు పరిధిలోకి వెళ్లిపోతాయి. ఈ విధంగా రిజర్వేషన్ వర్గాలకు చెందిన 2,206 స్థిర ప్రభుత్వ ఉద్యోగ అవకాశాలు నష్టపోతాయి. అందులో బీసీలకు 1,065, ఎస్సీలకు 552, ఈడబ్ల్యూఎస్‌కు 368, ఎస్టీలకు 221 ఉద్యోగాలు కోల్పోయే పరిస్థితి ఏర్పడుతుంది. ఇది ప్రభుత్వ ఉద్యోగ భద్రతను, రిజర్వేషన్ హక్కులను బలహీనపరచే చర్య. ఇప్పటికైనా ప్రభుత్వం ప్రజల అభిప్రాయాన్ని గౌరవించి జీఓ 590ని ఉపసంహరించాలి. 10 నూతన వైద్య కళాశాలలను దశల వారీగా పూర్తిగా ప్రభుత్వ విధానంలోనే నిర్మించి, రాష్ట్రానికి శాశ్వత ప్రభుత్వ ఆస్తులుగా నిలపాలి. న్యాయపరమైన సమస్యలను రివ్యూ పిటిషన్ల ద్వారా పరిష్కరించాలి. పేద ప్రజల వైద్య విద్య హక్కును, సామాజిక న్యాయాన్ని, భవిష్యత్ తరాల అవకాశాలను కాపాడేందుకు ప్రభుత్వం తక్షణమే సానుకూల నిర్ణయం తీసుకోవాలి. లేకపోతే ప్రజాస్వామ్య పోరాటాలు, సామాజిక ఉద్యమాలు రాష్ట్రవ్యాప్తంగా ఉధృతం కావడం అనివార్యం.

అంబేద్కర్ ఆశయ సాధనలో పావనమూర్తి

రేగుళ్ల మల్లికార్జునరావు

ఆ రోజు 1991 ఏప్రిల్ 14 అంబేద్కర్ జయంతి సందర్భంగా విశాఖపట్నంలోని అంబేద్కర్ భవన్‌లో రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్ జీవిత ఛాయాచిత్రమాలిక పేరిట 400 కి పైగా నేను సేకరించి ఏర్పాటు చేసిన అంబేద్కర్ ఛాయాచిత్రాలతో ఫోటో ఎగ్జిబిషన్‌ను పావనమూర్తి ప్రారంభించారు.

అదే రోజు ఆయన అధ్యక్షతన జరిగిన సభలో వారితో పాటు నేను కూడా పాల్గొని ఉపన్యసించాను. అప్పటి నుంచి దశాబ్దం పాటు నేను విశాఖలో పని చేసినంత కాలం వారితో చాలా కార్యక్రమాల్లో పాల్గొన్నాను. బహిరంగ సభలలో ఆ గొంతు వింటే అణగారిన వర్గాల గుండెల్లో ధైర్యం ఉప్పొంగేది. దళిత, బౌద్ధ ఉద్యమాలకు పెద్ద దిక్కుగా ఎందరికో మార్గదర్శిగా నిలిచిన ప్రొఫెసర్ చింతకాయల పావనమూర్తి (93) ఇక లేరు అనే వార్త కేవలం వారి కుటుంబానికే కాదు, యావత్ అంబేద్కరిస్టులకు, అంబేద్కరిజానికి, బహుజన సమాజానికి తీరని లోటు. నాకు తెలిసినంత వరకు, పావనమూర్తి కేవలం ఒక వ్యక్తి కాదు, వారొక ఉద్యమ స్ఫూర్తి. బడుగు బలహీన వర్గాల విద్యార్థుల పాలిట బలమైన భరోసా. ఆయన 1932 మార్చి 28న, అప్పటి ఫ్రెంచ్ పాలనలోని, తూర్పు గోదావరి జిల్లా, కేంద్రపాలిత ప్రాంతమైన పుదుచ్చేరిలో భాగమైన యానాంలోని పెదమాలపల్లి (అంబేద్కర్ నగర్) లో సుబ్బమ్మ, శ్రీరాములు దంపతులకు జన్మించారు. తన ప్రాథమిక విద్యను యానాం, తాళ్లరేవులలో పూర్తిచేసి, కాకినాడ పీఆర్ కళాశాలలో ఇంటర్మీడియట్ చదివారు. కోనసీమలోని ఆది ఆంధ్ర ఉద్యమ ప్రభావం, అలాగే దీనపోషక సమాజం, బ్రహ్మ సమాజం వంటి సంస్కరణోద్యమాల స్ఫూర్తి ఆయనపై బాల్యం నుంచే ప్రభావం చూపాయి. పాఠశాల స్థాయి నుంచే (1948-49) ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్డు కులాల స్టూడెంట్స్ ఫెడరేషన్‌కు తూర్పు గోదావరి జిల్లా అధ్యక్షులుగా పనిచేస్తూనే తోటి విద్యార్థులకు వసతి గృహాల కోసం కృషి చేశారు. యానాం విమోచన కోసం దడాల రమణయ్య నాయకత్వంలో సాగిన పోరాటంలో కూడా ఆయన చురుకైన పాత్ర పోషించారు. విశాఖపట్నం ఏవీయన్ కళాశాలలో డిగ్రీ, ఆంధ్రా యూనివర్సిటీ నుంచి ఎంఏ పట్టాపొందాక, ఆయన వృత్తి జీవితం అనేక మలుపులు తిరిగింది. యానాంలో ఆంగ్ల ఉపాధ్యాయునిగా, రైల్వే మెయిల్ సర్వీసులో (తపాలాశాఖలో) ఉద్యోగిగా పనిచేసి, తాను చదువుకున్న ఏవీఎన్ కళాశాలలోనే అధ్యాపకుడిగా చేరారు. ఆపై ఆంధ్రా యూనివర్సిటీ పొలిటికల్ సైన్స్ విభాగంలో ఓపెన్ కేటగిరిలో చేరి ఆచార్యుని స్థాయి వరకు ఎదిగి 1995 లో పదవీ విరమణ పొందడం ఆయన పట్టుదలకు నిదర్శనం. ఆయన కేవలం కళాశాల 'లెక్చరర్' కాదు, ఆయన 'జనం లెక్చరర్' గానే జీవించారు. ఆంధ్రాలో డా॥ అంబేద్కర్ పర్యటనలో ప్రజలను సమీకరించిన మొదటితరం నాయకులతో నందనార్ హరి, 'అంబేద్కర్ సమరసింహ' రచయిత రావూరి ఏకాంబరం, బీఎస్ వెంకట్రావు, రెడ్డిపల్లి శ్రీనివాసరావు, ఈలి వాడపల్లి భాగ్యరెడ్డి వర్మ, కుసుమ ధర్మన్న వంటి ఆది ఆంధ్ర ఉద్యమ నాయకుల ప్రభావం తనపై బలంగా ఉందని ఆయనే వినమ్రంగా చెప్పేవారు.

మద్రాస్‌లో రైల్వే మెయిల్ సర్వీస్‌లో ఉన్నప్పుడు, సహోద్యోగి యెండ్లూరి చిన్నయ్యతో కలసి ఉద్యోగస్తులను ఏకం చేయడం ద్వారా ఆయన అంబేద్కర్ రాజకీయ పోరాటాల నుంచి ప్రేరణ పొందారు. రెండో తరం నాయకులలో పావనమూర్తి చెప్పుకోదగిన దళిత జనభాంధవుడు. ఒక ప్రొఫెసర్‌గా, వార్డెన్‌గా ఆయన చేసిన సేవలు అనన్య సామాన్యమైనవి. ముఖ్యంగా, నిరుపేద దళిత విద్యార్థుల హాస్టల్ డిపాజిట్‌ను కేవలం 5 రూపాయలకు తగ్గించడం ఒక చరిత్రాత్మక నిర్ణయం. ఆ తగ్గింపు కేవలం ఆర్థిక సాయం కాదు, అది దళిత విద్యార్థులకు 'ఈ యూనివర్సిటీ మీది, చదువుకునే హక్కు మీకుంది' అని ఇచ్చిన తిరుగులేని భరోసా. హాస్టల్ వార్డెన్‌గా ఉంటూ అవినీతిని ప్రక్షాళన చేసిన నీతి నిజాయితీలకు ఆయన మారుపేరు. ఆంధ్రా యూనివర్సిటీ సెనేట్ మెంబర్‌గా, విదేశీ విద్యార్థుల సలహాదారుగా ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు రాయితీలను పూర్తిగా సాధించారు. ఆయన కృషితోనే 1992 లో అంబేద్కర్ జీవిత చరిత్రకారుడు ఎండ్లూరి చిన్నయ్యకు ఆంధ్ర విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసింది. ఆయన జీవితం మొత్తం అంబేద్కరిజం, బౌద్ధ ధర్మం చుట్టూనే తిరిగింది. అంబేద్కర్ ఆశయాల సాధన కోసం "ఆంధ్రప్రదేశ్ అంబేద్కర్ మిషన్"ను స్థాపించి, దానికి వ్యవస్థాపక ఛైర్మన్‌గా నిలిచారు. "భారతీయ బౌద్ధమహాసభ"కు విశాఖ జిల్లా అధ్యక్షులుగా, 'భీమ్‌గళ' కు అధినేతగా ఎనలేని సేవ చేశారు. విశాఖపట్నం అంబేద్కర్ మెమోరియల్ సొసైటీకి జనరల్ సెక్రటరీగా ఆయన అందించిన సేవలు మరువలేనివి. 1977 లో ప్రారంభమైన అంబేద్కర్ భవన్ నిర్మాణానికి ఆయన నడుం బిగించారు. ఆ భవనం ఇటుక, సున్నం కాదు; అది 56 ఆదివారాల పాటు దళిత ఉద్యోగులు, కార్యకర్తలు చిందించిన చెమట, వారి ఆత్మగౌరవ పతాక. పావనమూర్తి ఆ శ్రమదానానికి సారథ్యం వహించి, వారికి భోజన వసతులు స్వయంగా చూసుకున్నారు. ఒక ఉద్యమాన్ని క్షేత్రస్థాయిలో ఎలా నడిపించాలో ఆచరణలో చూపించారు. ఆ భవన నిర్మాణానికి శ్రమించిన 92 మందికి, ఎస్సీ/ఎస్టీ కోపరేటివ్ బిల్డింగ్ సొసైటీ ద్వారా ఇళ్ల స్థలాలు ఇప్పించిన కార్యశీలి ఆయన. "అక్షరమే ఆయుధం" అని నమ్మి, అంబేద్కర్ "రాజగృహ" దీప్తిగా "అంబేద్కర్ లైబ్రరీ"కి రూపశిల్పిగా నిలిచారు. ఆయన కేవలం సంస్థలకే పరిమితం కాలేదు. ఈవీ చిన్నయ్యతో భుజం కలిపి షెడ్యూల్డ్ కులాల సంక్షేమ సంఘాన్ని పునరుద్ధరించారు. బీవీ రమణయ్య స్థాపించిన ఎస్సీ విద్యార్థి ఫెడరేషన్‌కు వెన్నుదన్నుగా నిలిచారు. "కులం పునాదుల మీద ఒక జాతిని, ఒక నీతిని నిర్మించలేం" అన్న బాబాసాహెబ్ సందేశాన్ని పాటిస్తూ విశాఖలోని నిమ్నకులాల మధ్య సఖ్యతకు, దళిత ఉపకులాల మధ్య భేదాలను రూపుమాపడానికి ఆయన సహపంక్తి భోజనాలను ఏర్పాటు చేసి, గొప్ప కృషి చేశారు. విశాఖపట్నం వంటి పెద్ద నగరంలో సైతం, అంటరానితనం కారణంగా ఒక అద్దె ఇల్లు దొరకని అనుభవం ఆయన హృదయాన్ని తీవ్రంగా కలచివేసింది. ఈ సామాజిక దురాచారానికి వ్యతిరేకంగా, ఆధిపత్య భావజాలానికి ప్రతీక అయిన మనుస్మృతిని ఆయన జగదాంబ సెంటర్ వద్ద బహిరంగంగా దహనం చేశారు. ఇది విశాఖలో సమానత్వ పోరాటానికి ఒక బలమైన సందేశాన్ని ఇచ్చింది.

ఆయన మేధావి మాత్రమే కాదు, క్షేత్రస్థాయి యోధుడు. "నీవు కోల్పోయిన హక్కుల సాధనకు నిరంతర పోరాటమే శరణ్యం" అన్న బాబాసాహెబ్ హెచ్చరికను అక్షరాలా ఆచరించారు. తన సామాజిక వర్గం హక్కుల సాధన కోసం నిరంతర పోరాటంలో పాల్గొన్నారు. 1985 లో 'దళిత మహాసభ' ఆవిర్భావం అంబేద్కర్ భవన్‌లోనే జరగగా, కత్తి పద్మారావు నాయకునిగా ఎదగడంలో పావనమూర్తి పాత్ర కీలకం. ఆయన ఆత్మగౌరవం, అంబేద్కర్‌పై నిబద్ధత చాలా గొప్పవి. ఆయన వ్యక్తిత్వం సూటిగా, నిక్కచ్చిగా ఉండేది;

ఎన్నడూ రాజీపడేతత్వం కాదు. వివిధ రాజకీయ పార్టీలు ఆయనను ఎంపీగా, ఎమ్మెల్యేగా పోటీ చేయమని ఆహ్వానించినా, అంబేద్కర్‌వాద పునాదులు లేని ఆ ప్రతిపాదనలను ఆయన సున్నితంగా తిరస్కరించిన ఆత్మగౌరవమూర్తి. ఈ కోవలోనే, హైదరాబాద్‌లోని అంబేద్కర్ కళాశాల ప్రిన్సిపాల్ పదవికి సైతం, సైద్ధాంతిక, పరిపాలనాపరమైన విభేదాల కారణంగా రాజీనామా చేశారు. షెడ్యూల్డ్ కేస్ట్ ఫెడరేషన్ ఛైర్మన్‌గా ఉన్న కాకి మాధవరావు వ్యాపారం కోసం ఎంతైనా రుణం ఇప్పిస్తానన్నా, "నాకు వ్యాపార గుణం లేదు, నా జీవితం అంబేద్కర్ ఆశయాల ప్రచారానికే అంకితం" అని చెప్పిన నిస్వార్థ సేవకులు. 1956 అక్టోబర్‌లో అంబేద్కర్‌ను విశాఖ తీసుకురావాలని ఎండ్లూరి చిన్నయ్యతో కలిసి ఏర్పాట్లు చేసినా, బాబాసాహెబ్ అనారోగ్యం, ఆపై మహాపరినిర్వాణం కారణంగా ఆ కోరిక తీరలేదని ఆయన ఆవేదన చెందేవారు. ఆ లోటును తీర్చుకుంటూ, 2011 లో 'బాబాసాహెబ్ అంబేద్కర్ చితాభస్మ సంస్థాపన మహాసభ'ను నిర్వహించి, కృష్ణాజిల్లా నుంచి విశాఖ వరకు చైతన్య యాత్ర చేసి, అంబేద్కర్ భవన ప్రాంగణంలో చితాభస్మాన్ని ప్రతిష్టించారు. 2010 లో "విశాఖ బుద్ధవిహార్" నిర్మాణానికి సారథ్యం వహించి, తైవాన్ నుంచి బుద్ధ విగ్రహాన్ని తెప్పించారు. ఆయనతో పరిచయం ఉన్న వారికి తెలుసు, ఆయన 'నమస్కారం' అంటే పలకరు. 'జైభీం' అని మాత్రమే అభివాదం చేయాలి. అది కేవలం ఒక పలకరింపు కాదు; అది ఒక సాంస్కృతిక విప్లవం. బానిసత్వపు 'నమస్కారాలను' పక్కనపెట్టి, విముక్తి ప్రదాత అయిన భీముని పేరుతో ఒకరినొకరు గౌరవించుకోవాలనే రాజకీయ చైతన్యం. ఆయన తన ఆదర్శ సంతతి అయిన రాంజీ, భీమ్, ప్రజ్ఞ, శుభారములను ఉన్నత శిఖరాలకు చేర్చడమే కాకుండా, తన కుమార్తె ప్రొఫెసర్ ప్రజ్ఞ, అల్లుడు సత్యపాల్ ద్వారా తన భావజాల వారసత్వాన్ని కొనసాగిస్తున్నారు.

ఆయన జీవితం ఒక తెరిచిన పుస్తకం. సౌజన్యానికి మారుపేరు, సౌశీల్యానికి మరోపేరు. స్వాభిమానానికి భంగం కలిగిస్తే ఉగ్రనరసింహుడైనా, ఆయన అభిమానానికి పాత్రులైతే, వారి పాలిట ఆధునిక కర్ణుడిగా మారిపోయేవారు. 1985 లో చుండూరు, కారంచేడులో దళితులపై జరిగిన మారణహోమం, ఆంధ్రప్రదేశ్ సామాజిక చరిత్రలో ఒక కీలకమైన, విషాదకరమైన ఘట్టం. స్వాతంత్ర్యం వచ్చి దశాబ్దాలు గడిచినా, గ్రామీణ ప్రాంతాలలో దళితులు ఎదుర్కొంటున్న తీవ్ర వివక్ష, అణచివేత, అగ్రకుల ఆధిపత్యం కఠోర వాస్తవాలను ఈ దుర్ఘటన కళ్లకు కట్టింది. ఇది కేవలం ఒక స్థానిక హింసాకాండగా, రాష్ట్ర వ్యాప్తంగా బలమైన నిరసనలకు దారితీసింది. ఈ సంఘటన, ఆంధ్రప్రదేశ్‌లో ఒక స్వతంత్ర, చైతన్యవంతమైన దళిత ఉద్యమం ఆవిర్భవించడానికి ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలిచింది. ఆ సమయంలో, ఈ అమానవీయ ఘటనకు వ్యతిరేకంగా విశాఖపట్నంలో గొప్ప సంస్కరణవాది పావనమూర్తి తన గళాన్ని వినిపించి కత్తి పద్మారావును విశాఖపట్నం సెంట్రల్ జైలులో పెట్టినప్పుడు వారి కుటుంబాన్ని ఆదరించి, వారికి మనోధైర్యాన్ని నింపిన మానవతావాది. అక్టోబర్ 27 వ తేదీ ఉదయం ఆయన భౌతికంగా మనకు దూరం అయినా, ఆయన వెలిగించిన ఉద్యమ చైతన్యం, వాగ్ధాటి, ఆయన నేర్పిన నిబద్ధత మనందరిలోనూ బతికే ఉంటాయి. 93 ఏళ్ల సుదీర్ఘ జీవితంలో ఆయన ప్రతి శ్వాస అంబేద్కరిజం కోసం, ప్రతి అడుగు బహుజన హితం కోసం సాగింది. స్వరాజ్యంలో కూడా బహుజన స్వతంత్రం కోసం నిరంతరం పోరాడిన ఆ అలుపెరుగని యోధులైన చింతకాయల పావనమూర్తికి అశ్రు నివాళి. ఆయన కేవలం ఒక వ్యక్తిగా నిష్క్రమించలేదు. ఆయన తాను నిర్మించిన సంస్థలలో, చైతన్యం నింపిన వేలాది మంది శిష్యులలో, వెలిగించిన ఉద్యమాలలో శాశ్వతంగా జీవించే ఉంటారు. ఆయన ఆశయ సాధన కోసం పునరంకితం కావడమే మనం ఆయనకు ఇవ్వగల నిజమైన నివాళి. పావనమూర్తి సంస్మరణ సభ నేడు (నవంబర్ 9 న) ఉదయం 10 గంటలకు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ భవనంలో జరగనుంది. ఆయన ఆశయాలకు అనుగుణంగా మనమందరం ఆ స్ఫూర్తిని కొనసాగిద్దాం.

సంచాలకులు, భాషా సాంస్కృతిక శాఖ, ఆంధ్రప్రదేశ్,
9491659899

మేం ల్యాప్‌టాప్‌లు ఇస్తే... వాళ్లు రివాల్వర్లు ఇస్తున్నారు

ఆర్‌జేడీపై మోదీ ఆరోపణలు

సీతమర్హి(బీహార్): రెండో దశ ఎన్నికల పోలింగ్‌కు బీహార్ సిద్ధమవుతున్న వేళ ప్రధాని నరేంద్రమోదీ తన ప్రచారాన్ని ముమ్మరం చేశారు. ఆర్జేడీపై విమర్శలు గుప్పించారు. సీతామర్హిలో శనివారం ఎన్నికల సభలో ప్రధాని మోదీ పాల్గొన్నారు. బీహార్ ప్రజలకు తాము ల్యాప్‌టాప్‌లు ఇస్తే... వాళ్లు రివాల్వర్లు ఇస్తున్నారంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. 'బీహార్ విద్యార్థుల కోసం మేం కంప్యూటర్లు, ఫుట్‌బాల్, హాకీ స్టిక్‌లు అందిస్తున్నాం. కానీ ఆర్జేడీ ప్రజలకు తుపాకులు ఇవ్వడం గురించి మాట్లాడుతుంది. బీహార్ ప్రజలు తుపాకుల ప్రభుత్వాన్ని కోరుకోవడం లేదు. వారు ప్రతిపక్ష నాయకులకు నిద్ర లేని రాత్రులను ఇస్తున్నారు. రాష్ట్రంలోని పిల్లల కోసం ఆర్జేడీ ఏం చేయాలనుకుంటుందో వారి ఎన్నికల ప్రచారంలో స్పష్టంగా కనిపిస్తోంది. జంగిల్‌రాజ్‌ల పాటలు, నినాదాలు వినండి. మీరు షాక్ అవుతారు. వారి వేదికలపై అమాయక పిల్లలతో దోపిడీదారులుగా మారాలనుకుంటున్నామని చెప్పాలంటూ బలవంతం చేస్తున్నారు. బీహార్‌లో పిల్లలు డాక్టర్లు అవ్వాలా... దోపిడీదారులు కావాలా? మన పిల్లలను చెడ్డవారిగా మారాలని కోరుకునే వారిని మనం గెలిపిస్తామా' అని మోదీ ప్రశ్నించారు. ఆర్జేడీ, కాంగ్రెస్‌లకు ఇండస్ట్రీలో ఏ,బీ,సీ,డీలు కూడా తెలియవని మోదీ ఎద్దేవా చేశారు. పరిశ్రమలు ఎలా మూసేయాలో మాత్రమే వారికి తెలుసని విమర్శించారు. జంగిల్ రాజా 15 ఏళ్ల పాలనలో బీహార్‌లో ఓ పెద్ద ఆస్పత్రి గాని, వైద్య కళాశాల కానీ ఏర్పాటు చేయలేదన్నారు. సీఎం నితీశ్ కుమార్ నేతృత్వంలోని ఎన్డీయే కూటమి వచ్చాకే... బీహార్ ప్రజలకు కోల్పోయిన నమ్మకం తిరిగి వచ్చిందన్నారు. పెట్టుబడిదారులు రాష్ట్రానికి వచ్చేందుకు ఆసక్తి చూపిస్తున్నారని తెలిపారు. మన సంస్కృతి, సంప్రదాయాలను నిందించిన వారిని ఎన్నికల్లో శిక్షించాలని ప్రజలకు ఆయన పిలుపునిచ్చారు.

రాహుల్ చేపలవేటపై మోదీ వ్యంగ్యం

బీహార్ ఎన్నికల ప్రచారంలో భాగంగా అధికార, విపక్ష పార్టీలు పదునైన వ్యాఖ్యలతో విమర్శలు చేసుకుంటున్నాయి. కాంగ్రెస్ అగ్రనాయకుడు రాహుల్ గాంధీ ఇటీవల చేపలవేట కోసం మత్స్యకారులతో కలిసి చెరువులోకి దిగారు. దానిని ఉద్దేశించి ప్రధాని మోదీ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. బీహార్ చేపలను చూడటానికి పెద్దపెద్దవాళ్లు వస్తున్నారని వ్యాఖ్యానించారు. ఎన్నికల్లో మునిగిపోయేందుకు ఇప్పటి నుంచే ప్రాక్టీస్ చేస్తున్నారంటూ ఎద్దేవా చేశారు. కొన్నిరోజుల క్రితం బెగుసరాయ్ జిల్లాలో మత్స్యకారులతో కలిసి రాహుల్ చేపలు పట్టేందుకు వెళ్లారు. అప్పుడు ఆయన వెంట మాజీ మంత్రి, వికాస్‌శీల్ ఇన్సాన్ పార్టీ వ్యవస్థాపకుడు, విపక్ష కూటమి డిప్యూటీ సీఎం అభ్యర్థి ముకేశ్ సాహ్నీ కూడా ఉన్నారు. చేపలు పట్టేందుకుగాను సాహ్నీ నీళ్లలోకి దిగి వలవేశారు. కాసేపటికి రాహుల్ గాంధీ సైతం నీళ్లలో దూకారు. మత్స్యకారులతో కలిసి చేపలు పట్టారు. వేట నిషేధిత కాలంలో మత్స్యకారుల కుటుంబాలకు రూ.5 వేల చొప్పున ఆర్థిక సాయం, బీమా సదుపాయం, చేపల మార్కెట్‌ల ఏర్పాటు, మత్స్య సంపద కోసం జలవనరుల పునరుద్ధరణ వంటి హామీలు ఇచ్చారు.

నన్నెవరూ ఆపలేరు

మహాగట్బంధన్‌కు తిరుగులేదు

రాష్ట్రాన్ని ప్రగతిపథంలో నడిపిస్తా: తేజస్వి

పట్నా: తనను ఆపే శక్తి ప్రధాని మోదీకిగానీ, ఎన్డీయేకుగానీ లేదని, రాష్ట్రంలో రాబోయేది మహాగట్బంధన్ ప్రభుత్వమేనని ఆర్‌జేడీ నాయకుడు తేజస్వీ యాదవ్ ఉద్ఘాటించారు. ఎన్డీయేకు 20 ఏళ్లు ఇచ్చారు... మాకు ఒక్క అవకాశం ఇవ్వండి. 20 నెలల్లో మార్పు చూపిస్తాం. రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిప్తామని హామీనిచ్చారు. మార్పు కోసమే బీహార్ ప్రజలు ఓటే వేసినట్లు మహాగట్బంధన్ సీఎం అభ్యర్థి అన్నారు. 37 ఏళ్ల యువకుడిని (తనను ఉద్దేశించుకొని) చూసి బీజేపీ బెదిరిపోతోందని దుయ్యబట్టారు. తనను ఎదుర్కొనేందుకు బీజేపీ 30 హెలికాప్టర్లను రంగంలోకి దింపిందని తేజస్వి ఎద్దేవా చేశారు. మహాగట్బంధన్ అధికారంలోకి రాబోతోందని, దీనిని అడ్డుకునే శక్తి ప్రధాని మోదీకిగానీ ఎన్డీయేకిగానీ లేదన్నారు. తనను ఎవరూ ఆపలేరని ఉద్ఘాటించారు. 30 హెలికాప్టర్లతో మోదీ ప్రచారం చేయిస్తున్నారని... ఓ బీహారీ వాళ్లందరి కంటే బలంగా ఉన్నాడని తేజస్వీ యాదవ్ వ్యాఖ్యానించారు. మహాగట్బంధన్ స్టార్ క్యాంపెయినర్‌గా విస్తృత ప్రచారం చేస్తున్న తేజస్వి శుక్రవారం ఒక్కరోజే 18 ర్యాలీల్లో ప్రసంగించారు. ప్రతి కుటుంబానికి ఒక ఉద్యోగం హామీ ఆచరణ సాధ్యమేనని చెప్పారు. బీహార్ బిడ్డకే అధికారం దక్కాలని, బయట వ్యక్తుల చేతుల్లోకి వెళ్లరాదని నొక్కిచెప్పారు. 'ఒక్క అవకాశం ఇవ్వండి. నిరుద్యోగం, వలసలు, నేరాలు, అవినీతి నుంచి రాష్ట్రానికి విముక్తి కల్పిస్తా' అని హామీనిచ్చారు. ఎన్డీయేకు 20 ఏళ్లు ఇచ్చారు... నాకు 20 నెలలు ఇవ్వండి... అన్ని చక్కబెడతా' అని తేజస్వి కోరారు. ఉపాధి కోసం ఇతర రాష్ట్రాల్లో ఉంటున్న తమ బిడ్డలు తిరిగి రావాలని బీహార్ తల్లులు కోరుకుంటున్నారని, వారి ఆశలు నెరవేర్చేందుకు మహాగట్బంధన్ కట్టుబడి ఉందని, ఒక్క అవకాశం ఇవ్వాలని యువతనుద్దేశించి తేజస్వి అన్నారు. అభివృద్ధి చెందిన రాష్ట్రంగా బీహార్‌ను చూడాలని ప్రజలు ఆకాంక్షిస్తున్నారని, అందుకోసమే కుల-మతాలకు అతీతంగా తొలి దశలో ఓటింగ్ జరిగిందన్నారు. ఐటీ, టెక్స్‌టైల్ హబ్‌గా రాష్ట్రాన్ని చూడాలని... ఆహార శుద్ధీకరణ, వ్యవసాయాధారిత పరిశ్రమలు రావాలని బీహారీలు కోరుకుంటున్నారని చెప్పారు. నితీశ్‌కుమార్, నరేంద్ర మోదీ పాలనలో రాష్ట్రానికి అన్యాయం జరిగిందని, ఉపాధి కల్పన నిర్లక్ష్యానికి గురైందని, వలసలు పెరిగిపోయాయని విమర్శించారు. బీహార్ ప్రజల సమస్యలను పరిష్కరించే చిత్తశుద్ధి మోదీ-నితీశ్ సర్కారుకు లేదని, ఎన్నికలను ప్రశాంత్ కిశోర్ ప్రభావితం చేయలేరని తేజస్వీ యాదవ్ అన్నారు. ప్రచారంలో భాగంగా మహిళలు, పంచాయతీ ప్రతినిధులతో తేజస్వి ముచ్చటించారు.

బీహార్‌లో ఎన్డీయే గెలుపు కలే: ఖడ్గే

గయా/పట్నా: బీహార్‌లో ఎన్డీయే తిరిగి అధికారంలోకి రావడమన్నది కలగానే మిగులుతుందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖడ్గే వ్యాఖ్యానించారు. లోక్‌సభ ఎన్నికలప్పుడు 400 పార్ నినాదాన్ని ఎన్డీయే ఇవ్వడాన్ని గుర్తుచేస్తూ.... బీహార్‌లో 160కుపైగా స్థానాల్లో గెలుపు నినాదం కూడా అంతే అని ఎద్దేవా చేశారు. నాడు అంచనాలు తారుమారు కావడాన్ని ప్రస్తావించారు. ఖడ్గే శనివారం గయాలో పీటీఐతో మాట్లాడుతూ రాష్ట్రానికి సుదీర్ఘకాలం ముఖ్యమంత్రిగా ఉన్న జేడీ(యూ) అధ్యక్షుడు నితీశ్ కుమార్‌కు మళ్లీ సీఎం పీఠం కట్టబెడతారన్న సందేహాలతో బీజేపీ కూటమిలో విభేదాలు ఉన్నాయన్నారు. 'ప్రధాని ఏమైనా మాట్లాడతారు. లోక్‌సభ ఎన్నికలకు ముందు 400 పార్ అన్నారు కానీ, మెజారిటీ రాక... అధికారం కోసం జేడీ(యూ), టీడీపీపై ఆధార పడ్డారు' అని ఖడ్గే వ్యాఖ్యానించారు. 243 సభ్యులున్న బీహార్ అసెంబ్లీలో 160కుపైగా స్థానాల్లో గెలుస్తామని అమిత్‌షా ప్రకటించడాన్ని కొట్టిపారేశారు. ఆ ఆశలు తీరనివని అన్నారు. ఆర్‌జేడీ నాయకుడు తేజస్వీ యాదవ్‌ను సీఎం అభ్యర్థిగా ప్రకటించడం కాంగ్రెస్‌కు ఇష్టం లేదని, తలకు తుపాకీ పెట్టి ఒప్పించారన్న ప్రధాని మోదీ వ్యాఖ్యలను ఖడ్గే తీవ్రంగా ఖండించారు. ప్రధాని లేక మరెవరైనా సరే కాంగ్రెస్‌ను భయపెట్టలేరని ఆయన తేల్చిచెప్పారు. ఇప్పటివరకు సీఎం అభ్యర్థిగా నితీశ్ కుమార్‌ను ఎందుకు ప్రకటించలేదని మోదీని ప్రశ్నించారు. నాయకత్వంపై ఒప్పందం జరగకపోతే ఎన్డీయే అధికారంలోకి వస్తుందని చెప్పగలరా అని నిలదీశారు. బీహార్‌లో మహాగట్బంధన్ ప్రభుత్వం ఏర్పాటు కాబోతోందని ఖడ్గే ఉద్ఘాటించారు. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ మాట్లాడుతూ '160కుపైగా స్థానాల్లో గెలుస్తామని మోదీ, షా చెప్పుకుంటున్నారు. వీళ్లకు కచ్చితంగా ఎలా తెలుసు? వీళ్లు జోతిష్యులా? కొంటెపనులు ఏవో చేస్తున్నారు కాబట్టే అలా కచ్చితంగా చెప్పగలుగుతున్నారు. ఓట్ చోరీ వ్యతిరేకోద్యమం ద్వారా మా నాయకుడు రాహుల్ గాంధీ ఈ విషయాన్నే ప్రజలకు తెలియజెప్పేందుకు ప్రయత్నిస్తున్నారు' అని తెలిపారు. మహాగట్బంధన్ మేనిఫెస్టోపై మోదీ తప్పుడు ప్రచారంచేస్తున్నారని ఖడ్గే, వేణుగోపాల్ అన్నారు.

'జంగిల్ రాజ్' గోల

- బీహార్ ఎన్నికల్లో గొంతు చించుకుంటున్న ఎన్డీయే
- బూటకపు ప్రచారాన్ని తిప్పికొడుతున్న ఆర్‌జేడీ
- నితీశ్ చేసిన అభివృద్ధి ఏమిటో చెప్పాలని నిలదీత
- రాజకీయ లబ్ధి కోసమేనంటున్న వామపక్ష శ్రేణులు

పట్నా/జెహానాబాద్: బీహార్ ఎన్నికల ప్రచారం రసవత్తరంగా మారింది. ప్రస్తుత ప్రచార స్థలాలు, సోషల్ మీడియా వేదికలు, టీవీ స్టూడియోలు, ప్రజల జ్ఞాపకాలలో కూడా కీలక రాజకీయ ప్రత్యర్థుల మధ్య భీకర మాటల యుద్ధం జరుగుతోంది. రాష్ట్ర అభివృద్ధి, ఇతరత్రా సమస్యలు ఏవయినా... అవన్నీ ఇప్పుడు ఎన్డీయే నాయకులకు, ఆ కూటమి ప్రచార ప్రముఖులకు, అభ్యర్థులకు పట్టడం లేదు. ఎన్నికల ప్రచారమంతా ఒకే ఒక పదం చుట్టూ తిరుగుతోంది. అదే 'జంగిల్ రాజ్'. బహుశా ఈ వెనుకబడిన రాష్ట్రంలో దీనికంటే గొప్ప రాజకీయ ఆయుధం మరేమీ లేదన్నట్లుగా అధికార పక్షం వ్యవహరిస్తోంది. ఆర్‌జేడీ, దాని మిత్రపక్ష కూటమిపై దాడి చేయడానికి జేడీ(యూ), దాని ప్రధాన మిత్రపక్షం బీజేపీ నాయకులు తరచుగా ఈ పదాన్ని ఉపయోగిస్తున్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ సహా రాష్ట్రంలో, కేంద్రంలో అధికార ఎన్డీయే నాయకులు ప్రచారం సమయంలో అనేక సందర్భాలలో 'జంగిల్ రాజ్' అంటూ గొంతు చించుకుంటున్నారు. 2025 అసెంబ్లీ ఎన్నికల మొదటి దశకు ముందు, ఎన్నికల ర్యాలీల నుంచి బూత్ స్థాయి కార్యకర్తలతో ఆన్‌లైన్ సంభాషణల వరకు... ఇండియా ఐక్య సంఘటన, దాని కీలక భాగస్వామి ఆర్‌జేడీపై పూర్తిస్థాయి దాడికి నాయకత్వం వహిస్తున్న మోదీ... ఓటర్లను, యువతను జంగల్ రాజ్‌కు దూరంగా ఉంచాలని పదేపదే కోరుతున్నారు. 1990లలో లాలూ ప్రసాద్ యాదవ్, తరువాత అతని భార్య రాబ్డీదేవి పాలనలో జరిగిన అక్రమాలు, పేలవమైన పరిపాలనను సూచించడానికి పాలక కూటమి నాయకులు ఈ ఎత్తుగడ అనుసరిస్తున్నారు. మొదటి దశ ఎన్నికలు ముగిసిన ఒక రోజు తర్వాత శుక్రవారం దక్షిణ బీహార్‌లోని కైమూర్ జిల్లా భభువాలో ప్రచారం చేసిన మోదీ... ఇండియా ఐక్య సంఘటన ముఖ్యమంత్రి అభ్యర్థి, లాలూ ప్రసాద్ కుమారుడు, ఆర్‌జేడీ నాయకుడు తేజస్వీ యాదవ్‌పై 'జంగిల్ రాజ్' అంటూ దాడి చేశారు. అత్యంత ఆసక్తి కలిగిస్తున్న ఈ ఎన్నికల ర్యాలీలు లేదా టీవీ ఛానెళ్లలో వాడివేడి రాజకీయ చర్చల సమయంలో, ప్రచార ప్రదేశాల్లో ఓటర్లను 'బీహార్‌లో 'జంగిల్ రాజ్' తిరిగి రావడాన్ని మీరు చూడాలనుకుంటున్నారా' అని ఎన్డీయే నాయకులు ప్రశ్నిస్తున్నారు. అయితే ఆర్‌జేడీ నాయకులు, దాని ఇద్దరు జాతీయ ప్రతినిధులు ఈ విమర్శను సమర్థమంతంగా తిప్పికొట్టారు. గత 20 ఏళ్లలో నితీశ్ ప్రభుత్వ హయాంలో శాంతిభద్రతల పరిస్థితి క్షీణించిందని మండిపడ్డారు. బీజేపీ, జేడీ(యూ) 'జంగిల్ రాజ్' అంటూ ప్రచారం చేస్తూ ఓటర్లను భయపెట్టడానికి ప్రయత్నిస్తున్నాయని, ఆ పార్టీలు ప్రజలకు, ముఖ్యంగా పేదలు, అణగారిన వర్గాలకు ఏదైనా చేసి ఉంటే... వారికి ఈ విధంగా 'ఓట్లు అడిగే' అవసరం ఉండేది కాదని ఆర్‌జేడీ జాతీయ ప్రతినిధి ప్రియాంక భారతి అనేకసార్లు నొక్కి చెప్పారు. గతానికి సంబంధించిన ఆందోళనను దాని ప్రత్యర్థులు ఉపయోగించుకుంటున్నారని రాజకీయ పరిశీలకులు చెబుతున్నారు. అమిత్ షా నవంబరు 4న దర్భంగాలో జరిగిన ఎన్నికల ర్యాలీలో 'ప్రజలకు 'జంగిల్ రాజ్' గురించి గుర్తు చేయడానికి ప్రయత్నించారు. ఇది రాష్ట్ర ఎన్నికలలో మహాగట్బంధన్ బలంగా ముందుకు సాగుతున్న పరిస్థితిని, ఎన్డీయే ఆందోళనను ప్రస్ఫుటిస్తోంది. పట్నాలో చాలా మంది పాతకాలపు వ్యక్తులు 1997లో నగరంలో పౌర నిర్వహణ సరిగా లేకపోవడంపై హైకోర్టు ధిక్కార పిటిషన్‌ను విచారిస్తున్నప్పుడు 'జంగిల్ రాజ్' అనే పదాన్ని ఉపయోగించారని గుర్తు చేసుకున్నారు. అప్పటి నుంచి రాజకీయ నాయకులు ప్రత్యర్థి శిబిరంలో నైతిక, అవగాహన దెబ్బతినడానికి ఈ లేబుల్‌ను ఉపయోగిస్తూ వస్తున్నారు. కథనాలను వండి వారించడంలోనూ, దానిని ప్రచారంలోకి తీసుకువెళ్లడంలో బీజేపీ ప్రసిద్ధి చెందింది. ఇది రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకుంటున్న స్పష్టమైన మార్గమని గయకు చెందిన తారిఖ్ అన్వర్ ఆరోపించారు. వామపక్ష భావాలు కలిగిన వ్యక్తిగా గుర్తింపు పొందిన 33 ఏళ్ల అన్వర్ ప్రస్తుతం నవంబరు 11న ఎన్నికలు జరగనున్న జెహానాబాద్‌లో అభ్యర్థి తరఫున ప్రచారం చేస్తున్నారు. 'అవును, లాలూ పాలనలో నేరాలు జరిగాయి. కానీ కులపరంగా చీలిపోయిన సమాజంలో అణగారిన వర్గాలు జీవించడానికి, గౌరవంగా మాట్లాడటానికి, సాధికారతను నిరాకరించడం అంటే సామాజిక వాస్తవికతను తిరస్కరించడమే. అలాగే 1990లలో మావోయిస్టు గ్రూపులు, రణవీర్ సేన వంటి ప్రైవేట్ అగ్రవర్ణ మిలీషియాల మధ్య బీహార్‌లో జరిగిన కుల వివాదం... రాష్ట్రంలోని అధికార పోరాటంలో భాగం. అది గందరగోళంలో ఉంది' అని ఆయన అన్నారు. పట్నాలో పరాస్ హాస్పిటల్ హత్య ఘటన లేదా ఇటీవలి సంవత్సరాలలో ముజఫర్‌పూర్ బాలికా గృహ కేసు 'జంగిల్ రాజ్'కు సంకేతాలు కాదా' అని ఆయన ప్రశ్నించారు. అయితే మొత్తం మీద ఈ ఎన్నికల్లో ఇండియా ఐక్య సంఘటన బలంగా ప్రజల్లోకి వెళ్లడం... ప్రత్యర్థి ఎన్డీయేకి చెందిన అభ్యర్థులకు ధీటుగా పోటీ ఇవ్వడం నితీశ్ పార్టీలో, బీజేపీలో కలవరం రేపిందని, అందుకే 'జంగిల్ రాజ్' పదాన్ని తరచూ వాడుతున్నారని ప్రజలు, రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు. ఇదిలాఉండగా 243 సభ్యుల అసెంబ్లీలోని 121 స్థానాలకు నవంబరు 6న పోలింగ్ జరిగింది. మిగిలిన 122 నియోజకవర్గాలకు నవంబరు 11న జరుగుతుంది. ఓట్ల లెక్కింపు నవంబరు 13న నిర్వహిస్తారు.

ఓటు రక్షణ కోసమే పోరాటం

ప్రియాంకగాంధీ

కతిహార్: ఓట్లు చోరీకి గురవుతున్న తరుణంలో మహాత్మాగాంధీ పోరాటం చేసినట్లుగానే కాంగ్రెస్, మహాగట్బంధన్ పౌరుల హక్కులు, ఓటు హక్కు కోసం పోరాటం చేస్తున్నాయని కాంగ్రెస్ నేత ప్రియాంకగాంధీ వాద్రా అన్నారు. బీహార్ రెండో దశ ఎన్నికల ముందు బీహార్‌లో ఎన్నికల ప్రచారం జోరుగా సాగుతోంది. ప్రియాంకగాంధీ బీహార్‌లో కతిహార్‌లోని కద్వాలో శనివారం జరిగిన బహిరంగ సభలో మాట్లాడుతూ 'నేడు కాంగ్రెస్, మహాగట్బంధన్ పోరాటం కేవలం రాజకీయ పోరాటం మాత్రమే కాదు. ఓటు హక్కుతో సహా పౌరుల ప్రాథమిక హక్కుల కోసం చేసే పోరాటం' అని అన్నారు. 'కాంగ్రెస్, మహాగట్బంధన్ చేస్తున్న పోరాటం... అప్పట్లో మహాత్మాగాంధీ చేసిన యుద్ధంలాంటిదే. మేము మీ హక్కుల కోసం, సత్యం కోసం ఒక సామ్రాజ్యానికి వ్యతిరేకంగా పోరాడుతున్నాము. అదే నరేంద్రమోదీ సామ్రాజ్యం. మోదీ ప్రజల్ని అణచివేస్తూ దేశాన్ని నడుపుతున్నారు. ఆయన పార్టీ కూడా పుకార్లు వ్యాప్తి చేస్తుంది' అని మోదీ ప్రభుత్వాన్ని ప్రియాంక విమర్శించారు. రాజ్యాంగాన్ని ప్రజాస్వామ్య ప్రక్రియను బలహీనపరిచేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందని విమర్శించారు. మహాత్మాగాంధీ పోరాడిన హక్కుల్లో ఒకటైన ఓటు హక్కు ప్రమాదంలో పడిందని, రాజ్యాంగాన్ని బలహీనపరచడానికి బీజేపీ శాయశక్తులా ప్రయత్నించిందని, వారు ఓటు చోరీ చేయడం మొదలుపెట్టారని ప్రియాంక మండిపడ్డారు. రూ.10 వేలు ఇచ్చి, ఓట్లు కొల్లగొట్టొచ్చని బీజేపీ భావిస్తోందని ప్రియాంకాగాంధీ అన్నారు. ప్రధాని మోదీ ప్రభుత్వ రంగ సంస్థలు అన్నింటిని తన ఇద్దరు కార్పొరేట్ స్నేహితులకే అప్పగిస్తున్నారన్నారు. ఆయన కట్టా (నాటు తుపాకీ) వంటి పదాలు ఉపయోగించి, ప్రజలను రెచ్చగొట్టేందుకు ప్రయత్నిస్తున్నారని దుయ్యబట్టారు.

కశ్మీరులో ఇద్దరు ఉగ్రవాదుల హతం

జమ్మూ: జమ్మూకశ్మీర్‌లోని కుప్వారా జిల్లాలో భద్రతా బలగాలు ఆపరేషన్ పింపుల్ నిర్వహిస్తున్నాయి. ఉగ్రవాదులు నక్కి ఉన్నారనే సమాచారం అందుకున్న బలగాలు గాలింపు చర్యలు చేపట్టాయి. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య ఎన్‌కౌంటర్ చోటుచేసుకుంది. ఈ కాల్పుల్లో ఇద్దరు ఉగ్రవాదులు హతమయ్యారు. ఈ విషయాన్ని శనివారం భారత సైన్యానికి చెందిన చినార్ కోర్ ఎక్స్ వేదికగా వెల్లడించింది. 'ఉగ్రవాదులు చొరబాటుకు యత్నిస్తున్నారన్న నిఘా సమాచారం ఆధారంగా నవంబర్ 7న కుప్వారాలో ఆపరేషన్ పింపుల్ చేపట్టాం. ఈ సమయంలో ఉగ్ర మూకలు విచక్షణారహితంగా కాల్పులకు పాల్పడ్డారు' అని వెల్లడించింది. గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని పేర్కొంది. ఈ వారంలో భద్రతా బలగాలు ఆపరేషన్ ఛత్రు చేపట్టిన సంగతి తెలిసిందే. కాష్వార్ జిల్లాలో ముగ్గురు ఉగ్రవాదులు దాక్కున్నట్లు సమాచారం అందడంతో ఈ ఆపరేషన్ చేపట్టారు.

ప్రజాస్వామ్యాన్ని చంపే యత్నమే ఎస్ఐఆర్: కనిమొళి



చెన్నై: ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) పేరుతో ప్రజాస్వామ్యాన్ని చంపేందుకు యత్నిస్తున్నారని డీఎంకే ఎంపీ కనిమొళి విమర్శించారు. తూత్తుకుడిలో శనివారం ఆమె మీడియాతో మాట్లాడుతూ ఎన్నికల ముందు ఎస్ఐఆర్ అత్యవసరంగా అమలుచేయాల్సిన అవసరం లేదన్నారు. నిజాయతీగా, న్యాయంగా నిర్వహించాలనే ఉద్దేశం ఉంటే... తగినంత సమయం ఇచ్చి ఈ ప్రక్రియ చేపట్టేవారని అన్నారు. ఎస్ఐఆర్ తీరును బీహార్‌లో స్పష్టంగా చూశామని, ఈ ప్రక్రియ మహారాష్ట్ర, హర్యానా రాష్ట్రాల్లో కూడా ఉందన్నారు. ఎస్ఐఆర్ పేరుతో జరుగుతున్న అన్యాయాలను గణాంకాలతో ఇటీవల కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ వివరించారని, అందుకు ముఖ్యమంత్రి స్టాలిన్ పూర్తి మద్దతు తెలిపారని ఆమె గుర్తుచేశారు. ఎస్ఐఆర్‌కు వ్యతిరేకంగా డీఎంకే, మిత్రపక్షాలు ఈ నెల 11న ఆందోళనలు చేపట్టనున్నట్లు కనిమొళి తెలిపారు.

వాయు కాలుష్యంతో శ్వాసకు విఘాతం

న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో వాయు కాలుష్యంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. శ్వాస తీసుకోవడంలో అవస్థలు పడుతున్నారు. ఢిల్లీ-ఎన్సీఆర్‌లో గాలి నాణ్యత అధ్వాన స్థాయిలో నమోదవుతోంది. సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ప్రకారం... శనివారం ఉదయం ఢిల్లీలో ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ (ఏక్యూఐ) 355గా నమోదైంది. ఆనంద్ విహార్‌లో ఏక్యూఐ 332గా, అలీపూర్ వద్ద 316, అశోక్ విహార్‌లో 332, ఇండిగా గేట్ వద్ద ఏక్యూ 322గా, పాలెం ప్రాంతంలో 320, ధౌలా కువాన్‌లో 269, అశోక్ విహార్ ప్రాంతంలో 332, బవానాలో 366, బురారి క్రాసింగ్ వద్ద 345, ఛాందిని చౌక్ ప్రాంతంలో 354, ద్వారకా సెక్టార్-8లో 310, ఐటీఓ ప్రాంతంలో 337, జహంగీర్‌పురిలో 342, ముండ్కా ప్రాంతంలో 335, నరేలా వద్ద 335, ఓఖ్లా ఫేజ్-2లో 307, పట్పర్‌గంజ్ వద్ద 314, పంజాబీ బాగ్ 343, ఆర్‌కే పురంలో 321, రోహిణి ప్రాంతంలో 336, సోనియా విహార్ వద్ద 326గా ఏక్యూఐ వెరీ పూర్ కేటగిరీలో నమోదైంది. కాలుష్య స్థాయిలు తీవ్రస్థాయిలో ఉండటంతో శ్వాస తీసుకోవడం కష్టతరంగా ఉందని స్థానిక నివాసి కరణ్ శర్మ తెలిపారు. ఈ పరిస్థితి పరిష్కరించేందుకు ప్రభుత్వం వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

పనివేళల్లో మార్పులు

ఒకవైపు వాయు కాలుష్యం, మరోవైపు శీతాకాలం ఢిల్లీని వణికిస్తున్నాయి. ముందస్తు చర్యల్లో భాగంగా ప్రభుత్వ కార్యాలయాల పనివేళల్లో మార్పులు తీసుకొచ్చింది ఆ రాష్ట్ర ప్రభుత్వం. ఈ నెల 15వ తేదీ నుంచి ప్రభుత్వ కార్యాలయాలు ఉదయం 10 నుంచి సాయంత్రం 6.30 గంటల వరకు పనిచేస్తాయని, మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయాలు ఉదయం 8.30 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు పనిచేస్తాయని ముఖ్యమంత్రి రేఖా గుప్తా ఆదేశాలు జారీ చేశారు. సవరించిన పనివేళల మార్పులు 2026, ఫిబ్రవరి 15 వరకు అమలులో ఉంటాయని తెలిపారు. ట్రాఫిక్ ఒకేసారి పెరగకుండా ఉండేదుకు, కాలుష్యాన్ని తగ్గించడమే దీని ఉద్దేశ్యమని అన్నారు.

అది ప్రభుత్వ భూమని తెలియదు

అజిత్ పవార్



ముంబై: 'అది ప్రభుత్వానికి చెందిన భూమి అని నా కుమారుడు పార్థ్ పవార్, ఆయన వ్యాపార భాగస్వామికి తెలియదు. ఆ భూ కేటాయింపును రద్దు చేశాం. ఈ భూమి ప్రభుత్వానికి చెందినది. దీన్ని అమ్మడం లేదా కొనడం చేయడానికి వీల్లేదు. అంతేకాదు, ఈ భూమి కొనుగోలుకు సంబంధించి ఎలాంటి లావాదేవీలూ జరగలేదు. రిజిస్ట్రేషన్ ఎలా జరిగిందన్నది విచారణలో తేలుతుంది' అని ఉపముఖ్యమంత్రి అజిత్‌పవార్ అన్నారు. తన కుమారుడు పార్థ్‌పవార్‌పై వచ్చిన భూ కుంభకోణం ఆరోపణలపై అజిత్ పవార్ పైవిధంగా స్పందించారు. దాదాపు రూ. 1,800 కోట్ల విలువైన 40 ఎకరాల మహర్‌వతన్ భూమిని పార్థ్ పవార్‌కు చెందిన కంపెనీ అమీడియా ఎంటర్‌ప్రైజెస్‌కు రూ. 300 కోట్లకు విక్రయించినట్లు ఆరోపణలు వచ్చాయి. అదికూడా కేవలం రూ.500 స్టాంప్ పేపర్‌పై రిజిస్ట్రేషన్ జరిగినట్లు ప్రతిపక్షాలు ఆరోపించారు. ఇది రాష్ట్రంలో సంచలనం సృష్టించింది. ఈ లావాదేవీలో కేవలం లక్ష రూపాయల మూలధనం కలిగిన పార్థ్‌పవార్ కంపెనీ అమేడియా హోల్డింగ్స్ ఎల్ఎల్‌పీకి రూ.21 కోట్ల స్టాంప్ డ్యూటీ నుంచి మినహాయింపు ఇచ్చారు. పూణే తహసీల్దార్ సూర్యకాంత్ యెవ్లే, డిప్యూటీ రిజిస్ట్రార్‌ను ప్రభుత్వం సస్పెండ్ చేసింది. ఆరోపణలపై దర్యాప్తునకు ఆదేశించింది.

జమ్మూ జైళ్లలో అధికారుల సోదాలు

శ్రీనగర్: జమ్మూ కశ్మీర్‌లోని వివిధ జైళ్లలో అధికారులు సోదాలు చేపట్టారు. జైళ్లలో ఉగ్రవాద కార్యకలాపాలు జరుగుతున్నాయన్న నిఘా వర్గాల హెచ్చరికలతో ఈమేరకు తనిఖీలు చేశారు.

శ్రీనగర్‌లోని సెంట్రల్ జైలు, కుప్వారాలోని జిల్లా జైలుతోపాటూ వివిధ జైళ్లలో జమ్మూ పోలీసులు, పారామిలిటరీ దళాలు ఏకకాలంలో సోదాలు నిర్వహించారు. మరోవైపు పాక్ ఆక్రమిత కశ్మీర్ నుంచి పనిచేస్తున్న ఉగ్రవాద గ్రూపులతో సంబంధాలున్నాయన్న ఆరోపణలతో కుల్గాం జిల్లాలోని పలువురి ఇళ్లలో కూడా అధికారులు తనిఖీలు చేపట్టారు. దాదాపు 59 ప్రాంతాల్లో ఈ దాడులు జరిగినట్లు తెలుస్తోంది.

ఇది జైలా... వినోద క్లబ్బా

ఫోన్లు మాట్లాడుతూ టీవీ చూస్తున్న రేపిస్టులు, ఖైదీలు

బెంగళూరు: కర్నాటక రాజధాని బెంగళూరులోని పరప్పన అగ్రహార సెంట్రల్ జైలులో శిక్షలు అనుభవిస్తున్న ఖైదీలు, రేపిస్టులు, నేరస్తులు సకల సౌకర్యాలు అనుభవిస్తున్నారు. దర్జాగా మొబైల్ ఫోన్లలో మాట్లాడుతున్నారు. స్వేచ్ఛగా టీవీలు చూస్తూ సమయం గడిపేస్తున్నారు. 1996-2022 మధ్య 20 మంది మహిళలపై అత్యాచారం చేయడంతోపాటు వారిలో 18 మందిని హత్య చేసిన కేసులో దోషిగా తేలిన ఉమేష్ రెడ్డికి తొలుత కోర్టు మరణశిక్ష విధించింది. అయితే దానిని 30 ఏళ్ల కఠిన కారాగార శిక్షగా సుప్రీంకోర్టు మార్పు చేసింది. సెంట్రల్ జైలులో శిక్ష అనుభవిస్తున్న ఉమేష్ రెడ్డి మొబైల్ ఫోన్‌లో మాట్లాడుతూ కనిపించాడు. జైలు లోపల రెండు ఆండ్రాయిడ్ ఫోన్లు, ఒక కీప్యాడ్ మొబైల్‌ను అతడు వినియోగిస్తున్నాడు. ఉమేష్ రెడ్డిని ఉంచిన సెల్‌లో టీవీ కూడా ఉంది. రన్యా రావు బంగారు స్మగ్లింగ్ కేసులో అరెస్టయిన తరుణ్ రాజు కూడా జైలులో మొబైల్ ఫోన్ వినియోగిస్తున్నాడు. అతడిని ఉంచిన సెల్‌లో వంట కూడా చేసుకుంటున్నాడు.

ఇతర ఖైదీల వద్ద కూడా మొబైల్ ఫోన్లు ఉన్నాయి. సెంట్రల్ జైలులోని ఖైదీలు దర్జాగా ఎంజాయ్ చేసే వీడియో క్లిప్స్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. దీంతో ఆ జైలులో భద్రతా లోపాలు బయటపడ్డాయి. దీనిపై విమర్శలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో సీఎం సిద్ధరామయ్య స్పందించారు. దర్యాప్తు చేసి అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

ఓటర్ల జాబితాలో అక్రమాలపై

యువజన కాంగ్రెస్ ప్రచారం

ముంబై: ఓటర్ల జాబితాలో జరిగిన అవకతవకలను ఎత్తిచూపడానికి యువజన కాంగ్రెస్ ముంబై విభాగం ప్రజా అవగాహన ప్రచారాన్ని ప్రారంభించింది. పార్టీ కార్యకర్తలు తమ సందేశాన్ని నేరుగా నగరంలోని ప్రయాణికులకు చేరవేశారు. యువజన కాంగ్రెస్ ముంబై నగర అధ్యక్షురాలు జీనత్ షబ్రిన్ నేతృత్వంలో సభ్యులు ఘాట్కోపర్ నుంచి సకినాకాకు మెట్రోలో ప్రయాణించి, తరువాత అంధేరి నుంచి గోరేగావ్‌కు సబర్బన్ రైలులో ప్రయాణించి, ప్రయాణికులతో మాట్లాడుతూ ఓటర్ల జాబితాలో అవకతవకలను వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. 'ప్రజాస్వామ్యాన్ని రక్షించడానికి', ఎన్నికల ప్రక్రియలో పారదర్శకతను నిర్ధారించడానికి ఈ ఉద్యమంలో చురుకుగా పాల్గొనాలని కోరారు. ఎన్నికల ప్రక్రియలో జరిగిన అవకతవకల గురించి పౌరులకు తెలియజేయడం, ప్రజాస్వామ్యాన్ని కాపాడటానికి ఉద్యమంలో చురుకుగా పాల్గొనాల్సిందిగా వారిని ప్రోత్సహించడం ఈ ప్రచారం లక్ష్యమని యువజన కాంగ్రెస్ తెలిపింది.

విశాలాంధ్ర హైదరాబాద్

ఘనంగా సీఎం రేవంత్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలు

విశాలాంధ్ర,షాద్‌నగర్, రూరల్ : తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకలను రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు, అభిమానులు ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కేక్‌కట్ చేసి, సీఎం రేవంత్‌రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ నేతృత్వంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు పాలు, బ్రెడ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం అభివృద్ధిలో సరికొత్త శకాన్ని చూస్తోందని కొనియాడారు. ముఖ్యమంత్రి నిబద్ధత, సాహసోపేతమైన నిర్ణయాలు రాష్ట్రప్రగతికి చోదకశక్తిగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. రాష్ట్రంలో ముఖ్యంగా విద్య, వైద్యం, రోడ్డు కనెక్టివిటీ వంటి మౌలిక సదుపాయాల రంగాలలో ముఖ్యమంత్రి తీసుకున్న చారిత్రక చర్యల వల్ల ప్రజల జీవితాల్లో గణనీయమైన మార్పులు వచ్చాయన్నారు. షాద్‌నగర్ నియోజకవర్గంలో అభివృద్ధిపై సీఎం ప్రత్యేకదృష్టి సారించారని, త్వరలో మరిన్ని అభివృద్ధి పనులు ప్రారంభం కానున్నాయని తెలిపారు. ప్రజా సంక్షేమమే పేద, మధ్యతరగతి ప్రజల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, అన్ని వర్గాల ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన సాగుతోందని వీర్లపల్లి శంకర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమం లో స్థానిక నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తదితరులు పాల్గొన్నారు.

సీఎంకు వినుత్నంగా జన్మదిన శుభాకాంక్షలు

విశాలాంధ్ర - హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్ర ప్రజలకు సంక్షేమాన్ని అందిస్తూ.... రాష్ట్ర ప్రజల జీవితాల్లో వెలుగులు నింపుతూ.... ప్రజా శ్రేయస్సు కోసం నిరంతరం కృషి చేస్తున్న తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి జన్మదిన సందర్భంగా ప్రజాపాలనలో తెలంగాణ రైతులు పండించిన గోధుమలతో రేవంత్‌రెడ్డి చిత్రపటాన్ని రూపొందించి తెలంగాణ రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షులు జక్కిడి శివ చరణ్ రెడ్డి తెలిపారు. అనంతరం అస్సాం రాష్ట్రంలోని అత్యంత ఎత్తైన పర్వత శిఖరం -మౌంట్ టూమ్వాంగ్,, పర్వత శిఖరంపై పర్వతరోహకుడితో ఎనుముల రేవంత్‌రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ముఖ్యమంత్రిపై తమకున్న అభిమానాన్ని చాటుకున్నారు. జక్కిడి శివచరణ్‌రెడ్డి మాట్లాడుతూ 10 సంవత్సరాల బీఆర్ఎస్ దొరలపాలనలో అట్టడుగు బలహీనవర్గాల ప్రజలను అన్యాయానికి అక్రమాలకు గురిచేస్తూ తెలంగాణ రాష్ట్రాన్ని చీకట్లోకి నెట్టివేశారని అన్నారు. రేవంత్‌రెడ్డి సారధ్యంలో ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక చీకటైనా తెలంగాణకు వెలుగుల రంగ్గులు అద్దుతూ.. రాష్ట్రంపై ప్రత్యేక శ్రద్ధ చూపిస్తూ అభివృద్ధిలో తెలంగాణ రాష్ట్రాన్ని ఎవరెస్టు శిఖరాలకు ఎక్కిస్తున్న ఘనత రేవంత్ రెడ్డిదని తెలిపారు.

ఐఐటి కాన్పూర్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ సెల్ కాంపిటీషన్

విశాలాంధ్ర - హైదరాబాద్ : ఐఐటి కాన్పూర్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ సెల్, బెంగళూరుతో పాటు ఈరోజు హైదరాబాద్‌లో తన ఫ్లాగ్‌షిప్ స్టార్టప్ పిచింగ్ పోటీ అప్‌స్టార్ట్ 2025ను నిర్వహించింది. ఈ కార్యక్రమాన్ని టెక్ హైటెక్ సిటీలో నిర్వహించారు. 13కి పైగా స్టార్టప్‌లు, ఏంజెల్ ఇన్వెస్టర్లు మరియు వెంచర్ క్యాపిటల్ సంస్థలు సహా ప్రముఖ ప్రముఖులు హాజరయ్యారు. పెద్ద అప్‌స్టార్ట్ నేషనల్స్‌లో భాగమైన హైదరాబాద్ ఈవెంట్, ఈ సంవత్సరం ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ సెల్, ఐఐటికాన్పూర్ నిర్వహించిన రెండవ ఈవెంట్, నగరంలోని స్టార్టప్‌లకు మద్దతు ఇవ్వడం, వేగవంతం చేయడం, సాధికారత కల్పించడం లక్ష్యంగా పెట్టుకుంది. ఇండియన్ బిజినెస్ మోడల్ పోటీగా వర్గీకరించబడిన హైదరాబాద్‌లోని అప్‌స్టార్ట్ 2025 నగర ఆధారిత వ్యవస్థాపకులకు ఏంజెల్ ఇన్వెస్టర్లు మరియు వెంచర్ క్యాపిటల్ సంస్థ ప్రతినిధులకు 10 నిమిషాల పిచింగ్‌సెషన్‌తో అవకాశం కల్పించింది. నగరం నుంచి ఎంపిక చేయబడిన స్టార్టప్‌లు అనేక రౌండ్ల స్క్రీనింగ్ ద్వారా, తరువాత ముఖాముఖి మార్గదర్శక సెషన్‌ల ద్వారా వెళతాయి. ఇంకా, ఫైనలిస్టులు జనవరి 25, 2026న ఐఐటి కాన్పూర్ క్యాంపస్‌లో నిర్వహించబడే అప్‌స్టార్ట్ ఫైనల్స్‌లో కూడా పాల్గొంటారు. ఫైనలిస్టులను ప్రకటించే ముందు హైదరాబాద్ ఈవెంట్ తర్వాత బెంగళూరు (నవంబర్ 8) ముంబై (డిసెంబర్ 6)లో చాప్టర్‌లు జరుగుతాయి. ముంబై చాప్టర్ కోసం రిజిస్ట్రేషన్లు ఇప్పటికీ తెరిచి ఉన్నాయి! మా అధికారిక ఇన్‌స్టాగ్రామ్ ఖాతాను అనుసరించడం ద్వారా మరిన్ని అప్‌డేట్‌ల కోసం వేచి ఉండాలని సూచించారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

విశాలాంధ్ర- శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలోని పలువురు వైద్య చికిత్స నిమిత్తం ముఖ్య మంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకొనగా 30 మంది లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ ద్వారా మంజూరైన రూ.11,73,000 పదకొండు లక్షల డెబ్బై మూడు వేల రూపాయల ఆర్థిక సహాయానికి సంబంధించిన చెక్కులను కార్పొరేటర్లు నార్నె శ్రీనివాసరావు, ఉప్పలపాటి శ్రీకాంత్‌తో కలిసి బాధిత కుటుంబాలకు పీఏసీ చైర్మన్ ఆరెకపూడిగాంధీ అందజేశారు. అనంతరం మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయనిధి పేద ప్రజలకు గొప్ప వరం అని, ప్రజాక్షేమమే ప్రభుత్వ లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తుందని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేదల పక్షపాతి అని పునరుద్ఘాటించారు. అదేవిధంగా ముఖ్యమంత్రి సహాయనిధి నిరంతరం సేవలను అందిస్తూ ఆపదలో ఉన్న వారికి ఆపన్న హస్తంలా ఆదుకుంటున్నదని, అనారోగ్యంకు గురై ఆర్థిక స్థోమత లేక ఆసుపత్రిలో చికిత్స పొందిన నిరుపేదలకు , అభాగ్యులకు అండగా..సీఎం సహాయ నిధి ఆర్థిక భరోసా నిస్తుందని తెలిపారు. పేద మధ్యతరగతి ప్రజలకు ఆసుపత్రిలో బిల్లులు కట్టలేని పరిస్థితిలో ఉన్న వారికి రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తూ ఆర్థిక సాయంని అందిస్తుందని దీనిలో భాగంగానే నియోజకవర్గ వ్యాప్తంగా ఇప్పటివరకు ఎన్నో వందలాది కుటుంబాలను సీఎంఆర్‌ఎఫ్ ద్వారా ఆదుకున్నామని తెలిపారు. గతంలో ఉన్న బిల్లులకు అనుగుణంగానే ప్రస్తుతం ఆర్థిక సాయం అందిస్తుందని దానిని మరింత పెంచేలా కృషి చేసేందుకు ముఖ్యమంత్రివర్యులు శ్రీ రేవంత్‌రెడ్డికి త్వరలోనే కలిసి వినతి పత్రాన్ని అందజేస్తానని ,మరింత ఆర్థిక సహాయం పెంచితే పేద ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ప్రసాద్, సైదేశ్వర్, కాపూరి అనిల్, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీకాంత్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

సామాజిక స్పృహ, చైతన్యం కలిగించే

కళారూపాలను రూపొందించాలి : కూనంనేని

విశాలాంధ్ర, హైదరాబాద్ : సీపీఐ వందేళ్ల చరిత్రను చాటిచెప్పడంతో పాటు ప్రజాసమస్యలపై సామాజిక స్పృహ, చైతన్యం కలిగించే కళారూపాలను రూపొందించాలని పలువురు సీపీఐ నేతలు అన్నారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా కళారూపాలు ఉండాలని, సీపీఐ వందేళ్ల చరిత్రను కళాకారుల ఆటలు, పాటలలో ప్రతిబింబించాలన్నారు. అరసం, తెలంగాణ ప్రజానాట్యమండలి సంయుక్త ఆధ్వర్యంలో రెండు రోజుల రాష్ట్ర స్థాయి కవులు, కళాకారుల వర్క్ షాప్ శనివారం హైదరాబాద్ మఖ్దూంభవన్ రాజ్ బహదూర్‌గౌర్ విజ్ఞాన కేంద్రంలో ప్రారంభమైంది. వర్క్ షాప్ ప్రారంభోత్సవంలో ముఖ్య అతిధులుగా ప్రముఖ సినీ గేయ రచయిత సుద్దాల అశోక్ తేజ, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్‌ఏ కూనంనేని సాంబశివరావు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చాడ వెంకట రెడ్డి పాల్గొన్నారు. కూనంనేని సాంబశివరావు ప్రారంభిస్తూ అసాధారణమైన సిపిఐ వందేళ్ల చరిత్రలోని ఆటుపోట్లు, ఒడుదుడుకులను, విజయాలను ప్రజలకు తెలియజేయాలన్నారు.

మరోవైపు ప్రజల సమస్యలు, బాధలు, ఆవేదనలను కళాకారులు రచయితలు కళారూపాలుగా మలచడం ద్వారా వాటి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. సినీ తదితర రంగాలలో ప్రముఖులు ప్రజానాట్యమండలి, అరసంలో అక్షరాలు దిదినవారేనని గుర్తు చేశారు. సుద్దాల అశోక్ తేజ మాట్లాడుతూ ప్రజా చైతన్యానికి కళలే ఊపిరి అని, కళారూపాలలో అనునిత్యం నూతనత్వం ఉండాలని సూచించారు. చాడ వెంకట రెడ్డి మాట్లాడుతూ దేశంలో, సమాజంలో మారుతున్న రాజకీయ, ఆర్థిక, సామాజిక పరిస్థితులును ఆకలింపు చేసుకుని కళారూపాలను రూపొందించాలన్నారు. డ్రగ్స్, గంజాయ్, మద్యం అంశాలతో పాటు సామాజిక రుగ్మతల నిర్మూళనకు కళాకారులు, రచయితలు తమ వంతు కృషి చేయాలన్నారు. ఒగ్గు కథలు, గేయాలు, నాటికలకు ఇంకా ప్రజలలో ఆదరణ ఉందని, వాటి ద్వారా ప్రచార కార్యక్రమాలను చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో అరసం అధ్యక్షులు పల్లేరు వీరాస్వామి, ప్రధాన కార్యదర్శి రాపోలు సుదర్శన్, ప్రజానాట్యమండలి అధ్యక్షులు కె.శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి పల్లె నరసింహా తదిలరుతు ప్రసంగించారు.

అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలి : వెంకట్రాములు

విశాలాంధ్ర, హైదరాబాద్ : ' తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో చేసిన బీసీ రిజర్వేషన్ల చట్టాన్ని 9వ షెడ్యూల్లో చేరుస్తూ బిల్లు ఆమోదించే విధంగా రేవంత్ రెడ్డి అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలనీ, బీసీ రిజర్వేషన్ల బిల్లును ఆమోదింపచేసే బాధ్యత రాష్ట్ర బీజేపీ పార్టీయే తీసుకోవాలని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు టి.వెంకటరాములు అన్నారు. హిమాయత్ నగర్‌లో రాజబహదూర్ గౌర్ హాల్‌లో జరిగిన రాష్ట్ర ఆఫీసు బేరర్ల సమావేశంలో వెంకటరాములు మాట్లాడుతూ అసెంబ్లీలో చేసిన బీసీ చట్టానికి బీజేపీ పార్టీ ఎమ్మెల్యేలు మద్దతు ఇచ్చినందున మోదీ ప్రభుత్వంతో మాట్లాడి ఆ చట్టాన్ని 9వ షెడ్యూల్లో చేర్పించడానికి చొరవ చూపి రాష్ట్రంలో బీసీల ఎడల తమ చిత్తశుద్ధిని రుజువు చేసుకోవాల న్నారు. రాబోయే రోజుల్లో దేశవ్యాప్తంగా జనగణనతో పాటు కులగణన చేపట్టి సకల రంగాలలో బీసీల వాటా బీసీలకు ఇవ్వడానికి పార్లమెంటులో రాజ్యాంగ సవరణ చేసే విధంగా బీసీ హక్కుల సాధన సమితి ఉద్యమిస్తుందన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధూళిపాళ ధనుంజయ నాయుడు మాట్లాడుతూ అసెంబ్లీలో చట్టం చేసిన

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పిన విధంగా అన్ని రాజకీయ పార్టీలను బీసీ సంఘాలను కలుపుకొని అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి అందరిని దిల్లీ తీసుకొని ప్రధానమంత్రి దగ్గరికి వెళ్లాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు విద్యా ఉద్యోగ రంగాలలో 42 శాతం రిజర్వేషన్లను తొమ్మిదవ షెడ్యూల్లో చేర్చడం ఒక్కటే మార్గం అన్నారు. 9వ షెడ్యూల్లో చేర్చకుండా కోర్టుల చుట్టూ తిరుగుతూ కాలయాపన చేయడం రాష్ట్ర ముఖ్యమంత్రి కి కాంగ్రెస్ పార్టీకి తగదన్నారు. ఇది ఒక రకంగా రాష్ట్ర బీసీలను మభ్యపెట్టడమే అవుతుందన్నారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి చట్టాన్ని చేసిన సందర్భంలో అసెంబ్లీలో చేసిన ప్రకటనకు కట్టుబడి బి సి రిజర్వేషన్లను సాధించని ఎడల బీసీల ఆగ్రహాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో పాటు కాంగ్రెస్ పార్టీ , మోదీ బీజేపీ చవి చూడవలసి వస్తుందని హెచ్చరించారు. అవకాశవాద రాజకీయాలు కాకుండా బీఆర్ఎస్ పార్టీ తన బీసీల ఎడల తమ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి రాయబండి పాండు రంగాచారి రాష్ట్ర సహాయ కార్యదర్శి చింతకింది కుమారస్వామి, రాష్ట్ర ఆఫీసు బేరర్లు, ఎల్ శ్రావణ్, వనం సత్యనారాయణ, పలనాటి యాదయ్య బొడ్డు పెల్లి కృష్ణ, దీటి నరసయ్య పాసికంటి లక్ష్మీ నరసయ్య బొట్ల శ్రీనివాస్, రావెళ్ల అంజయ్య చంద్రశేఖర్ రాయపోల్ రమేష్ బాపురాజు పాల్గొన్నారు.

బ్యాంకుల ప్రైవేటీకరణ దేశ ద్రోహ చర్య : వీఎస్ బోస్

విశాలాంధ్ర, హైదరాబాద్ : ' దేశానికి స్వాతంత్ర్యం 1947లో వచ్చింది. బ్యాంకుల జాతీయాకరణ 1969లో జరిగింది. ఈ మధ్య కాలంలో బ్యాంకులలో ప్రజలు దాచుకున్న డబ్బులకు లెక్కాపత్రం లేకుండా అక్రమంగా మింగేసిన దుర్మార్గుల నుంచి ప్రజా ధనాన్ని రక్షించాలనే మహత్తరమైన ఉద్దేశంతో భారత కమ్యూనిస్టు పార్టీ బ్యాంకులను జాతీయం చేయాలనీ నినాదంతో ఉద్యమం చేపట్టిందని సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.యస్.బోస్ గుర్తు చేశారు. దేశంలోని కార్మిక సంఘాలను, బ్యాంకు ఉద్యోగులను, అభ్యుదయ వాదులను కలుపుకొని అనేక పోరాటాలు చేసిన ఫలితమే 1969లో నాటి ప్రధాన మంత్రి ఇందిరాగాంధీ బ్యాంకులను జాతీయం చేసిందని ఆయన అన్నారు. ఆనాటి జాతీయాకరణ విధానం జీర్ణించుకోలేని కొంతమంది దుర్మార్గులు నాటి నుండి 'గోతికాడ నక్కలాగ' కాచుకొని నేడు జాతీయ బ్యాంకులను ప్రైవేటీకరణ చేస్తామని చెప్పటం తీవ్రమైన దేశ ద్రోహ చర్యని ఆయన అన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థ మన దేశంలో నేడు పటిష్టంగా ఉందన్నా, 2008లో ప్రపంచంలో ఆర్థిక మాన్యం ఏర్పడినప్పుడు మన దేశంలో ఏలాంటి సంక్షోభం లేకుండా నిలబడిరదన్నా దానికి కారణం మన జాతీయ బ్యాంకులు అనేది తిరుగులేని వాస్తవమన్నారు. నేడు పాలకవర్గంలో ఉన్న కార్పొరేట్ అనుకూల శక్తులు, అమెరికా అడుగులకు మడుగులొత్తేవారు జాతీయ బ్యాంకులను ప్రైవేటీకరణ చేస్తామంటే దేశ ప్రజలు చూస్తూ ఊరుకోరని కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ప్రజలు బ్యాంకులలో దాచుకున్న వేల కోట్ల రూపాయలు ఎగ్గొట్టి విదేశాలకు పారిపోయిన ప్రజా ద్రోహులను ఏమీ చేయటం చేతగానీ ప్రభుత్వం, అలాంటి వారి మేలు కోసమే బ్యాంకులను ప్రైవేటుపరం చేయడానికి చూస్తుందన్నారు. జాతీయ బ్యాంకులంటే ప్రజా బ్యాంకులు కాబట్టి ప్రజలు ఇలాంటి ప్రజా వ్యతిరేక చర్యలను ఏకకంఠంతో ఖండించాలని ఆయన పిలుపునిచ్చారు. దేశ స్వాతంత్ర్యంలో ఏలాంటి పాత్రలేనివారు, బ్రిటీష్ పాలనలో ఉన్న బ్యాంకింగ్ వ్యవస్థను మరల మన దేశంలో తీసుకురావటానికి ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. ప్రజా బ్యాంకులను ప్రైవేటువారికి అప్పచెపుతూ ప్రజలను మోసం చేస్తూ ప్రజా ద్రోహానికి పాలకులు పాల్పడుతున్నారు. బ్యాంకులలో ప్రైవేటు బ్యాంకు కానీ, ప్రజా బ్యాంక్ కానీ ఉండే డబ్బు ప్రజలదనేది అందరు అర్థం చేసుకోవాలన్నారు. 'ప్రజాధనం - ప్రజల కోసమే - కార్పొరేట్ దొంగల కోసం కాదు' అనే నినాదాన్ని వస్తావ రూపంలోకి తీసుకువస్తాం. భారత కమ్యూనిస్టు పార్టీ జాతీయాకరణ కాలంలో నాటి పోరాటాలను తిరిగి నిర్మిస్తుందని, నాటి త్యాగధనుల స్ఫూర్తితో బ్యాంకుల ప్రైవేటీకరణను అడ్డుకోవటానికి అవసరమైన త్యాగాలతో కూడిన పోరాటాలు నిర్వహిస్తుందని హెచ్చరించారు. ప్రజా ధనాన్ని ద్రోహుల నుండి కాపాడతానికి చేసిన పోరాటమే నిజమైన దేశభక్తి అని సూచించారు. అసల్కెన దేశభక్తి అంటే ఏమిటో చూపిస్తామని అన్నారు. బ్యాంకుల ప్రైవేటీకరణ ఆపండి లేకపోతే ప్రజల తిరుగుబాటును ఎదుర్కొవటానికి కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా ఉండాలని హెచ్చరించారు.

ఉచిత బీమా దేశానికి ఆదర్శం : బలరామ్

విశాలాంధ్ర, హైదరాబాద్ : రాష్ట్ర ప్రభుత్వ సూచన మేరకు సింగరేణిలో ఉద్యోగులు, ఒప్పంద కార్మికుల కోసం ప్రభుత్వ, ప్రైవేట్ రంగ బ్యాంకుల సహకారంతో దేశంలోనే తొలిసారిగా ప్రారంభించిన ఉచిత ప్రమాద బీమా పథకం దేశానికే ఆదర్శంగా నిలిచిందని సింగరేణి సీఎండీ శ్రీ ఎన్. బలరామ్ తెలిపారు. కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాలు ఇప్పుడు ఈ పథకాన్ని తమ సంస్థల్లో అమలు చేయడానికి చర్యలు తీసుకుంటున్నాయని చెప్పారు. ఈ పథకాన్ని మొట్టమొదటగా సింగరేణిలో ప్రారంభించడంలో సహకారం అందించిన బ్యాంకుల యాజమాన్యానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా శనివారం సింగరేణి భవన్లో ఎస్బీఐ, యూనియన్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోడా, పంజాబ్ నేషనల్ బ్యాంక్, కెనరా బ్యాంక్, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్, హెచ్డీఎఫ్సీ బ్యాంక్ ఉన్నతాధికారులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... "ఉచిత ప్రమాద బీమా పథకం ద్వారా సింగరేణి ఉద్యోగులకు గరిష్టంగా రూ.1.25 కోట్ల వరకు, పొరుగు సేవల సిబ్బందికి రూ.40 లక్షల వరకు బీమా అందించడం సంతోషకరం. ఇప్పటి వరకు వివిధ ప్రమాదాల్లో మరణించిన 34 మందికి దాదాపు రూ.30 కోట్ల బీమా సొమ్మును బ్యాంకుల ద్వారా అందించాం. ఇది వారి కుటుంబాలకు ఆర్థిక భద్రతను కల్పించిందన్నారు. అయితే ఒప్పంద కార్మికులకు కనీసం రూ.50 లక్షల ప్రమాద బీమా అందించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు.

సింగరేణి ఉద్యోగులు ఒక వేళ సహజ మరణంతో చనిపోతే కనీసం రూ.20 లక్షల టర్మ్ ఇన్సురెన్స్ ఇచ్చే విషయంలోనూ సానుకూల నిర్ణయం తీసుకోవాలన్నారు. సింగరేణిలో అమలు చేస్తున్న ఈ బీమా పథకాన్ని ఇతర రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకుంటున్నాయని, ఇప్పటికే కోలిండియాలోనూ అమలైందని గుర్తుచేశారు. సింగరేణి సంస్థ ఒక మంచి సంక్షేమ కార్యక్రమాన్ని అమలు జరపటంలో సహకారం అందిస్తున్న బ్యాంకర్లకు ధన్యవాదాలు తెలుపుతున్నానని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో సింగరేణి సంస్థ వ్యాపార విస్తరణ చర్యల్లో భాగంగా థర్మల్ పవర్ ప్లాంట్లను, సోలార్ ప్లాంట్లను, పంప్డ్ స్టోరేజీ ప్లాంట్ తదితర ప్రాజెక్టులను చేపడుతున్న నేపథ్యంలో రుణ సదుపాయం కోరనున్నట్లు, దీనివల్ల ఇరు సంస్థలకు వాణిజ్యపరమైన లబ్ధి చేకూరుతున్నందున, ఉద్యోగుల కోసం అందించిన ప్రమాద బీమా సదుపాయాన్ని మరింత పెంచే ప్రతిపాదనలపై సానుకూల నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. దీనిపై బ్యాంకర్లు సానుకూలంగా స్పందించారు. సింగరేణితో దీర్ఘకాల వాణిజ్య బంధాన్ని కొనసాగించేందుకు మెరుగైన ప్యాకేజీని అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సింగరేణి డైరెక్టర్ పర్సనల్ గౌతమ్ పొట్రు, జీఎం(కో ఆర్డినేషన్) టి.శ్రీనివాస్, ఏజీఎం(ఫైనాన్స్) చక్రవర్తి, పీఎస్సీ, ఎస్బీఐ, యూనియన్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోడా, కెనరా బ్యాంక్, ఇండియన్ ఓవర్ సీస్ బ్యాంక్, హెచ్ డీ ఎఫ్ సీ బ్యాంకులకు చెందిన ఉన్నతాధికారులు సురేశ్ కుమార్, సుమంత్‌రెడ్డి, సుజీత్ ఝా, రేఖారావు, రమేశ్, విక్రమ్ సింగ్, రాజేశ్ సిన్హా, ఎడ్రిక్ అజయ్సొజా, శంకర్ కుమార్, రాజీవ్ కుమార్, వాణి, మాధురి, సైదులు, మణికండన్, మల్లి కార్జున్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్ రెడ్డికి మంత్రి పొంగులేటి జన్మదిన శుభాకాంక్షలు

విశాలాంధ్ర - హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు ఎనుముల రేవంత్ రెడ్డి జన్మదిన సందర్భంగా రాష్ట్ర రెవెన్యూ ,హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కలిసి హార్దిక జన్మదిన శు భాకాంక్షలు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో తెలంగాణ రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి చెందాలని, రైజింగ్ తెలంగాణ 2047 లక్ష్యాన్ని వారి నేతృత్వంలో మనమందరం సాధించాలని మంత్రి కోరారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లక్ష్య సాధనలో ఆ దేవుడి ఆశీస్సులు మెండుగా ఉండాలని, వారు ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో ప్రజా జీవితంలో మరెన్నో విజయాలు సాధించాలని మంత్రి ఆకాంక్షించారు.

శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ప్రయాణికుల ఆందోళన

విశాలాంధ్ర - హైదరాబాద్ : శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. శుక్రవారం రాత్రి 11 గంటలకు శంషాబాద్ నుంచి వియత్నాం వెళ్లాల్సిన విమానం ఇప్పటికీ వెళ్లకపోవడంతో రాత్రి నుంచి ప్రయాణికుల నిరసన తెలుపుతున్నారు. విమాన రాకపోకలపై ఎయిర్‌పోర్ట్ అధికారులు సరైన సమాధానం ఇవ్వకపోవడంతో ప్రయాణికులు వాగ్వాదానికి దిగారు. విమానం ఎప్పుడు టేకాఫ్ అవుతుందో కూడా సిబ్బంది చెప్పకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయలేదని ఎయిర్‌లైన్ సిబ్బందిపై మండిపడుతున్నారు. మరోవైపు వీకెండ్ కావడంతో.. విమానాశ్రయం ప్రయాణికులతో కిటకిటలాడుతోంది. ఈ నేపథ్యంలో విమానంలో 200 మంది ప్రయాణికులు రాత్రంతా ఎదురు చూశారు.

జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో 144 సెక్షన్

విశాలాంధ్ర - హైదరాబాద్ : జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల సందర్భంగా నియోజకవర్గ పరిధిలో ఆంక్షలు విధిస్తూ పోలీసు శాఖ నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రజా శాంతి, భద్రత కోసం జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గంలో సెక్షన్ 144 అమల్లో ఉంచుతూ ఆదేశాలు జారీ చేస్తున్నట్లు హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వి.సి.సజ్జనార్ తెలిపారు. ఐదు లేదా అంతకంటే ఎక్కువ మంది వ్యక్తులు ఒకేచోట గుమికూడడం నిషేధం అన్నారు. ఈ నిషేధం 200 మీటర్ల పరిధిలో ఉన్న పోలింగ్ స్టేషన్లకు వర్తిస్తుందని పేర్కొన్నారు. పోలింగ్ రోజు 11న.. ఉదయం 6 గంటల నుంచి పోలింగ్ పూర్తయ్యే వరకు నియోజకవర్గ పరిధిలో 144 సెక్షన్ అమల్లో ఉంటుందని సజ్జనార్ స్పష్టం చేశారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నిక ఫలితం వెల్లడించే నవంబర్ 14న.. ఉదయం 6 గంటల నుంచి, నవంబర్ 15న ఉదయం 6 గంటల వరకూ 144 సెక్షన్ అమల్లో ఉంటుందని పోలీస్ శాఖ వెల్లడించింది. జూబ్లీ హిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో ప్రజా శాంతి, శాంతి మరియు ప్రశాంతతను కాపాడే ఉద్దేశంతో.. నగర పోలీస్ చట్టం, 1348 (నం.%×౪%) సెక్షన్ 67 (సి) కింద తనకు ఇవ్వబడిన అధికారాలను వినియోగించుకుని ఈ ఆదేశాలను ఇచ్చినట్లు హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ సజ్జనార్ పేర్కొన్నారు. ఉప ఎన్నిక ఓట్ల లెక్కింపు సందర్భంగా.. పబ్లిక్ రోడ్లపై, బహిరంగ ప్రదేశాలలో టపాసులు పేల్చడం, టపాసులు విసరడం నిషేధం అని ఈ నోటీసుల్లో పోలీసులు స్పష్టం చేశారు. పోలీసు శాఖ ఆదేశాలను ఉల్లంఘించిన ఏ వ్యక్తి అయినా ప్రాసిక్యూషన్‌కు గురవుతారని పోలీసులు హెచ్చరించారు.

మహిళ హత్య కేసు నిందితుడు అరెస్టు

విశాలాంధ్ర- దుండిగల్: మహిళను గొంతు కోసి అతి కిరాతకంగా హత్య చేసిన ఘటన దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సిఐ సతీష్ తెలిపిన వివరాల ప్రకారం మెదక్ జిల్లా తిమ్మాపూర్ కు చెందిన సుజాత(30)కి 2015 సంవత్సరంలో వివాహం అయిందని, 10 ఏళ్లుగా భర్తతో దూరంగా ఉంటున్నట్లు పేర్కొన్నారు. ప్రైవేట్ సంస్థలో పనిచేస్తున్న సుజాత బహదూర్ పల్లి గ్రీన్ హిల్స్ కాలనీలో అద్దె ఇంట్లో నివాసం ఉంటుందని తెలిపారు. గత కొంత కాలంగా ఒక వ్యక్తి సన్నిహితంగా ఉన్నట్లు ప్రాథమిక విచారణలో తెలిసిందని, ఇదే క్రమంలో మృతిరాలికి సదరు వ్యక్తికి గత 10 రోజులుగా గొడవలు జరుగుతున్నట్లు దర్యాప్తులో గుర్తించామని తెలియజేశారు. అతనికి సంబంధించిన వ్యక్తులే హత్య పాల్పడ్డారని అన్నారు. ఘటనా స్థలంలో సీసీ కెమెరాలు ఉన్నాయని, ఇద్దరు వ్యక్తులు వచ్చివెళ్లినట్లుగా కెమెరాలో రికార్డు కాగా మహిళను హత్య చెసినట్లుగా రాజేష్ అనే వ్యక్తి పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయినట్లుగా వెల్లడించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు ఆధారంగా దర్యాప్తు చేస్తున్నామని మరో వ్యక్తి కోసం గాలిస్తున్నట్లు తెలియజేశారు.

రేవంత్ రెడ్డికి పుట్టినరోజు శుభాకాంక్షలు

విశాలాంధ్ర, మల్కాజిగిరి : మల్కాజిగిరి చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డి జన్మదిన సందర్భంగా కేక్ కటింగ్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ వై.ప్రేమ్ కుమార్, వెంకటేష్ యాదవ్, శ్రీనివాస్, చంద్రశేఖర్, ఎస్.ఆర్.ప్రసాద్, పిట్టల శ్రీనివాస్, డివిజన్ అధ్యక్షులు వైనాల ప్రవీణ్, సత్యమూర్తి, వినోద్ యాదవ్, సంతోష్ రాందాస్ ముదిరాజ్, బాబు, సత్యనారాయణ, పిట్టల నాగరాజు, సయ్యద్ మబ్బు, ఫరూక్, ఫరీద్, ఇందిరా ప్రియదర్శిని, ఆశ, ప్రభా, కుట్టి శ్రీనివాస్, ఆగమయ్య, కొండగౌడ్, బ్రహ్మయ్య, సిరిగిరి రాజు, సురేష్ సింగ్, పంజా శ్రీనివాస్ దితరులు పాల్గొన్నారు.

నేడు నామినేషన్ అభ్యర్థుల రిజిష్టర్ల తనిఖీ

విశాలాంధ్ర, హైదరాబాద్ : జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నికలో పోటీ చేస్తున్న 58 మంది అభ్యర్థులు తమ రోజువారీ ఖర్చులను నమోదు చేసే రిజిష్టర్ల తనిఖీనీ తుది విడతగా ఈ నెల 9 న ఎన్నికల వ్యయ పరిశీలకుల ఎదుట తనిఖీ చేయించుకోవాలని జూబ్లీహిల్స్ ఎన్నికల వ్యయ పరిశీలకులు సంజీవ్ కుమార్ లాల్, వ్యయ మానిటరింగ్ నోడల్ అధికారి వెంకటేశ్వర రెడ్డి, సహాయ వ్యయ పరిశీలకులు జి.రామకృష్ణ తెలిపారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేసారు. షేక్ పేట తహసీల్దార్ కార్యాలయంలోనీ రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో ఉదయం 10.30 గంటల నుండి సాయంత్రం 05.00 వరకూ తనిఖీ ఉంటుందన్నారు. అభ్యర్థులు తప్పకుండా తమ రిజిస్టర్లను తనిఖీ చేసుకోవాలనీ చేయించుకోవాలని తెలిపారు. అభ్యర్థి నామినే షన్ వేసినప్పటి నుంచి ఓట్ల లెక్కింపు వరకు రూ.10 వేలకు మించి వ్యక్తికి గానీ, సంస్థకు గానీ నగదు లావాదేవీలు జరపవద్దని, చెక్కుల రూపంలోనే ఉండాలని సూచించారు. ఇప్పటికే అక్టోబర్ 28న మొదటి విడత, నవంబర్ 3 వ తేదీన రెండో విడత అభ్యర్థుల రిజిస్టర్ల తనిఖీని వ్యయ పరిశీలకులు నిర్వహించారు.

జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ప్రచార జోరు

కేటీఆర్ వ్యాఖ్యలను ఖండిస్తున్నాం

విశాలాంధ్ర, బషీర్ బాగ్: జూబ్లీహిల్స్ ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌ను రౌడీ షీటర్ అంటూ మాట్లాడిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యాఖ్యలను అఖిల భారత యాదవ మహా సభ తెలంగాణ ఖండించింది. ఈ ఎన్నికల్లో నవీన్ యాదవ్ ను గెలిపించుకొని , బిఆర్ఎస్ పార్టీకి తగిన గుణపాఠం చెబుతామని యాదవ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు చింతల రవీందర్ యాదవ్ అన్నారు.శనివారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో యాదవ మహా సభ జాతీయ ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్ యాదవ్ తో కలిసి ఆయన మాట్లాడారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో యాదవుల ఓట్లు ముప్పై వేలకు పైగా ఉన్నాయని... అందరూ నవీన్ యాదవ్ వెంటే ఉన్నారని తెలిపారు. చదువుకున్న విద్యావంతుడికి కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా అవకాశం కల్పించిందని , కానీ అగ్రకులాల పార్టీలు అతన్ని ఓడించేందుకు కుట్రలు చేస్తున్నాయని విమర్శించారు. ఎవరెన్ని కుట్రలు చేసిన నవీన్ యాదవ్ గెలుపును అడ్డుకోలేరని , 50 వేల మెజార్టీతో ఆయన గెలుస్తున్నారని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జాతీయ ప్రధాన కార్యదర్శి ఆర్ లక్ష్మణ్ యాదవ్, రాష్ట్ర కార్యదర్శులు రాగం నాగేందర్ యాదవ్, కార్యవర్గ సభ్యులు కిరణ్ కుమార్ యాదవ్ రాష్ట్ర యువజన అధ్యక్షులు యశ్వంత్ యాదవ్, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు విజయ్ కుమార్ యాదవ్ పాల్గొన్నారు.



తల్లి గెలుపునకు తనయుడి ప్రచారం

విశాలాంధ్ర, జూబ్లీహిల్స్ : తన తల్లిని గెలిపించుకునేందుకు షేక్ పేట్ డివిజన్‌లో తనయుడు ఇంటింటి ప్రచారం. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో తన తల్లి, బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి మాగంటి సునీత గోపినాథ్‌నీ గెలిపించుకోవడానికి వారి తనయుడు మాగంటి వాత్సల్య నాథ్ శనివారం షేక్ పేట డివిజన్‌లోని బి జె ఆర్ నగర్ - ఫిలిం నగర్ లో బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్ గారి సతీమణి అయేషా గారితో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించి కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, మహిళలు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ, బీఆర్ఎస్‌లను ఓడించండి

విశాలాంధ్ర, హైదరాబాద్ : జూబ్లీ హిల్స్ అసెంబ్లీ నియోజకవర్గం ఉప ఎన్నికల్లో ప్రజా సంక్షేమానికి పాటుపడే కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ ను గెలిపించాలని ఐ.ఎన్.టి.యు.సి జాతీయ అధ్యక్షులు డా. జి. సంజీవ రెడ్డి విజ్ఞప్తి చేసారు. కార్పొరేట్‌లకు కొమ్ముకాసే కార్మిక వ్యతరేకి బీజేపీను, తెలంగాణ రాష్ట్రాన్ని కొల్లగొట్టిన దోపిడీదారు బీఆర్ఎస్‌ను ఓడించాలని అన్నారు. హైదరాబాద్, బర్కత్ పుర, తన నివాసంలో శనివారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో డా. జి. సంజీవ రెడ్డి మాట్లాడుతూ కార్మికుల సంక్షేమం, భద్రత కోసం అప్పటి కాంగ్రెస్ కేంద్ర ప్రభుత్వం అనేక కార్మిక చట్టాలను తీసుకవచ్చిందని, దేశంలో భారీ పరిశ్రమలు ఏర్పాటు చేసి లక్షలాదిమందికి ఉపాధి, ఉద్యోగ భద్రత కల్పించిందని గుర్తు చేసారు. నేడు తగిన ఉపాధిని కల్పించడంలో బిజెపి ప్రభుత్వం విఫలమైందని, ప్రైవేటైజషన్ పేరుతో ఉన్న ఉద్యోగాలను కొల్లగొట్టిందని, అభివృద్ధిని నిలిపివేసిందని, దేశంలో ఆర్థిక అశాంతిని సృష్టిస్తోందని ఆయన ఆరోపించారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రజా సంక్షేమాన్ని విస్మరించి ప్రాజెక్టుల నిర్మాణం పేరట వేల కోట్ల కుంభకోణానికి పాల్పడిందని, రాష్ట్ర ఖజానాను దోచుకున్న గజదొంగలు కెసిఆర్ టీం అని అయన మండిపడ్డారు. హైదరాబాద్ జూబ్లీ హిల్స్ అసెంబ్లీ ఉప ఎన్నికలో బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలను చిత్తుగా ఓడించి ప్రజలు తగిన గుణపాఠం చెప్పాలని ఆయన కోరారు. జూబ్లీ హిల్స్ అసెంబ్లీ నియోజకవర్గంలో సినీ కార్మికులు, భావన నిర్మాణ కార్మికులు అత్యధికంగా నివసిస్తున్నారని, వారందరు పేద ప్రజలకు నిత్యం అండగా ఉండే కాంగ్రెస్ పార్టీ కె తమ ఓటు వేసి గెలిపించాలని డా. జి. సంజీవ రెడ్డి విజ్ఞప్తి చేసారు. ఐ.ఎన్.టి.యు.సి రాష్ట్ర ముఖ్య ఉపాధ్యక్షులు బి. జనక్ ప్రసాద్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలన్నీ రాష్ట్ర వ్యాప్తంగా ఒక్కొకటి నెరవేర్చుకుంటూ వస్తుందని, గ్రామాలలో ఇందిరమ్మ ఇళ్ళు మాదిరిగానే నగరంలో పేదలకు డబల్ బెడ్ రూమ్ ఇళ్ళు కేటాయిస్తుందని, జూబ్లీ హిల్స్ అసెంబ్లీ నియోజకవర్గంలోని పేదలకు డబల్ బెడ్ రూమ్ ఇళ్ళు ప్రభుత్వం కేటాయిస్తుందని, పేదల పక్షపాతైనా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్‌కు ఓటు వేసి గెలిపించాలని అయన విజ్ఞప్తి చేసారు. ఈ సమావేశంలో ఐ.ఎన్.టి.యు.సి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.డి. చంద్రశేఖర్, వర్కింగ్ ప్రెసిడెంట్ జి. సత్యజిత్ రెడ్డి, నాయకులూ త్యాగరాజన్, సమ్మయ్య, సదానంద్, భూమయ్య, నగేష్, విఎస్టి ఇండస్ట్రీస్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎల్.డి. పాల్ తదితరులు పాల్గొన్నారు.

నవీన్ యాదవ్‌ను గెలిపించండి : జగ్గారెడ్డి

విశాలాంధ్ర-హైదరాబాద్ : నవీన్ యాదవ్‌ను గెలిపించుకోవాలని నియోజకవర్గం ప్రజలకు కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే మూడు ఏళ్లు అధికారంలో ఉంటాం. నవీన్‌యాదవ్ యువకుడు, విద్యావంతుడు, యుక్తి వుంది. రెండు సార్లు ఎన్నికల్లో పోటీ చేసిన అనుభవం వ్యక్తి, శక్తి, యుక్తి ఉన్న నాయకుడు నవీన్ యాదవ్, అందుకే ఓటు వేయండి. నవీన్ యాదవ్ ను గెలిపిస్తే రాబోవు మూడేళ్ళు మీకు సేవ చేస్తాడన్నారు. ముఖ్యమంత్రి ద్వారా మీకు కావలసిన అభివృద్ధి చేస్తాడు. మిగతా అభ్యర్థులకంటే నవీన్ యాదవ్ సమర్థుడు అందుకే కాంగ్రెస్ పార్టీ ఎంపిక చేసింది. ప్రజల పక్షాన పనులు చేస్తాడు. అపోజిషన్ పార్టీ గెలిస్తే ముఖ్యమంత్రి వద్దకు వెళ్ళలేడు. అభివృద్ధి చేయలేడు. ప్రశాంతంగా ఆలోచించి ఓటర్లు ఓటేయండి, మంత్రులని ఇంచార్జిలుగా ఉన్నారు. కొల్లూరు డబుల్‌బెడ్ రూమ్ వద్ద ప్రభుత్వ చౌకదాన్యపు డిపోలను ఏర్పాటు చేశారు. ఇదంతా జూబ్లీహిల్స్ ఎన్నికల ఫలితమే అంతకుముందు టిఆర్ఎస్ ఎమ్మెల్యే రెండేళ్లు ఉంది ఈ సమస్యను పరిష్కరించలేక పోయారు. ఇదే నిదర్శనం, అధికార పార్టీకి ఓటేస్తే ఎంత లాభం ఉంటుందో అనేదానికి. అందుకే నవీన్ యాదవ్ ను రాబోయే ఎన్నికల్లో అత్యధిక మెజారిటీతో గెలిపించండి. మేమంతా జవాబుదారిగా ఉండి మీ సమస్యలు పరిష్కరిస్తాం. 40 వేల ఓట్లు ఉన్నాయి. ఇవన్నీ నవీన్ యాదవ్ కి వేసి గెలిపిస్తే 6301444193. మీకు ఈ నంబర్ అందుబాటులో ఉంటుంది. జూబ్లీహిల్స్‌కి ఎన్ని కోట్లు కావాలో నేను ముఖ్యమంత్రితో మాట్లాడి అభివృద్ధి చేస్తా. నవీన్ యాదవ్ గెలిస్తే అభివృద్ధి చేస్తాడు. అపోజిషన్ గెలిస్తే ధర్నాలు, రాస్తారోకోలకి పరిమితం అవుతారు. దానివల్ల ఉపయోగం లేదు, అన్ని వర్గాల వాళ్ళు దయచేసి ఆలోచించండి. నవీన్ యాదవ్‌ను గెలిపించం. కేసీఆర్ ఫ్యామిలీ సోషల్ మీడియా రూములో పండుతున్నట్టుంది. ఉన్నది లేనట్టు, లేనిది ఉన్నట్టు తప్పుడు ప్రచారం చేస్తున్నారు. యూత్ ఆలోచించండి, వాటిని చూసి ఎంజాయ్ చేయండి తప్ప. వాటిని ఆచరించకండి. వృద్ధులకు రూ. 4 వేల పింఛన్ గురించి ముఖ్యమంత్రి ఆలో చూస్తున్నాడు. త్వరలోనే అమాలి చేయడానికి సన్నాహాలు చేస్తున్నాడు. అందుకు తగ్గట్టు బడ్జెట్ సమకూర్చుకోవడంలో నిమగ్నమయ్యారు. నవీన్ యాదవ్, శ్రీశైలం యాదవ్ లపై కేటీఆర్ దుష్ప్రచారం చేస్తున్నాడు. వాళ్ళని దగ్గరగా పరిశీలిస్తే వాళ్ళు ఎలాంటి వాళ్ళో అర్థం అవుతుంది. కెటిఆర్ రాజకీయ ఉనికి కోసం ప్రయత్నిస్తున్నాడు. అందుకు జూబ్లీహిల్స్ ఎన్నికలను ఉపయోగించుకోవాలని చూస్తున్నాడు. హైడ్రాను బూచిగా చూపెట్టే ప్రయత్నం చేస్తున్నాడు. జూబ్లీహిల్స్ లో ఏ ఒక్క ఇల్లు కూల్చలేదు. బాధ్యత లేని సోషియల్ మీడియాను నమ్మి మోసపోకండి అని అన్నారు.

ఘనా దేశంలో పెట్టుబడులకు సింగరేణికి ఆహ్వానం

విశాలాంధ్ర, హైదరాబాద్ : ప్రపంచంలోనే వజ్రాలు, బంగారం, బాక్సైట్, మాంగనీస్, లిథియం తదితర ఉత్పత్తులకు ప్రముఖ దేశంగా పేర్కొనే రిపబ్లిక్ ఆఫ్ ఘనా దేశం సింగరేణి సంస్థను తమ దేశంలో పెట్టుబడులకు ఆహ్వానం పలికింది. హైదరాబాద్ సింగరేణి భవన్‌లో శనివారం ఘనా దేశ ఉన్నత స్థాయి ప్రతినిధి బృందం వారు సింగరేణి సంస్థ సీఎండీ బలరామ్‌తో సమావేశమై పలు వ్యాపార అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఘనా దేశ ప్రతినిధి బృందం మాట్లాడుతూ తమ దేశంలో ఖనిజ రంగంలో పెట్టుబడులకు అవకాశం ఉందని, ఈ విషయంలో అపార అనుభవం సింగరేణి సంస్థకు తాము స్వాగతం పలుకుతున్నామన్నారు. తమ దేశంలో ప్రధానంగా వజ్రాలు, బంగారం, బాక్సైట్, మాంగనీస్, లిథియం వంటి పలు ఖనిజాల తవ్వకం, ఉత్పత్తులు పెద్ద ఎత్తున జరుగుతుంటాయని విదేశాలకు ఎగుమతి చేస్తుంటామన్నారు. అయితే ఉత్పత్తి పెంచడానికి ఇందుకు అవసరమైన పెట్టుబడులను ఆహ్వానించడం కోసం వచ్చామని, మైనింగ్‌లో ఎంతో అనుభవం ఉన్న సింగరేణి సంస్థ ఈ అవకాశాన్ని అందిపుచ్చుకోవాలని కోరారు. తమ దేశంలో బొగ్గు మైనింగ్ ఉందని, ఇందులోనూ సింగరేణి సహకారాన్ని కోరుతున్నట్లు పేర్కొన్నారు. దీనిపై సీఎండీ శ్రీ ఎన్.బలరామ్ స్పందిస్తూ సింగరేణి సంస్థ తన వ్యాపార విస్తరణ చర్యలో భాగంగా విదేశాల్లో ఇతర ఖనిజాలు, కీలక ఖనిజ రంగాల్లో కూడా ప్రవేశించాలని ఇప్పటికే నిర్ణయించి ప్రయత్నాలు ప్రారంభించిందన్నారు. ఘనా దేశంలో మైనింగ్ జరపటానికి గల అవకాశాలను పరిశీలిస్తామన్నారు. కీలక ఖనిజ తవ్వకాలకు అవకాశం ఉంటే అధిక ప్రాధాన్యత ఇస్తామని ఆయన పేర్కొన్నారు. మరో నెల రోజుల్లో ఘనా దేశానికి చెందిన సాంకేతిక బృందం కేంద్ర ప్రభుత్వంతో సమావేశం కానుందని ఆ దేశ ప్రతినిధి బృందం పేర్కొంది. ఆ సమయంలో మరో దఫా సమావేశం కావాల్సిందిగా, అలాగే తమ దేశానికి సింగరేణి బృందాన్ని కూడా పంపించాల్సిందిగా వారు సీఎండీని కోరారు. దీనిపై సీఎండీ శ్రీ ఎన్. బలరామ్ సానుకూలంగా స్పందిస్తూ సింగరేణి అధికారుల బృందాన్ని పంపిస్తామని పేర్కొన్నారు. మొత్తం మీద చూస్తే తొలిసారిగా ఒక ఆఫ్రికా దేశంలో అడుగుపెట్టడానికి సింగరేణి సంస్థ ముంగిటకు అవకాశం వచ్చిందని పేర్కొనవచ్చు. ఈ సమావేశంలో డైరెక్టర్ (పి అండ్ పి) శ్రీ కె.వెంకటేశ్వర్లు, డైరెక్టర్ (పర్సనల్) శ్రీ గౌతమ్ పొట్రు, జీఎం(కో ఆర్డినేషన్) శ్రీ టి.శ్రీనివాస్, ఘనా దేశ ప్రతినిధి బృందంలో బిజినెస్ కన్సల్టెంట్ శ్రీ అబ్దుల్ సలాం మోర్గాన్ అగ్బోటు, ఘనా దేశం తరఫున మాలి దేశ రాయబారి శ్రీ అహ్మద్ ఉమర్ సాండా , ఘనాదేశ అధ్యక్షులు జాన్ సోదరులు ప్రముఖ వ్యాపారవేత్త మైకేల్ మహామ , ఘనా దేశ స్టాండర్డ్స్ బోర్డ్ ఛైర్మన్ శ్రీ మొగ్రారి హుడు, ఘనా సీనియర్ వైస్ ప్రెసిడెంట్ కార్యాలయ సీనియర్ కరస్పాండెంట్ శ్రీ అగ్రే ఎలిషమా ఫ్రెడరిక్ , నేషనల్ సెక్యూరిటీ విభాగం అధికారి శ్రీ అంగా మైన్స్ సైతాసలిఫు, ప్రముఖ వ్యాపారవేత్త శ్రీమతి అగ్బెంకోర్ ఎడ్నా ఈడెం , ఘనా బిజినెస్ హెడ్ శ్రీమతి పరుల్ కక్కర్ పాల్గొన్నారు.

26 సీపీఐ బహిరంగ సభ విజయవంతం చేయండి

విశాలాంధ్ర - మొయినాబాద్ : సీపీఐ శతాబ్ది ఉత్సవాల ముగింపు సందర్భంగా డిసెంబర్ 26న ఖమ్మంలో జరిగే ప్రదర్శన, బహిరంగ సభను విజయవంతం చేసేలా ఇంటింటికి సమాచారం ఇవ్వాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య పిలుపునిచ్చారు.చేవెళ్ల మండల కేంద్రంలోని సిపిఐ పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ ఇంచార్జి కె. రామస్వామి అధ్యక్షతన చేవెళ్ల నియోజకవర్గ నాలుగు మండలాల కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సిపిఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య హాజరై మాట్లాడుతూ ... భారత గడ్డ పైన 1925 డిసెంబర్ 26వ తేదీన ఉత్తరప్రదేశ్ లోని కాన్పూర్ ప్రాంతంలో భారత కమ్యూనిస్టు పార్టీ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పేదల కోసం బడుగు, బలహీన వర్గాల కోసం కార్మిక కర్షక శ్రేయస్సు కోసం సమసమాజ స్థాపన కోసం ఏర్పడిన పార్టీయే భారత కమ్యూనిస్టు పార్టీ అని అన్నారు. ఎన్నో త్యాగాలు ఎన్నో పోరాటాలు ఎన్నో భూ పోరాటాలు ఎంతోమంది ప్రాణ త్యాగాల చరిత్ర ఉన్న పార్టీ సిపిఐ పార్టీ అని డిసెంబర్ 26న ఖమ్మం పట్టణంలో లక్షలాది మందితో భారీ బహిరంగ సభ ఉంటుందని పార్టీ శ్రేణులు కార్మికులు కర్షకులు రైతులు పార్టీ శ్రేయోభిలాషులు పార్టీ అభిమానులు అత్యధిక సంఖ్యలో పాల్గొని బహిరంగ సభను విజయవంతం చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐకేఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.ప్రబులింగం, జిల్లా కార్యవర్గ సభ్యుడు వడ్ల సత్యనారాయణ, నాలుగు మండలాల కార్యదర్శులు చేవెళ్ల మండల పార్టీ కార్యదర్శి ఎం, సత్తిరెడ్డి, శంకర్పల్లి మండల పార్టీ కార్యదర్శి సుధీర్, మొయినాబాద్ మండల పార్టీ కార్యదర్శి కే. శ్రీనివాస్, షాబాద్ మండల పార్టీ కార్యదర్శి పి .శ్రీశైలం, ఇన్సాబు జిల్లా అధ్యక్షుడు ఎండి. మక్బుల్ , బి కే యం యు జిల్లా అధ్యక్షుడు జే. అంజయ్య, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వడ్ల మంజుల, జిల్లా కౌన్సిల్ సభ్యుడు సుధాకర్ గౌడ్, ప్రజా సంఘాల నాయకులు కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.

రాజేందర్‌రెడ్డి ఆశయ సాధనకు కృషి చేద్దాం : ఎమ్మెల్యే

విశాలాంధ్ర - మొయినాబాద్ : పట్నం రాజేందర్‌రెడ్డి ఆశయ సాధనకు కృషి చేద్దామని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు.శనివారం స్వర్గీయ దివంగత రాజేందర్ రెడ్డి జయంతి సందర్భంగా చేవెళ్ల పట్టణ కేంద్రంలోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి ఎంతో కృషి చేసిన దివంగత నేత పట్నం రాజేందర్ రెడ్డి ఆశయ సాధనకు కృషిచేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల, ముడిమ్యాల పీఏసీఎస్ చైర్మన్ దేవర వెంకట్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ పెంటయ్యగౌడ్, డీసీసీ ఉపాధ్యక్షులు బండారి ఆగిరెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బేగరి రాములు, మాజీ సర్పంచులు మధుసూదన్ గుప్తా, పడాల ప్రభాకర్, జహంగీర్ తదితరులు పాల్గొన్నారు.

హోప్ ఫౌండేషన్ అన్నదానం

విశాలాంధ్ర- శేరిలింగంపల్లి: తమ హోప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మూడు సంవత్సరాల క్రితం ప్రారంభించిన అన్న ప్రసాద కార్యక్రమం నేటితో 3 సంవత్సారాలు ముగించుకొని నాల్గవ సంవత్సరంలో అడుగు పెట్టినట్లు హోప్ ఫౌండేషన్ చైర్మెన్ కొండ విజయ్‌కుమార్ తెలిపారు. హెూప్‌ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేపడుతున్న అన్నదాన కార్యక్రమం శనివారం 157 వారంకు చేరుకుంది. కార్యక్రమంలో సూమారు 2200 మంది భోజనం కార్యక్రమంలో పాల్గొన్నారు . హెూప్ ఫౌండేషన్ సభ్యులు ఏలాంటి ఇబ్బందులు లేకుండ ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో పలువురు సంఘ సేవకులు పాల్గొన్నారు.

అగర్వాల్ సమాజ్ కార్తీక పౌర్ణమి స్నాన యాత్ర

విశాలాంధ్ర, బషీర్ బాగ్ : అగర్వాల్ సమాజ్ లకడీ కాపుల్ శాఖ ఆధ్వర్యంలో కార్తీక పౌర్ణమి (డుబ్కి పూనమ్) పావన సందర్భంగా బాసరలోని గోదావరి నదిలో స్నాన యాత్రను విజయవంతంగా నిర్వహించారు. ఈ పవిత్ర యాత్రలో మొత్తం 42 మంది సభ్యులు ఉత్సాహంగా పాల్గొన్నారు. వీరంతా బాసరకు చేరుకుని అందరూ గోదావరి నదిలో శ్రద్ధా భక్తులతో స్నానం చేసి, విద్యా దేవత అయిన శ్రీ సరస్వతి మాత ఆలయంలో దర్శనం చేసుకుని పూజలు నిర్వహించారు. యాత్ర వాతావరణం రోజంతా ఆనందంగా సాగింది. ఈ యాత్ర విజయవంతం కావడంలో చైర్మన్ విజయ్ కుమార్ అగర్వాల్, యాత్ర కన్వీనర్ రాజీవ్ అగర్వాల్, అధ్యక్షులు సునీల్ కుమార్ అగర్వాల్, మంత్రి జై కుమార్ అగర్వాల్, సహ మంత్రి ముఖేష్ అగర్వాల్, కోశాధికారి అర్జున్‌లాల్ అగర్వాల్, గోవింద్ రామ్, ముఖేష్ మోడీ సహా ఇతర సభ్యులు విశేషంగా సహకరించారు. ఈ యాత్ర సభ్యులందరికీ ఆధ్యాత్మిక, ఆత్మీయ అనుభూతిని అందించింది.

సీఎం రేవంత్ రెడ్డి జన్మదిన వేడుక

విశాలాంధ్ర- శేరిలింగంపల్లి: తెలంగాణముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి జన్మదినం సందర్భంగా చందానగర్ మాజీ కాన్సిలర్, శేరిలింగంపల్లి మండల మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కొండవీటి సునీతప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ , తెలంగాణ రాష్ట్ర ఫీసీసీ జనరల్ సెక్రటరీ ముఖ్య అతిథితో కలసి వేమన వీకర్ సెక్షన్ కాలని లో కేక్ కటింగ్ అన్నదానం కార్యక్రమం నిర్వహించడం జరిగినది, ఈ కార్యక్రమం లో మాజీ కౌన్సిలర్ రవీందర్ రావు, చందానగర్ యూత్ అధ్యక్షులు మధు, విద్యార్థి అధ్యక్షులు చంద్రమౌళి, మాజీ మహిళా అధ్యక్షురాలు పద్మిని, అనిత, పార్వతి, జయ, జయలక్ష్మి, కవిత, సంగీత, శేఖర్ రెడ్డి, ప్రీతం, మోహన్ రెడ్డి రవీందర్, శ్రీనివాస్, కృష్ణ, పోచయ్య లలిత, రమేష్, అనిల్, కాలనీ వాసులు మహిళలు పిల్లలు మొదలైనవారు పాల్గొన్నారు.

ఘనంగా సీఎం పుట్టినరోజు వేడుక

విశాలాంధ్ర , కాప్రా : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జన్మదిన వేడుకలను శనివారం నాచారంలో ఘనంగా నిర్వహించారు. ఐఎన్ టియుసి, మేడ్చల్ జిల్లా అధ్యక్షులు, రాష్ట్ర లేబర్‌సెల్ ఉపాధ్యక్షుడు వి ఎస్ ప్రకాష్‌రెడ్డి ఆధర్యంలో నాచారం చౌరస్తా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద జరిగిన సంబరాల్లో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో కలిసి కేకకట్ చేశారు. అనంతరం మహిళలకు చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వి ఎస్ ప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ నిత్యం ప్రజాసేవలో నిమగ్నమవుతూ రాష్ట్రాభివృద్ధికి పాటుపడటంలో భగవంతుడు వారికి సంపూర్ణ ఆయురారోగ్యాలు ప్రసాదించాలని ఆకాంక్షించారు. ప్రజలకు మరింత సుభిక్షంగా పాలన అందించేందుకు, రాబోయే కాలంలో కూడా ప్రజల ఆశయాలకు అనుగుణంగా రాష్ట్రాన్నిఉన్నత స్థాయికి తీసుకెళ్లేందుకు రేవంత్ రెడ్డికి మరింత శక్తిని ఇవ్వాలని పూజించారు. ఈ కార్యక్రమంలో మామిడాల సంతోష్ రెడ్డి, నర్సింగ్ రావు, మెతుకు శ్రీనివాస్ రెడ్డి, షరీఫ్ ఉద్దీన్, సాయి బాబా, ప్రేమ్ కుమార్ గౌడ్, యాదయ్య, అజీమ్, శ్రీనివాస్ రెడ్డి, ఎర్రకుంట నవీన్, ప్రవీణ్, యూసుఫ్, శాంతి గార్డెన్ నరేష్, విజయ్, ఫిరోజ్ , రేవంత్, శ్రీనివాస్ రెడ్డి, కుమార్, సద్దాం, మహిళా అధ్యక్షురాలు ఉమ తదితరులు పాల్గొన్నారు.

గణపతి దేవాలయంలో ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర , కాప్రా : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జన్మదిన ని పురస్కరించుకొని మల్లాపూర్ డివిజన్ పరిధిలోని కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఎస్వి కిట్టు ఆధ్వర్యంలో శ్రీలక్ష్మి గణపతి దేవాలయంలో స్వామిలకు బిక్ష ఏర్పాటు చేశారు. సంబరాల్లో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో కలిసి కేక కట్ చేశారు. ఈ సందర్భంగా ఎస్వి కిట్టు మాట్లాడుతూ... నిత్యం ప్రజాసేవలో నిమగ్నమవుతూ రాష్ట్రాభివృద్ధికి పాటుపడటంలో భగవంతుడు వారికి సంపూర్ణ ఆయురారోగ్యాలు ప్రసాదించాలని ఆకాంక్షించారు. ప్రజలకు మరింత సుభిక్షంగా పాలన అందించేందుకు, రాబోయే కాలంలో ప్రజల ఆశయాలకు అనుగుణంగా రాష్ట్రాన్ని ఉన్నత స్థాయికి తీసుకెళ్లేందుకు రేవంత్ రెడ్డికి మరింత శక్తిని ఇవ్వాలని పూజించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు బొంగోని ఉమేష్ గౌడ్, డివిజన్ అధ్యక్షుడు కప్పురా సాయి గౌడ్, నెమలి అనిల్ కుమార్, రాజు గౌడ్, పి .జి. సుదర్శన్, బాలరాజ్ గౌడ్, మక్తల రాజు గౌడ్, సురేష్ గౌడ్, శ్రీకాంత్ రెడ్డి, ముజీబ్, ఫిరోజ్ ఖాన్, అక్బర్, అన్వర్, వాసు, యాదిరెడ్డి, వెంకటేష్ గౌడ్, నిరంజన్, శైలజ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల నిధులపై శ్వేతపత్రం విడుదల చేయాలి : మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

విశాలాంధ్ర, బషీర్ బాగ్: రెండేళ్ల పాలనలో కేటాయించిన నిధులు కాంట్రాక్టర్లకు, విద్యార్థులకు ఫీజు రియంబర్స్మెంట్ కింద ఎంత కేటాయించారో శ్వేతపత్రం విడుదల చేయాలనీ మాజీ మంత్రి వి. శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. అఖిలపక్ష విద్యార్థి సంఘాలు ఐక్య పోరుకు సిద్ధం కావాలన్నారు. పెండింగ్‌లో ఉన్న ఫీజుల బకాయిల్లో 50 శాతం ఇవ్వాలని డిమాండ్ చేశారు. శనివారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో తెలంగాణ బీసీ విద్యార్థి సంఘం వేముల రామకృష్ణ అధ్యక్షులు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ మద్దతు తెలిపారు. ఫీజుల బకాయిల పోరుకు అనేక యూనివర్సిటీల ఉస్మానియా, కాకతీయ, తెలంగాణ ,పాలమూరు మహాత్మా గాంధీ, శాతవాహన యూనివర్సిటీలో విద్యార్థి నేతలతో పలు విద్యార్థి సంఘాలతో ఐక్య పోరుకి సిద్ధం కావాలన్నారు. ఈనెల15న అఖిలపక్ష పార్టీల, విద్యార్థి సంఘాల సమావేశం భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామని తెలిపారు. కమిటీలు వద్దు ఫీజుల బకాయిలు ఇవ్వండన్నారు. కాంట్రాక్టర్ల నిధులు కేటాయింపుకు కమిటీలు వేసుకోండి అని విద్యాశాఖమంత్రి నియమించాలని కోరారు. బకాయిలు ఇవ్వాలని అడుగుతే కాలేజ్ యాజమాన్యాలపై బెదిరింపులకుదిగడం ఎంతవరకు సమంజసం అన్నారు. ప్రభుత్వం దగ్గర ఫీజ్ రియంబర్స్మెంట్ స్కీమును దుర్వినియోగం చేస్తున్నారనీ ఆరోపించారు. అనేక నాన్ టెక్నికల్ కాలేజీలు (బడ్జెట్ కాలేజ్) అధ్యాపకులకు జీతాలు ఇవ్వలేక భవనాల అద్దెలు కట్టలేక ఇప్పటికే మూతపడ్డాయన్నారు. ఇంకొన్ని కాలేజీలు మూతపడే దశకు చేరుకున్నాయన్నారు. ఈ కాలేజీలలో చదువుకునేదంతా పేద విద్యార్థులే, రాష్ట్ర ప్రభుత్వం మూసి సుధీకరణ వంటివి మానుకోవాలన్నారు. విద్యార్థుల భవిష్యత్తుపై చొరవ చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, ఉస్మానియా యూనివర్సిటీ సంజయ్, కాకతీయ యూనివర్సిటీ హరికృష్ణ, తెలంగాణ యూనివర్సిటీ సాహిత్, గణేష్ మహాత్మా గాంధీ యూనివర్సిటీ, పాపారావు ఆర్థివాసి విద్యార్థి సంఘం, జూనియర్ న్యాయవాదుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు వంశీకృష్ణ, సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నందగోపాల్, జగదీష్, రాహుల్, ప్రణీత్ తదితరులు పాల్గొన్నారు.

బలహీన వర్గాల అభివృద్ధికి కృషి

విశాలాంధ్ర, బషీర్ బాగ్: పేద బడుగు బలహీన వర్గాల అభివృద్ధి దిశగా వెళ్లేందుకు నాగ శిరీష సేవా సమితి కృషి చేస్తుందని సమితి అధ్యక్షుడు జి. రాజేష్, ఉపాధ్యక్షురాలు నాగ శిరీష లు తెలిపారు. శనివారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో నాగ శిరీష సేవా సమితి ఆవిర్భావం సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అధ్యక్షుడు జి రాజేష్, ఉపాధ్యక్షురాలు నాగ శిరీష మాట్లాడుతూ తమ సమితి సమాజసేవలో నిబద్ధత, కరుణ, ప్రేమతో ఎలాంటి ప్రతి ఫలం ఆశించకుండా నిరంతరం సేవలు అందిస్తుందని చెప్పారు. ముఖ్యంగా విద్యా, ఉద్యోగ రంగాల్లో, మహిళా శక్తి వికాసం కోసం పాటు పాటుపడుతుందన్నారు. ఇది సమాజ సేవలో కొత్త అధ్యాయానికి నాంది పలుకుందని స్పష్టం చేశారు. సామాజానికి విస్తృతంగా సమర్ధవంతంగా సేవలు అందించటానికి పునర్ అంకితమైందన్నారు.

కెనరా బ్యాంక్ Canara Bank (భారత ప్రభుత్వరంగ సంస్థ) సిండికేట్ Syndicate
ప్రాంతీయ కార్యాలయం : విజయవాడ
డోర్ నెం. 54-15-18/6, యలమంచిలి కాంప్లెక్స్ (స్పెన్సర్స్) ఎదురుగా, విజయవాడ-520008. ఫోన్: 0866-2468600

స్థిరాస్తులు అమ్మకానికి వేలం అమ్మకం ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 లోని 8(6) & 9 నిబంధనలతో చదవబడు సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్టు, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకానికి ఇ-వేలం ప్రకటన.

సెక్యూర్డ్ క్రెడిటార్ అయిన కెనరా బ్యాంక్, కానూరు బ్రాంచ్ వారికి ఋణగ్రహీత(లు): M/s. బాలాజీ ఆక్వా ట్రేడర్స్, ప్రాతినిధ్యం వహిస్తున్నవారు శ్రీమతి బొమ్మారెడ్డి లక్ష్మి, శ్రీ బొమ్మారెడ్డి శ్రీనివాస రెడ్డి వారు తేది.31.10.2025 నాటికి చెల్లించవలిసిన బకాయి రూ.1,31,08,919.38/- (అక్షరాల ఒక కోటి ముప్పై ఒక్క లక్షల ఎనిమిది వేల తొమ్మిది వందల పంతొమ్మిది రూపాయల ముప్పై ఎనిమిది పైసలు మాత్రమే) + తదుపరి వడ్డీ, ఛార్జీలు మరియు ఖర్చులను కలిపి మొత్తమును రాబట్టుకొనుటకు కెనరా బ్యాంక్, కానూరు బ్రాంచ్, విజయవాడ అధీకృత అధికారిచే నిర్మాణాత్మకంగా స్వాధీనం చేసుకున్న, సెక్యూర్డ్ క్రెడిటార్‌కు తనఖాపెట్టిన దిగువ వివరించిన స్థిరాస్తిని తేది 27.11.2025 న "ఎక్కడ ఎలా ఉన్నది" "అక్కడ అలా" మరియు "అక్కడ ఏమున్నదో అది" అనే ప్రాతిపదికన విక్రయించబడునని ప్రజానీకానికి మరియు ముఖ్యంగా పైన తెలిపిన ఋణగ్రహీతలు & హామీదారులకు ఇందుమూలముగా తెలియజేయడమైనది.

ఇ-వేలం తేది & సమయం: 27-11-2025 మ॥ 02:00 గం.ల నుండి సా॥ 04:00 గం.ల వరకు
రిజర్వు ధరలో 10% ధరావత్తు సొమ్మును M/s. పిఎస్‌బి అలియన్స్ ప్రైవేట్ లిమిటెడ్ (Baanknet) పోర్టల్ యొక్క ఇ-వ్యాలెట్‌లో నేరుగా గాని లేదా ధరావత్తును RTGS/NEFT ద్వారా చలాన్‌లోని ఖాతా వివరములకు తేది: 27.11.2025, మ॥ 12.00 గం.ల లోపుగా పొందుపరిచి జమచేయాలి.

ఒకవేళ ఎన్‌కంబ్రెన్స్‌లు ఏమైనా ఉన్నచో వాటితో కలిపి స్థిరాస్తి వివరములు:
రంగారెడ్డి జిల్లా, కుతుబుల్లాపూర్ మండలం, జీడిమెట్ల, ఐడిఎ, ఫేజ్ 1 వద్ద సర్వే నెం॥.311/1 & 311/ఏలోని ప్లాట్ నెం.88 (A) నందు 4840 చ॥గ॥లులోని అవిభాజ్యమైన వాటా 26 చ॥గ॥లుతో ఉషోదయ టవర్స్ 2వ అంతస్తులో బిల్టప్ ఏరియా 786 చ॥అ॥లులో ఫ్లాట్ నెం.F-217. హద్దులు : తూర్పు: లిఫ్ట్, దక్షిణం: కారిడార్, పడమర: కారిడార్, ఉత్తరం: ఫ్లాట్ నెం.218.

రిజర్వు ధర: రూ. 19,65,000/- ధరావత్తు సొమ్ము: రూ. 1,96,500/-

గమనిక: బ్యాంకుకు తెలిసి/తెలియని బకాయిలు/ట్యాక్సులు ఏవైనా ఉన్నచో వేలం కొనుగోలుదారు మాత్రమే వాటిని భరించవలసి ఉంటుంది మరియు చివరి మొత్తం బిడ్డు సొమ్ముకు అది అదనం.
అమ్మకానికి సంబంధించిన సవివరమైన నియమ నిబంధనల కొరకు కెనరా బ్యాంక్ వెబ్‌సైట్ www.canarabank.com లో ఏర్పాటు చేసిన "ఇ-వేలం" లింక్‌ను రిఫర్ చేయండి లేదా కెనరా బ్యాంక్, కానూరు బ్రాంచ్ మేనేజర్ గారిని ఆఫీసు పనివేళలలో సంప్రదించగలరు. ఫోన్ : 0866-2554535, మొబైల్ నెం.94409 05124
ఇ-వేలం విధానం కొరకు సర్వీసు ప్రొవైడర్‌ను సంప్రదించండి: మెస్సర్స్ పిఎస్‌బి అలయన్స్ (baanknet). వెబ్‌పోర్టల్ https://baanknet.com హెల్ప్‌డెస్క్: 8291220220, ఇ-మెయిల్: support.BAANKNET@psballiance.com
తేది : 06.11.2025, ప్రదేశం: విజయవాడ సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్

భావప్రకటన స్వేచ్ఛ ప్రజాస్వామ్యానికి మూలాధారం

- ఇది న్యాయసూత్రం కాదు... జీవన సత్యం
- 'విశాలాంధ్ర'ను విలువల వేదికగా నిలబెట్టిన మహానుభావుడు రాఘవాచారి
- సోషల్ మీడియాను నియంత్రిస్తున్నది సంపన్నులే
- స్మారకోపన్యాసంలో సుప్రీం మాజీ న్యాయమూర్తి సుదర్శన్‌రెడ్డి

విశాలాంధ్ర-హైదరాబాద్: 'భావప్రకటన స్వేచ్ఛ లేకపోతే ప్రజాస్వామ్యం నిలవదు' అని సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి బి.సుదర్శన్ రెడ్డి అన్నారు. "విశాలాంధ్ర మాజీ సంపాదకులు సి.రాఘవాచారికి భయమనే పదం తెలియదు. ఎన్ని కష్టాలు ఎదురైనా సత్యంపై వెనక్కు తగ్గకుండా విశాలాంధ్రను నిల బెట్టారు. దానిని కేవలం పత్రికగా కాకుండా, ఒక విలువల వేదికగా నిలబెట్టిన మహాను భావుడు రాఘవాచారి" అని సుదర్శన్ రెడ్డి కొనియడారు. రాఘవాచారి మెమోరియల్ ట్రస్ట్ అధ్వర్యంలో విశాలాంధ్ర పూర్వ సంపాదకులు , అక్షరశస్త్రధారి రాఘవాచారి ఆరవ స్మారకోపన్యాసం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో శనివారం తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన జరిగింది. 'ప్రసార మాధ్యమాలు - న్యాయ వ్యవస్థ' అనే అంశంపై జస్టిస్ సుదర్శన్ రెడ్డి ప్రసంగిస్తూ ... మూడు దశాబ్దాల పాటు సంపాదకుడిగా రాఘవాచారి పని చేశారన్నారు. రూ.ఐదు వేలతోనే జీవనం సాగిస్తూ, రిక్షాలలో ప్రయాణం కొనసాగించేవారని గుర్తు చేసుకున్నారు. సంపాదన లేదని సంపాదకుడు రాఘవాచారి అని అన్నారు. ఇది డబ్బు కంటే విలువ, నిబద్ధత, సత్యం పట్ల ఆయనకున్న అంకితభావానికి నిదర్శనం అని అన్నారు. 1939లో పాలకుర్తిలో శ్రీవైష్ణవ కుటుంబంలో జన్మించిన రాఘవాచారి, రామాయణం, మహాభారతం, భాగవతం వంటివి చదివి అర్థం చేసుకున్నారని అన్నారు. గుంటూరు వెల్లి సంపత్ కుమార్, చల్లా సత్యానాయరణల దగ్గర శిష్యరికం చేసి, పంచ కావ్యాలను నేర్చుకున్నారన్నారు. తమిళం, సంస్కృతం, తెలుగు, ఉర్దూ భాషలలో ప్రావీణ్యత సాధించారని చెప్పారు. లాలాగూడ హైస్కూల్లో చదివి, ఉస్మానియా యూనివర్సిటీలో ఇంజినీరింగ్‌లో చేరే అవకాశం వచ్చినా కాదని బీఎస్సీ చేశారని, అనంతరం లా కాలేజీలో చేరి ఎల్‌ఎల్‌ఎం పూర్తి చేశారని వివరించారు. రామాయణం, మహాభారతం చదవిన రాఘవాచారి... శ్రీశ్రీ కవిత్వం పట్ల ముగ్ధుడయ్యారని, మఖ్దూం మొహియొద్దీను శిష్యుడుగా మారారని, కమ్యూనిస్టుగా కొనసాగారన్నారు. ఏది రాయకూడదు, ఏది రాయాలనే అంశాలపై ఆయన పాఠాలు నేర్పారని చెప్పారు. పత్రికలు, యాజమాన్యాలు, సంపాదకులకు అవినాభావ సంబంధం కలిగిన అంశాలు అని సుదర్శన్ రెడ్డి అన్నారు. ప్రభుత్వాలు ఎన్ని నియంత్రణలు తీసుకురావాలని ప్రయత్నించినా, పత్రికల స్వేచ్ఛను ప్రజలు, కోర్టులు కాపాడాయన్నారు. ఆర్టికల్ 19(1)కు సవరణ ద్వారా నెహ్రూ ప్రభుత్వం సహేతుక నియంత్రణకు ప్రయత్నించిందని తెలిపారు. పత్రికల స్వేచ్ఛను కోర్టులు ఎల్లప్పుడూ కాపాడాయని గుర్తు చేశారు. భావ ప్రకటన స్వేచ్ఛ లేకుంటే ప్రజాస్వామ్యం ఉండదు, ఇది కేవలం న్యాయసూత్రం కాదు, జీవనసత్యం అని అన్నారు. భావ ప్రకటన స్వేచ్ఛ ప్రజాస్వామ్యానికి మూలాధారమన్నారు. దాన్ని పూర్తిగా నియంత్రిస్తే ప్రజాస్వామ్యం సారం హీనమవుతుందన్నారు. సోషల్ మీడియా ఇప్పుడు మీడియా చేతుల్లో లేదని, ప్రపంచంలో కొద్దిమంది సంపన్నులు దానిని నియంత్రిస్తున్నారని సుదర్శన్‌రెడ్డి అన్నారు. దీన్ని ఎంతవరకు నియంత్రించవచ్చన్నదే ఇప్పుడు ముంబై హైకోర్టు తీర్పు నేపథ్యంలో సుప్రీం కోర్టులో చర్చ జరుగుతుందని చెప్పారు. రాఘవాచారి స్మారకోపన్యాసంలో పాల్గొనడం తన అదృష్టం అన్నారు. ఆయన జీవితం మనందరికీ ఒక పాఠం అని అన్నారు.

ప్రజల పక్షాన పనిచేసేందుకే మీడియాను రాజ్యాంగంలో చేర్చలేదు: శ్రీనివాస్ రెడ్డి

తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ... రాజ్యాంగంలో మీడియా ప్రస్తావన ఎక్కడా లేదన్నారు. రాజ్యాంగంలో మీడియా ప్రస్తావనను అంబేద్కర్ వ్యతిరేకించారని తెలిపారు. రాజ్యాంగంలో మీడియాను బంధించొద్దని ఆయన చెప్పారన్నారు. ప్రజల పక్షాన మీడియా పనిచేయాలని ఆకాంక్షించారని తెలిపారు. దేశంలో చోటు చేసుకున్న పరిణామాలు, అందరి భావాలు మీడియా చెబుతుందన్నారు. ఎన్ని ఆవరోధాలు వచ్చినా న్యాయ వ్యవస్థ రక్షించిందని పేర్కొన్నారు. ట్రస్ట్ సభ్యులు డి. సోమసుందర్ స్వాగతం పలుకగా, డాక్టర్ సి.అనుపమ వందన సమర్పన చేశారు. పత్రికా రంగ ప్రముఖులు కె.రామ చంద్రమూర్తి, విశాలాంధ్ర సంపాదకులు ఆర్వీ రామారావు, మన తెలంగాణ ఎడిటర్ దేవులపల్లి అమర్, టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు కె.విరాహత్ అలీ, ఐజేయూ నాయకులు ఎం.ఎ.మాజిద్, వై.నరేందర్ రెడ్డి, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివ రావు, ఇన్సాఫ్ జాతీయ అధ్యక్షుడు సయ్యద్ అజీజ్ పాషా, ట్రస్ట్ సభ్యులు కె.జ్యోత్స్న, వై.వి.కృష్ణ, ఎ.చందర్, టి.సురేశ్, బి.జమిందార్ పాల్గొన్నారు.

టీ-20 సిరీస్ భారత్ కైవసం

బ్రిస్బేన్: ఆస్ట్రేలియాను ఆస్ట్రేలియాలో ఓడించడం అంటే మాటలు కాదు. కానీ టీ20ల్లో ఆ జట్టుపై టీమిండియాకు గొప్ప రికార్డే ఉంది. గత 17 ఏళ్లలో టీమిండియా ఆస్ట్రేలియాలో ఒక్కసారి కూడా సిరీస్ కోల్పోలేదు. అదే రికార్డును కొనసాగిస్తూ... తాజాగా టీ20 సిరీస్‌ను భారత్ కైవసం చేసుకుంది. స్ఫూర్తిదాయక ఆటతో ఆస్ట్రేలియాతో ఐదు టీ20ల సిరీస్‌లో 2-1 తేడాతో టీమిండియా సిరీస్ సొంతం చేసుకుంది. తొలి, ఆఖరి మ్యాచ్‌లు వర్షార్పణం కాగా... మూడు మ్యాచ్‌ల్లో రెండుజట్లు తలపడ్డాయి. ఇందులో రెండు మ్యాచ్‌లు భారత్ గెలిచింది. బ్రిస్బేన్ వేదికగా టీమిండియా, ఆస్ట్రేలియా జట్లు ఐదో టీ20లో పోటీ పడ్డాయి. తొలుత ఆసీస్ టాస్ గెలిచి ఫీల్డింగ్ ఎంచుకుంది. దీంతో బ్యాటింగ్‌కు దిగిన టీమిండియా ఆట ఆగే సమయానికి 4.5 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 52 పరుగులు చేసింది. అభిషేక్ శర్మ(23), శుభ్‌మన్ గిల్(29) ఆడినంత సేపు స్కోరు బోర్డును పరుగులు పెట్టించారు. బౌండరీలు బాదుతూ ప్రత్యర్థి బౌలింగ్‌ను చీల్చిచెండాడారు. ఐదు ఓవర్లు కూడా పూర్తి కాకుండానే 50 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు. ఇంతలోనే పిడుగులతో కూడిన వర్షం పడే అవకాశం ఉందని మ్యాచ్‌ను తాత్కాలికంగా నిలిపేశారు. వర్షం తగ్గే సూచన లేకపోవడంతో ఆఖరి మ్యాచ్‌ను రద్దు చేశారు. దీంతో టీమిండియా 2-1 తేడాతో సిరీస్‌ను సొంతం చేసుకుంది. ప్లేయర్ ఆఫ్‌ది సిరీస్‌గా అభిషేక్ శర్మ నిలిచాడు. టీమిండియా ఆసీస్ టూర్‌లో 8 టాస్‌ల్లో ఏడుసార్లు ఓడింది. వన్డేల్లో శుభ్‌మన్ గిల్ సారథ్యంలో టీమిండియా మూడు మ్యాచుల్లో టాస్‌లు ఓడిపోయింది. ఐదు టీ20ల్లో కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ కేవలం ఒక్క మ్యాచ్‌లో మాత్రమే (మూడో టీ20) టాస్ గెలిచాడు. భారత జట్టు గత 12 నెలలుగా ఎక్కువ శాతం టాస్ ఓడిపోతూనే వస్తోంది.

గిరిజన సమస్యలపై రేపు విజయవాడలో ర్యాలీ, మహాధర్నా

భారీగా తరలిరావల్సిందిగా సమాఖ్య పిలుపు

విశాలాంధ్ర బ్యూరో-అనంతపురం: గిరిజన సమస్యల పట్ల పాలకుల నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ ఈ నెల 10న విజయవాడలో భారీ ర్యాలీ, ఎస్టీ కమిషనర్ కార్యాలయం ఎదుట నిర్వహించే మహా ధర్నా కార్యక్రమాలకు రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి గిరిజనులు భారీగా తరలి రావాల్సిందిగా ఆంధ్ర ప్రదేశ్ గిరిజన సమాఖ్య అధ్యక్షులు కారం ధారయ, ప్రధాన కార్యదర్శి వై.ఎల్.రామాంజనేయులు, ఆర్గనైజింగ్ కార్యదర్శి మోటా రాముడు శనివారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. సోమవారం ఉదయం 11 గంటలకు విజయవాడ మొగల్రాజపురం సిద్ధార్థ కళాశాల ఎదురుగా ఉన్న బుద్ద విగ్రహం నుంచి ప్రదర్శన ప్రారంభమై ఎస్టీ కమిషనర్ కార్యాలయానికి చేరుకుంటుందని, అనంతరం అక్కడ ధర్నా చేపడతామని తెలిపారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 78 సంవత్సరాల దాటుతున్నా గిరిజనుల జీవితాలలో చెప్పుకోదగిన మార్పు లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో 500 మంది గిరిజనులు ఉన్న తండాలను పంచాయతీలుగా చేయాలని, ఎస్టీ కార్పొరేషన్, ఐటీడీఏ ద్వారా సొంత పూచీకత్తుపై రుణాలు ఇవ్వాలని, ఎన్‌ఎస్‌ఎఫ్, టీడీసీ లాంటి పథకాలను తిరిగి ప్రవేశపెట్టాలని, ఇతర కులాలను గిరిజన జాబితాలో చేర్చే ప్రయత్నం ఉపసంహరించుకోవాలని, ప్రతి జిల్లాలో ఎస్టీ అసెంబ్లీ రిజర్వ్ సీటు కేటాయించాలని, జిల్లాలో బోగస్ గిరిజనులు ప్రభుత్వ ఉద్యోగాలు చేస్తున్న వారిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలని, ఎస్టీ స్టడీ సర్కిల్ ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఎస్టీ కమిషనర్ కార్యాలయం ఎదుట జరిగే మహా ధర్నాకు ముఖ్య అతిథులుగా సీపీఐ రాష్ట్ర రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఈశ్వరయ్య, సీపీఐ కంట్రోల్ కమిషన్ రాష్ట్ర చైర్మన్, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ హాజరవుతారని రామాంజనేయులు తెలిపారు.

కార్మిక హక్కులపై రాజీలేని పోరు

అమర్‌జిత్ కౌర్ పిలుపు

విశాలాంధ్ర-విజయవాడ: కార్మికుల హక్కుల పరిరక్షణకు రాజీలేని పోరాటాలకు సిద్ధం కావాలని ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి అమర్‌జిత్ కౌర్ పిలుపునిచ్చారు. మనువాద సిద్ధాంతాలకు కట్టుబడి కార్మికులను కట్టుబానిసలుగా మార్చే విధానాలను అడ్డుకోవాలన్నారు. రాజ్యాంగం కల్పించిన ప్రజాస్వామిక హక్కులను కాలరాసే ప్రయత్నాలను తిప్పికొట్టాలని దిల్లీలో శనివారం జరిగిన ఏఐటీయూసీ జాతీయ కార్యవర్గ సమావేశంలో అమర్‌జిత్ కౌర్ పిలుపునిచ్చారు. శ్రమశక్తి నీతి-2025 పేరుతో నూతన కార్మిక విధానాలను ప్రవేశపెట్టాలని పాలకులు ప్రయత్నిస్తున్నారని, ఇందుకోసం ఇటీవల జారీ చేసిన నోటిఫికేషన్... కార్మికులను కట్టు బానిసలుగా మార్చేదిగా ఉందని ఆగ్రహం వ్యక్తంచేశారు. యజమానులకు వ్యతిరేకంగా మాట్లాడితే కార్మికులపై ఉక్కుపాదం మోపే విధానాలను ఎన్డీయే ప్రభుత్వం తీసుకొస్తోందన్నారు. భారతీయ గ్రంథాలలోని మనువాద స్మృతి, యజ్ఞాల వల్క స్మృతి, నారద స్మృతి, శుక్రనీతి, అర్థశాస్త్రం వంటి వాటిలో నిమిషాలను పరిగణనలోకి తీసుకొని రూపొందించాలని ఇందులో కార్మికులు కట్టు బానిసలుగా పనిచేయాలని, ఎవరు ఏమి నోరెత్తి మాట్లాడకూడదని, యజమానులను ఎదిరించకూడదని విధానాలు పొందుపరిచారని వ్యాఖ్యానించారు. నేటి నవ నాగరిక సమాజంలో ఇలాంటివి సాధ్యమా అని అమర్‌జిత్ కౌర్ ప్రశ్నించారు. ఎన్నికల హామీలు నెరవేర్చకుండా అబద్ధాలతో పబ్బం గడుపుకునే పాలకులను నిలదీయాలన్నారు. ఆర్‌ఎస్‌ఎస్, మనువాద సిద్ధాంతాలతో కార్మికుల అణచివేతకు సిద్ధమైందని దుయ్యబట్టారు. 8వ వేతన సంఘం సిఫారసుల్లో కార్మిక వర్గానికి మెరుగైన వేతనాలు కల్పించాలని డిమాండ్ చేస్తుంటే శ్రమశక్తి నీతి-25 తీసుకురావడం విడ్డూరంగా ఉందని అమర్‌జిత్ కౌర్ తెలిపారు. టీడీపీ, జేడీ(యూ) మద్దతుతో దేశంలో ఎన్డీయే పాలన కొనసాగుతోందని, ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు బీజేపీ భుజమెక్కి కార్మిక వర్గానికి తీవ్ర నష్టం కలిగించే ప్రైవేటీకరణ విధానాలను ఎంపిక చేశారని విమర్శించారు. పని గంటలను ఎనిమిది నుంచి పదికి పెంచడంపై... రాష్ట్రంలో కనీస వేతనం బోర్డు, కార్మిక సంక్షేమ బోర్డు, భవన కార్మికుల బోర్డు కోసం రాబోయే రోజుల్లో కార్మిక వర్గం ఉద్యమించాలని అమర్‌జిత్ కౌర్ పిలుపునిచ్చారు. ఏఐటీయూసీ జాతీయ అధ్యక్షుడు రావేంద్రకుమార్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.వెంకటసుబ్బయ్య, కోశాధికారి కొండలరావు, వివిధ రాష్ట్రాల ప్రతినిధులు పాల్గొన్నారు.

చిత్తూరు కలెక్టరు తీరుపై జర్నలిస్టుల నిరసనాగ్రహం

- తిరుపతిలో ఏపీయూడబ్ల్యూజే భారీ ధర్నా
- పత్రికా స్వేచ్ఛపై దాడి అంటూ మండిపాటు

విశాలాంధ్ర-తిరుపతి: చిత్తూరు కలెక్టరు వ్యవహారశైలిపై జర్నలిస్టులు మండిపడ్డారు. విలేకరుల పట్ల దురుసుగా వ్యవహరించడం, మాట్లాడటం, బెదిరింపులకు పాల్పడటంపై నిరసన వ్యక్తంచేశారు. కలెక్టరు తీరుకు నిరసనగా ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఏపీయూడబ్ల్యూజే) అధ్వర్యంలో శనివారం తిరుపతిలో భారీ ధర్నా జరిగింది. స్థానిక గాంధీ విగ్రహం ఎదుట జరిగిన ఈ నిరసనలో జర్నలిస్టు సంఘాల నేతలు, సభ్యులు పెద్దఎత్తున పాల్గొన్నారు. కలెక్టరు వైఖరికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ... తక్షణమే ఆయనపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏపీయూడబ్ల్యూజే తిరుపతి జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎం.ప్రసాద్ మాట్లాడుతూ గతంలో విలేకరులను రాజకీయ నాయకులు, రౌడీలు, స్మగ్లర్లు, గూండాలు బెదిరించేవారని, ఇప్పుడు ఏకంగా ఐఏఎస్ అధికారులే బెదిరింపులకు దిగడం విచారకరమన్నారు. ఒక ఉద్యోగి ఫిర్యాదు చేశారని సాకుగా చూపి ఇద్దరు విలేకరులకు కలెక్టరు ఫోన్ చేసి...మిమ్మల్ని లేపేస్తానని బెదిరించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. కలెక్టరు అనే విషయాన్ని కూడా మర్చిపోయి... మెజిస్ట్రేట్ స్థాయిలో ఏమిటీ ప్రవర్తన అని మండిపడ్డారు. విలేకరులను బెదిరించడమే కాకుండా, వారి పిల్లలు ఎక్కడున్నారో ట్రాక్ చేస్తాను, అంతు చూస్తాను అని కలెక్టరు బెదిరించడం దారుణమన్నారు. విలేకరుల పిల్లలు ఎక్కడ చదువుతున్నారో వెతకాల్సిన అవసరం లేదని, ఆ సమాచారం తామే ఇస్తామని ప్రసాద్ చెప్పారు. ఆ విలేకరి పిల్లలకు ఏదైనా జరిగితే కలెక్టరుగా మీదే బాధ్యతని హెచ్చరించారు. వెటరన్ జర్నలిస్ట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ టి.జనార్దన్ మాట్లాడుతూ కలెక్టరు వ్యవహారశైలి రాజ్యాంగ విరుద్ధమన్నారు. రాజ్యాంగ హక్కులు కాలరాస్తారా అని ప్రశ్నించారు. రాజకీయ నాయకులకు, స్మగ్లర్లకు, క్వారీ యజమానులకు అండగా ఉంటూ విలేకరులను బెదిరించడం సరికాదని హితవు పలికారు. తిరుపతి ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు మురళి మాట్లాడుతూ కలెక్టరు బెదిరింపు ధోరణిని ఖండించారు. విలేకరుల తప్పు ఉంటే చట్టపరంగానో, న్యాయబద్ధంగానో చర్యలు తీసుకోవాలే తప్ప వ్యక్తిగతంగా మాట్లాడడం బాధాకరమన్నారు.

చర్యలు తీసుకోకపోతే రాష్ట్రవ్యాప్త ఆందోళన

కలెక్టరు చేసిన వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకోవాలని, విలేకరులపై పెట్టిన కేసులు తక్షణం ఎత్తివేయాలని జర్నలిస్టు నాయకులు డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి కలెక్టరుపై చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో జర్నలిస్ట్ సంఘాల అధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి ప్రెస్‌క్లబ్ కార్యదర్శి బాలు, ఏజేయూ జాతీయ సమితి సభ్యులు రాజేంద్ర, ఏపీయూడబ్ల్యూజే జిల్లా కోశాధికారి చంద్రబాబు, సహాయ కార్యదర్శులు శీను బాబు, కోటేశ్వరరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు రాధాకృష్ణ, బాలయ్య, విశాలాంధ్ర తిరుపతి ఎడిషన్ మేనేజర్ సుబ్బరాయుడు, చిత్తూరు జిల్లా కోశాధికారి వాలీశ్వర్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులు ఎల్ఎస్ ఖాన్, ఉదయ్, సీనియర్ జర్నలిస్టులు రాఘవ, శ్రీకాంత్, జర్నలిస్టులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. తిరుపతి చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు మోహన్ కుమార్ రాజు సంఘీభావం తెలియజేశారు.

విద్యార్థులతో పెట్టుకుంటే ప్రభుత్వాలు కూలిపోతాయి

- ఏఐఎస్ఎఫ్ హెచ్చరిక
- నంద్యాల చేరిన బస్సు జాత

విశాలాంధ్ర బ్యూరో-నంద్యాల: విద్యార్థులతో పెట్టుకుంటే ప్రభుత్వాలే కూలిపోతాయని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వలరాజు, బందల నాసర్ జీ హెచ్చరించారు. విద్యారంగ సమస్యల పరిష్కారానికి డిమాండ్ చేస్తూ ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి అధ్వర్యంలో చేపట్టిన బస్సు యాత్ర శనివారం 19వ రోజు నంద్యాలకు చేరుకుంది. ఈ సందర్భంగా శ్రీరామకృష్ణ డిగ్రీ కళాశాల వివేకనంద ఆడిటోరియంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సూర్య ప్రతాప్ అధ్యక్షతన సభ జరిగింది. వలరాజు, నాసర్‌జీ మాట్లాడుతూ విద్యార్థులకు ఇచ్చిన హామీల అమలులో కూటమి ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. అధికారంలోకి వస్తే నెల రోజుల్లో ఫీజు బకాయిలు రూ.6,400 కోట్లు విడుదల చేస్తామని చెప్పారు కానీ ఏడాదిన్నర గడిచినా ఆ దిశగా చర్యలు లేవని దుయ్యబట్టారు. వైద్య కళాశాల ప్రైవేటీకరణతో పేద విద్యార్థులకు వైద్య విద్య దూరమవుతుందని ఆందోళన వ్యక్తంచేశారు. ప్రభుత్వ వసతి గృహాలలో నాణ్యమైన వసతులు, ఆహారం లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నట్లు తెలిపారు. పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్, కాస్మోటిక్ చార్జీలు పెంచాలని నాయకులు డిమాండ్ చేశారు. ఉన్నత విద్యను దూరం చేసే జీవో 77 రద్దు చేయాలన్నారు. రాష్ట్రంలోని జూనియర్, డిగ్రీ కళాశాలలు, విశ్వ విద్యాలయాలలో టీచర్, లెక్చరర్, ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. విద్యా వ్యతిరేక విధానాలు కొనసాగిస్తే కూటమి ప్రభుత్వాన్ని విద్యార్థుల కూలగొట్టేందుకు సిద్ధమవుతారని హెచ్చరించారు. నంద్యాలలో అగ్రికల్చర్ యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని నాయకులు డిమాండ్ చేశారు. ఈనెల 12న అనంతపురంలో ముగింపు సభ అనంతరం రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులను సమీకరించి సమరశీల పోరాటాలు నిర్వహిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జాతీయ మాజీ అధ్యక్షులు మురళీధర్, రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు రంగనాయుడు, ఆఫీస్ బేరర్లు కుల్లాయిస్వామి, నాగభూషణం, మస్తాన్, బండి చలపతి, పణిధర్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి సుంకయ్య, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి నాగరాముడు, వైసీపీ విద్యార్థి విభాగం నాయకులు సాయిరాం రెడ్డి, పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి రాంబాబు, ఎస్డీపీఐ నాయకులు ఏజాస్, ఏఐఎస్ఎఫ్ నాయకులు మాధవ్, ప్రవీణ్, శశిరెడ్డి, చంద్రశేఖర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

బస్‌స్టాప్ పైకి దూసుకెళ్లిన కారు

ముగ్గురు మృతి... మరో ముగ్గురికి తీవ్ర గాయాలు

విశాలాంధ్ర-ప్రత్తిపాడు/కిర్లంపూడి: బస్సు కోసం వేచి ఉన్న వారు క్షణాల్లో ప్రాణాలు కోల్పోయారు. కాకినాడ జిల్లా కిర్లంపూడి మండలం సోమవరం గ్రామం వద్ద జాతీయ రహదారి ఎన్‌హెచ్ 16 పై శనివారం జరిగిన ఈ ఘోర రోడ్డు ప్రమాదం స్థానికులను భయాందోళనకు గురి చేసింది. కారు టైర్ పేలిపోవడంతో అదుపు తప్పి బస్‌స్టాప్ వద్ద ఉన్న వారిపై దూసుకెళ్లడంతో ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందారు. మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం అన్నవరం నుంచి రాజమండ్రి వైపు వెళుతున్న పెళ్లి కారు అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న బస్‌స్టాప్‌లో నిలబడి ఉన్న విద్యార్థులు, ప్రయాణికుల పైకి దూసుకెళ్లింది. అంతేకాకుండా, పక్కన నిలిపిన బైక్, మూడు చక్రాల వాహనాన్ని కూడా ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో సోమవరం గ్రామానికి చెందిన మోర్త ఆనందరావు (60), మోర్త కొండయ్య (30), ఏలేశ్వరం గ్రామానికి చెందిన కాకాడ రాజు (60) అక్కడికక్కడే మృతి చెందారు. కాకాడ రాజు స్థానికంగా బొప్పాయి కాయలు విక్రయించే వ్యక్తి అని గ్రామస్తులు తెలిపారు. ఈ ఘటనలో బస్సు కోసం ఎదురుచూస్తున్న విద్యార్థులు కొంద్రపు చైతన్య, చీపురుపల్లి స్రవంతి, బత్తిన భద్రరావు తీవ్రంగా గాయపడ్డారు. మరో నలుగురికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు, పోలీసులు వెంటనే స్పందించి క్షతగాత్రులను ప్రత్తిపాడు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వారిలో ఇద్దరి పరిస్థితి విష మంగా ఉండటంతో కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. ప్రమాదం విషయం తెలిసిన వెంటనే జగ్గంపేట, ప్రత్తిపాడు ఎమ్మెల్యేలు జ్యోతుల నెహ్రూ, వరుపుల సత్యప్రభ, పెద్దా పురం డీఎస్పీ శ్రీహరి రాజు సంఘటన స్థలానికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. బాధిత కుటుంబా లను పరామర్శించి, గాయపడిన వారిని పరామర్శించి... మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరారు. తర్వాత కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న విద్యార్థులను కలుసుకొని ధైర్యం చెప్పారు. ఈ ఘటన చాలా బాధాకరమని, బాధిత కుటుంబాలకు ప్రభుత్వం నుంచి తగిన సహాయం అందేలా చూస్తామని ఎమ్మెల్యేలు తెలిపారు. ప్రమాద స్థలాన్ని పరిశీలించిన కిర్లంపూడి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా పూర్తి వివరాలు వెలికితీయనున్నట్లు అధికారులు తెలిపారు.

ఫిరోజ్ బాషా బోధన భేష్: లోకేశ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: విద్యారంగంలో ఆదర్శంగా నిలుస్తున్న పిడుగురాళ్ల మండలం, తుమ్మలచెరువు మెయిన్ పాఠశాల సెకండరీ గ్రేడ్ టీచర్ షేక్ ఫిరోజ్ బాషాను మంత్రి నారా లోకేశ్ అభినందించారు. రోజూ ఉదయం పాఠశాల వేళలకు ముందుగా చేరుకుని, సాయంత్రం అదనపు సమయం వెచ్చిస్తూ విద్యార్థులకు తరగతులు నిర్వహిస్తున్న ఆయన నిబద్ధతను ప్రశంసించారు. ఫిరోజ్ బాషా నేర్పిన తెలుగు, ఇంగ్లీష్ రాతలు డిజిటల్ ప్రింటింగ్‌లా ఉన్నాయన్నారు. వివిధ సబ్జెక్టుల్లో పిల్లలకు ఉన్న భయాలు పోగొట్టేందుకు ఆటపాటలతో బోధిస్తూ ఎంతోమందికి ఫిరోజ్ స్ఫూర్తిగా నిలుస్తున్నారని లోకేశ్ అన్నారు. 200 మంది విద్యార్థులు ఈ పాఠశాలలో చదువుతున్నారని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో తాను కోరుకుంటున్న మార్పు ఇదేనని లోకేశ్ అన్నారు.

సెక్స్ రాకెట్ గుట్టురట్టు

కోటి నగదు, లగ్జరీ కార్లు స్వాధీనం

కోల్‌కతా: మానవ అక్రమ రవాణా ముఠాను బెంగాల్ పోలీసులు పట్టుకున్నారు. బార్లు, హోటళ్లలో సెక్స్ రాకెట్ నడుపుతున్న జగ్జిత్ సింగ్, అజ్మల్ సిద్ధిఖీ, బిష్ణు ముంద్రా, వారి సహచరులను అరెస్ట్ చేశారు. కోటికిపైగా డబ్బు, రెండు లగ్జరీ కార్లను ఈడీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. మనీలాండరింగ్ దర్యాప్తులో భాగంగా ఈడీ ఏకకాలంలో కోల్‌కతా, సిలిగురి, ఉత్తర 24 పరగణాల జిల్లాలోని బిధాన్‌నగర్‌లో ఎనిమిది ప్రాంగణాలను తనిఖీ చేసింది. రూ.1.01 కోట్లకు పైగా నగదు, ల్యాండ్ రోవర్ డిఫెండర్, జాగ్వార్, డిజిటల్ పరికరాలు, ఆస్తి పత్రాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. బ్యాంకు ఖాతాలను గుర్తించారు. చట్టవిరుద్ధ కార్యకలాపాలకు చెల్లింపుల కోసం 'ప్లాస్టిక్ నోట్లు' ఉపయోగిస్తున్నట్లు ఈడీ అధికారులు గుర్తించారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No.148108 (TEL TEL/2017/75553), Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.